# నడుస్తున్న తెలంగాణ

ఆర్థిక, రాజకీయ, సాహిత్య మాసపత్రిక

సంపుటి: 9 సంచిక: 9 హైదరాబాద్ 103 సెప్టెంబర్ 2019 పేజీలు : 52 వెల: 20/-

- ప్రమాదంలో ప్రజాస్వామ్యం
- ఫెలోషిప్ అన్‌టచ్‌బులిటి
- కశ్మీర్ మొన్న రాజ్యం, నిన్న రాష్ట్రం, నేడు...?
- దూకుడుగా ఫాసిజం - స్తబ్ధంగా ప్రజాస్వామ్యం





















కశ్మీర్‌పై భారత ప్రభుత్వ దమన నీతికి వ్యతిరేకంగా ప్రపంచ వ్యాప్తంగా వెల్లువెత్తిన ప్రజా నిరసన



# నడుస్తున్న తెలంగాణ

ఆర్థిక, రాజకీయ, సాహిత్య మాసపత్రిక

ISSN 2349-2376

సెప్టెంబర్ 2019

సంచిక : 9

సంపుటి : 9



గౌరవ సంపాదకులు

**ప్రొ॥ అడపా సత్యనారాయణ**

సలహామండలి

**అల్లం నారాయణ**

చైర్మన్–ప్రెస్ అకాడమి

**చిక్కుడు ప్రభాకర్**

అడ్వకేట్–న్యాయ సలహాదారు

ప్రధాన సంపాదకుడు

**డా॥చింతకింది కాశీం**

సంపాదకురాలు

**స్నేహలత ఎం.**

సంపాదకవర్గం

**డా॥ఎ.సిల్మానాయక్**, అసోసియేట్ ప్రొఫెసర్

**క్రాంతి**, జర్నలిస్టు

**శివరాత్రి సుధాకర్**, పరిశోధక విద్యార్థి

**ప్రతాప్ గోపగళ్ల**, పరిశోధక విద్యార్థి

డిటిపి, లే ఔట్ : స్నేహ

కవర్ డిజైన్ : క్రాంతి



రచనలు, చందాలు, విరాళాలు పంపవల్సిన చిరునామా

**స్నేహలత ఎం.,**

క్వార్టర్ నెం. R–9, O.U క్వార్టర్స్,

ఉస్మానియా యూనివర్శిటి, హైదరాబాద్–500 007.

ఇ.మెయిల్: **nadusthunnatelangana@gmail.com**

**ఫోన్ నెం.: 9290745490**



**నడుస్తున్న తెలంగాణ అకౌంట్ నెంబర్: 62254225854**

ఎస్‌బిహెచ్, రాంకోఠి బ్రాంచ్(20350), హైద్రాబాద్.

IFSC: SBIN0020350


## సంపాదకుని ఉత్తరం

నేను
నడిచొచ్చి
చాలా రోజులయింది

నా కాళ్లకు
దుమ్ము పేరి
వసంతాలే గడిచాయి

వర్షంలా దుఃఖించి
ఎన్నాళ్లయిందో?

నేలకు ఆనని
పాదాల కన్నీళ్లు

ఇపుడొక
పురాస్మృత జ్ఞాపకం

వీరుడి పాద ధూళి
వ్యాపించినప్పుడల్లా
నేను నిలువునా
మట్టిలా కరుగుతాను

1 సెప్టెంబర్ 2019


నూరు పూలు వికసించనీ, వేయి ఆలోచనలు సంఘర్షించనీ అన్నట్లు ప్రజానుకూలమైన భిన్న ఆలోచనలకు మా పత్రికలో చోటుంటుంది. కనుక ఈ పత్రికలో ముద్రించిన అభిప్రాయాలు రచయితలవే. సంపాదక వర్గానికి ఏకీభావం ఉండనవసరం లేదు.

## తెలంగాణ తొవ్వ

**సంపాదకీయం**

| | | |
|---|---|---|
| ప్రమాదంలో ప్రజాస్వామ్యం | **స్నేహలత ఎం.** | 5 |

**నడుస్తున్న కాలం**

| | | |
|---|---|---|
| ఫెలోషిప్ అన్‌టచ్‌బులిటి | **చింతకింది కాశీం** | 6 |
| కశ్మీర్ మొన్న రాజ్యం, నిన్న రాష్ట్రం, నేడు.......? | **ఎనిశెట్టి శంకర్** | 10 |
| కశ్మీర్‌పై కాషాయ దాడి | **వి.గోపినాథ్** | 17 |
| జమ్మూ కశ్మీర్-ఐరాస తీర్మానాలు | **ఎ.జి.నురాని** | 19 |
| యురేనియం-ప్రజాభిప్రాయాలు | **గీతాంజలి** | 24 |

**జాతీయం**

| | | |
|---|---|---|
| దూకుడుగా ఫాసిజం-స్తబ్ధంగా ప్రజాస్వామ్యం | **ఎ.నర్సింహ్మారెడ్డి** | 28 |

**శ్రమజీవి**

| | | |
|---|---|---|
| హమాలీలు; అసమాన జీతభత్యాలు | **సామ్రాజ్యం** | 34 |

**పరిశోధన**

| | | |
|---|---|---|
| గ్రామ దేవతలకు బ్రాహ్మణ దేవుళ్ల ప్రమాదం | **ఎం.సంధ్య** | 38 |

**సాహిత్యం**

| | | |
|---|---|---|
| ముళ్లకంచె **గల్పిక** | **సమీర** | 41 |
| వర్గీకరణోద్యమ చాటింపు- చిటికె కోలా దండోర | **ఇమ్మిడి మహేందర్** | 42 |

**నివేదిక**

| | | |
|---|---|---|
| భూమి పట్టాలకై ప్రజల పోరాటం | **జనార్ధన్** | 46 |

**కరపత్ర సాహిత్యం**

| | | |
|---|---|---|
| అటవీభూములకు పట్టాలివ్వాలి | **తెలంగాణ ప్రజా ఫ్రంట్** | 47 |
| కుల రహిత, మతరహిత అస్తత్వం కోసం | | 49 |

సంపాదకీయం

# ప్రమాదంలో ప్రజాస్వామ్యం

స్నేహలత ఎం.

ప్రభుత్వ పాలనలోకి బీజేపీ తిరిగి వచ్చింది మొదలు, ఈ దేశ ప్రజలపై చట్ట సవరణల జల్లు కురిపిస్తూనే ఉంది. జనాలు మొస తీసుకోకుండా వారిని పరిగెత్తిస్తూనే ఉంది. మొదటి పార్లమెంట్ సమావేశాల్లోనే 20కిపైగా చట్టాలను సవరించింది. ఊపా, ట్రిపుల్ తలాక్ రద్దు, ఆర్టికల్ 370, 35ఎ రద్దు ఇలా రాత్రికి రాత్రే చట్టసభల్లో సవరణలకు ఆమోద ముద్ర వేయించుకుని మరీ ప్రజలపై కొరడా ఝుళిపిస్తూనే ఉంది. దేశ రాజ్యాంగం ప్రజలకు హామీ పడిన చట్టాలను, హక్కులను ఒక్కొక్కటిగా తుడిచిపెట్టేస్తున్నది. ఇప్పుడు తాజాగా అసోంలో జాతీయ జనాభా రిజిస్టర్ నమోదు పేర పౌరసత్వం నిరూపించుకోలేకపోయిన వారిని విదేశీయులుగా వెళ్లగొట్టాలని చూస్తోంది. మరోవైపు తెలంగాణకు ఆక్సీజన్ అందిస్తున్న నల్లమలను యురేనియం కోసం తవ్వి జల్లెడ చేయడానికి అనుమతులిస్తోంది. ఇలా కేంద్ర ప్రభుత్వం చేస్తున్న దుశ్చర్యలన్నీ ప్రజా వ్యతిరేకమైనవిగానే ఉన్నాయి.

ప్రజాస్వామ్యం కోసం గొంతు విప్పే మేధావులు కానీ, కశ్మీర్‌లో కనీస అవసరాలు తీరక అవస్థలు పడుతున్న ప్రజలు కానీ, తమ ఉనికినే భూస్థాపితం చేయబోతున్న యురేనియం తవ్వకాలపై ఆదివాసులు గానీ ఏమనుకుంటున్నారో, అక్కడ వారి పరిస్థితి ఏమిటో కూడా సమాజానికి తెలీకుండా మీడియా కూడా ప్రభుత్వ చర్యలకు అనుకూలంగానే వ్యవహరిస్తోంది.

గడిచిన ఐదు సంవత్సరాల కాలంలో రాజ్యం దేశంలో మేధావులను, ప్రజాస్వామికవాదులను ఊపా చట్టంతో నిర్బంధించింది. సంఘ్ శక్తులతో హత్యలు, దాడులు చేయించింది. ముందుగా మాట్లాడే గొంతే లేకుండా చేయడానికి ప్రయత్నించింది. ఇప్పుడు సంస్థలు, వ్యక్తులు ఎవరైనా సరే అనుమానం వస్తే ఉగ్రవాదిగా ముద్రించి నిర్బంధించవచ్చు అనే చట్టసవరణ తీసుకొచ్చింది. ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే వారెవరినైనా ఉగ్రవాదిగా చిత్రించవచ్చన్నమాట. అంటే దీనితో ప్రజల తరపున, ప్రజల కోసం మాట్లాడే గొంతే లేకుండా నొక్కేయాలనుకుంటోంది.

జమ్మూ కశ్మీర్ భారత్‌లో విలీనం అయిన నాటి నుంచీ ఈ దేశ పాలకులు దానిపై పెత్తనం కోసం ప్రయత్నిస్తూనే ఉన్నారు. రాజ్యాంగంలో కశ్మీర్ విలీనానంతరం ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే 370 ఆర్టికల్‌ను చేర్చారు. కానీ, ఆనాటి నుంచి నేటి వరకూ కశ్మీర్ అనగానే దేశ ప్రజలందరి మస్తిష్కాల్లో ఒక మతపరమైన సమస్యగా గుర్తుండేట్లు చిత్రిస్తూ వచ్చారు. ఇప్పుడు కశ్మీర్ ప్రజలు ఏమనుకుంటున్నారో కూడా ఇతరులకు తెలీకుండా, ప్రచారం లేకుండా, చర్చే లేకుండా సమస్యను మూసేస్తున్నారు. ప్రభుత్వం తెచ్చిన సవరణకు ఆమోద ముద్రను తెచ్చుకుంటున్నారు. కశ్మీర్‌లో కనీసం అత్యవసరమైన మందులు, పసిపిల్లలకు పాలు కూడా దొరకని పరిస్థితి ఉందని సోషల్ మీడియాలో మొత్తుకుంటున్నా కదిలేవారే లేని స్థితి దేశంలో ఉంది.

మరోవైపు భారత ప్రభుత్వం విడుదల చేసిన నేషనల్ రిజిస్టర్ ఆఫ్ సిటిజెన్స్ జాబితాలో 19,06657 మందికి చోటు దక్కలేదు. నేషనల్ రిజిస్టర్ ఆఫ్ సిటిజెన్‌షిప్ కోసం అస్సాం రాష్ట్రానికి చెందిన దాదాపు 3.29 కోట్ల మంది దరఖాస్తు చేసుకున్నారు. కాగా... వీరిలో పందొమ్మిది లక్షల మంది తిరస్కరణకు గురయ్యారు. బంగ్లాదేశ్ నుంచి అక్రమంగా దేశంలోకి చొరబడ్డారనే సాకుతో వీరందరినీ ఈ దేశ పౌరులుగా గుర్తించడానికి ప్రభుత్వం నిరాకరించింది. ఈ తిరస్కరణకు గురైన వారిలో మెజార్టీ ముస్లిం ప్రజలే ఉండడం గమనార్హం. దేశంలో 1951లో తొలిసారి నేషనల్ రిజిస్టర్ ఆఫ్ సిటిజెన్స్ సర్టిఫై చేశారు. ఇప్పుడు అస్సాం రాష్ట్రానికి ప్రత్యేకంగా చేశారు. నిజానికి ఇది అస్సాంతో ఆగేది కూడా కాదు. దీన్ని దేశంలోని వేరు వేరు ప్రాంతాలకు వర్తింప జేయడం ద్వారా లక్షలాది మందిని నిర్వాసితులను చేయనున్నారు. చొరబాటు దారుల పేరుతో మైనార్టీలపై దాడులకు తెగబడే అవకాశమూ లేకపోలేదు.

ఇంతకాలం మావోయిస్టు ముద్రవేసి ఆదివాసులను, టెర్రరిస్టు ముద్రవేసి ముస్లింలను అణచివేసిన పాలకవర్గాలు ఇప్పుడు నిర్బంధ రూపాలకు మరింత పదును పెడుతున్నాయి. అభివృద్ధి ముసుగున ఆదివాసీలను నిర్వాసితులను చేసేందుకు కొత్త వ్యూహాలతో ముందుకు వస్తున్నాయి. నల్లమలలో యురేనియం తవ్వకాలు అందులో భాగమే.

ప్రపంచంలో చాలా దేశాలు అణు విద్యుత్ కేంద్రాలను, యురేనియం తవ్వకాలను ఆపివేయాలని నిర్ణయించుకున్నాయి. దేశ ప్రజల్ని, పర్యావరణాన్ని రక్షించేందుకే ఈ నిర్ణయానికి వచ్చామని ఆయా దేశాలు చెబుతున్నాయి. అయినా సరే, సామ్రాజ్యవాద దేశాల కనుసన్నల్లో కేంద్ర ప్రభుత్వం తెలంగాణ గుండెకాయైన నల్లమలను తవ్వి పులులతో సహా ఎన్నో జంతువులను, వందల సంవత్సరాల చరిత్ర ఉన్న వృక్ష సంపదను, వన మూలికలతో పాటు 110 గూడాల్లోని పదివేల మంది ఆదివాసులను బలి చేయాలనుకుంటోంది. జీవనదైన కృష్ణానదిని కూడా తరతరాలకు పనికిరాకుండా కలుషితం చేయాలనుకుంటోంది. స్థానిక ప్రజల అభిప్రాయం, సుముఖత లేకుండా యురేనియం తవ్వకాలు చేపట్టరాదని సుప్రీంకోర్టు చెప్పినా సరే ప్రభుత్వం పట్టించుకోదల్చుకోలేదు. ఒకసారి నల్లమలలో వజ్రాలని, బంగారమని, యురేనియమని, అభయారణ్యమని ఇలా పలు పేర్లతో ప్రచారం చేసి, యురేనియం నిక్షేపాలు ఎంత లోతులో ఉన్నాయో తెలుసుకోవడం కోసం వేల ఫీట్ల లోతులో బోర్లు వేసింది. ఇప్పుడు ఏదో ఒక రూపంలో వచ్చి నల్లమలను బొందలగడ్డగా మార్చాలనుకుంటోంది. ఇలాంటి సందర్భంలో ప్రజలు ప్రజాస్వామ్యం కోసం, జాతులు విముక్తి కోసం పోరాడాల్సి ఉంది.

***3 సెప్టెంబర్, 2019***

# ఫెలోషిప్ అన్‌టచ్‌బులిటి

చింతకింది కాశీం


దేశ వ్యాపితంగా వివిధ విశ్వవిద్యాలయాలలో పరిశోధన చేస్తున్న ఎస్సీ, ఎస్టీ పరిశోధక విద్యార్థులకు దశాబ్దంకు పైగా అందుతున్న రాజీవ్‌గాంధీ నేషనల్ ఫెలోషిప్స్(RGNF)ను నేటి కేంద్ర ప్రభుత్వం గత మూడు సంవత్సరాలుగా నిలిపివేసింది. పైగా ఎస్టీ విద్యార్థులను వేరు చేసి క్రమం తప్పకుండా వారికి మాత్రమే ఫెలోషిప్స్ విడుదల చేస్తున్నారు. ఎస్సీ విద్యార్థులకు ఆగిపోవడానికి కారణాలు కూడా బయటకేమీ రాలేదు. ప్రభుత్వ వర్గాల నుంచి ఏ సమచారం లేదు. ఫలితంగా ఆ వర్గానికి చెందిన విద్యార్థులలో ఆందోళన మొదలైంది. జేఆర్ఎఫ్, ఆర్‌జేఎన్ఎఫ్, సీఎస్ఆర్ఐ లాంటి ఫెలోషిప్స్ ఉంటే తప్ప పరిశోధనలు జరగటం కష్టం. కనుక దేశ వ్యాపితంగా ఉన్న ఎస్సీ స్కాలర్స్ ఆయా విశ్వవిద్యాలయాలలో తమ నిరసనను వ్యక్తం చేస్తున్నారు. రాజ్యాంగ ఫలాలను సకాలంలో లబ్ధిదారులకు అందించటంలో విఫలమైన పాలకవర్గాలు ఈ నిరసనలను విజ్ఞాపనలుగా గుర్తించి సానుకూల దృష్టితో సమస్యను పరిష్కరించాలి. అలా కాకుండా రాజకీయ, సామాజిక కోణంలో ఆలోచించి వైరి వర్గాల అలజడిగా పరిగణిస్తే ఆందోళనలు మరింత ముందుకు వెళ్లవచ్చు.

విశ్వవిద్యాలయాల స్థాయిలో జరిగే పరిశోధనలకు ప్రపంచ వ్యాపిత గుర్తింపు ఉంటుంది. పరిశోధనల ఫలాలు, పరికరాలు ఉత్తమమైనవైతే అకాడమిక్ మేధోరంగం వాటిని సొంతం చేసుకుంటుంది. అయితే ఏ దేశంలోనైనా భిన్న సామాజిక సమూహాల ప్రవేశంతోనే పరిశోధన రంగం వికసిస్తుంది. కాని భారతదేశంలో సామాజిక అంతరాల కారణంగా కొన్ని సమూహాలు వేల సంవత్సరాలుగా విద్యకు, మేధో రంగానికి దూరం చేయబడ్డాయి. వైదిక వాఙ్మయం పేరిట చలామణి అయిన వ్యవస్థలు మానవ సమానత్వ భావనను అంగీకరించలేదు. అందుకే మన దేశంలో ప్రపంచం గర్వించదగిన ప్రయోగాలు, పరిశోధనలు, ఫలితాలు రాలేదు. మెజార్టీ ప్రజల ఆలోచనలు చాలారోజుల వరకు విద్యకు ఆవల ఉండిపోయాయి. శాస్త్ర సాంకేతిక రంగమంటే ఒకటి రెండు వర్గాలకే పరిమితమైన స్థితి నేటికి ఉంది. బహుళ ఆలోచనలకు పరిమితులు లేని సమాజంలో పరిశోధనలు జరిగినప్పుడే సమాజ గమనం ముందుకు వెళ్తుంది.

బ్రిటిష్ అనంతర భారతదేశంలో దళితులు రాజ్యాంగ వ్యవస్థలు కల్పించిన ఫలితాలను పొందడానికి చాలా కాలం పట్టింది. ఈ దేశంలో ఒక ప్రభుత్వం, దానికొక నిర్మాణం, తమ మనుగడ కోసం అది కల్పించే అవకాశాలు తెలియని లోకంలో దళితులను ఉంచారు. స్వయంగా అంబేద్కర్ పోరాటం చేసి సాధించి పెట్టిన హక్కుల స్పృహ కూడా మెజార్టీ దళితులకు 1970 వరకు లేదు. రాజ్యాంగం అమలులోకి వచ్చాక విద్య-ఉద్యోగాలలో రిజర్వేషన్ ఫలాలను అందుకోవాలనే చైతన్యం చాలా ఆలస్యంగా పొందిన దళితులు ఉన్నత విద్యారంగంలోకి 90వ దశకంలో ప్రవేశించారు. అంటే 1950లో రాజ్యాంగం అమలులోకి వస్తే ఈ వర్గాలు విశ్వవిద్యాలయ స్థాయి విద్యను అందుకోవడానికి నలభై ఏళ్లు పట్టింది. ఆ నాటికైనా శ్రమ జీవితం నుంచి పొందిన జ్ఞానాన్ని జోడించి పరిశోధనలు చేయడానికి దళిత విద్యార్థులకు ఆర్థిక వెసులుబాటు లేదు. పీజీ స్థాయి విద్యతో సరిపెట్టుకునే పరిమితి దళిత విద్యార్థులకు ఏర్పడింది. పరిశోధనలలోకి కొత్త సామాజిక సమూహాలు, వారి ఆలోచనలు ప్రవేశించాలంటే ఆ విద్యార్థులకు ఫెలోషిప్స్ ఇవ్వాలనే డిమాండ్ ఎప్పటి నుంచో ఉండింది. దానికి తగిన పోరాటం లేకపోయినా మేధావి వర్గంలో చర్చ నడిచింది.

ఈ సందర్భంలోనే 2004లో కాంగ్రెస్ పార్టీ యూపీఏ పేరు మీద కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. రాజీవ్ గాంధీ మరణం తర్వాత ఆ పార్టీకి దేశ వ్యాపితంగా ప్రభావితం చేసే నాయకుడు లేకుండాపోయాడు. సొంత బలంతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే శక్తిని కూడా అది కోల్పోయింది. ప్రాంతీయ పార్టీలు ఏర్పడడం, బహుజన సమాజ్‌వాది పార్టీ పుట్టడం, అస్తిత్వ ఉద్యమాలు ముందుకు వచ్చి అగ్రకుల పాలకపార్టీల మీద విమర్శ పెట్టడం, మేధావి వర్గంలో విప్లవ శక్తులకు మద్దతు పెరగడం లాంటి అనుకూల పరిస్థితి ఒకవైపు ఉండగా దేశ ప్రజల ప్రయోజనాలను ప్రతిబింబించే అభివృద్ధి నమూనా కాంగ్రెస్ పార్టీ వద్ద లేకపోగా బహుళజాతి కంపెనీలకు అనుకూలమైన ఆర్థిక విధానాలను రూపొందించింది. స్థూలమైన

ఈ అయిదు కారణాల వలన దేశంలో కాంగ్రెస్ పార్టీ ప్రభ తగ్గిపోయింది. ముఖ్యంగా ఆ పార్టీకి నెహ్రూ కాలం నుంచి బలమైన ఓటు బ్యాంకుగా ఉన్న ఎస్సీ, ఎస్టీ వర్గాలు దూరం జరగటం మొదలైంది. ఇట్లాంటి వాతావరణంలో 2004లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో యూపీఏ అధికారంలోకి వచ్చింది.



కాంగ్రెస్ పార్టీకి దూరమైన సమూహాలను దగ్గరకు చేసుకొనే నష్ట నివారణ చర్యలను ఆ పార్టీలోని కొందరు ప్రజాస్వామిక వాదులు సోనియా గాంధీకి సూచించారు. దాని కోసం ఒక కార్యాచరణను రూపొందించాలని కూడా భావించారు. అందులో భాగంగానే జూన్ 4, 2004న సోనియా గాంధీ చైర్మన్‌గా నేషనల్ అడ్వజరి కౌన్సిల్(NAC) ఏర్పాటైంది. నేషనల్ కామన్ మినిమమ్ ప్రోగ్రాంలో భాగంగానే ఎన్ఏసి ఏర్పడింది. 'మన్మోహన్‌సింగ్ క్యాబినెట్ ఉండగా ఎన్ఏసి పేరిట మరో రాజ్యాంగేతర కాబినెట్‌ను సోనియాగాంధీ రూపొందించు కున్నదని ఆనాటి ప్రతిపక్షాలు విమర్శించాయి. అయినా సోనియా గాంధీకి ఎన్ఏసికి చట్టబద్ధత కల్పించుకొని తాను సంకల్పించిన పనులను చేసింది. ఎన్ఏసి సభ్యులుగా అరుణ్‌రాయ్, ప్రొఫెసర్ స్వామినాథన్, లోక్‌సత్తా జయప్రకాశ్ నారాయణ మొదలైన ప్రజాస్వామిక, ఉదారవాదులు ఉండటం వలన కొన్ని అయినా ప్రజలకు మేలు జరిగే ప్రతిపాదనలు ముందుకు వచ్చాయి. ఆ కౌన్సిల్ చేసిన అనేక ప్రతిపాదనలలో రాజీవ్ గాంధీ నేషనల్ ఫెలోషిప్(RGNF) ఒకటి.

ఉన్నత విద్యలోకి ఇప్పుడిప్పుడే ప్రవేశిస్తున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లీం విద్యార్థుల కోసం ఈ ఫెలోషిప్‌ను ప్రవేశపెట్టాలని ఆలోచించారు. వేల సంవత్సరాలుగా విద్యకు దూరమైన ఈ సామాజిక సమూహాలకు ఆర్థిక చేయుతనివ్వటం వలన పరిశోధనా రంగంలో విప్లవాత్మక మార్పులు వస్తాయని ఆ కౌన్సిల్ సభ్యులు భావించారు. ఘనీభవించిన పరిశోధన రంగం ద్రవస్థితిలోకి రావటానికి అట్టడుగు వర్గం నుంచి వచ్చిన పరిశోధకులు కృషి చేస్తారని కూడా వాళ్లు ఆశించారు. 'విద్య, పరిశోధనలలోకి కింది వర్గాలను ప్రోత్సహించటం, పరిశోధనలో నాణ్యతను పెంచి జ్ఞాన సమాజం వైపు ప్రయాణించాలని' RGNF లక్ష్యంగా ప్రకటించారు. సాంకేతికంగా RGNF 2005-06 ఆర్థిక సంవత్సరంలో ప్రారంభించారు. మొదట్లో ఈ ఫెలోషిప్ ఎస్సీ విద్యార్థులకు మాత్రమే పరిమితం చేసారు. పీజీ స్థాయిలో సాధించిన మార్కుల ఆధారంగా స్కాలర్స్‌ను ఎంపిక చేసేవాళ్లు. తర్వాతి కాలంలో పీహెచ్‌డీలో చేరిన విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలనే నియమాన్ని తీసుకొచ్చారు. ప్రతీ సంవత్సరం దేశ వ్యాపితంగా 2000 మంది ఎస్సీ పరిశోధక విద్యార్థులకు ఈ ఫెలోషిప్‌ను ఇవ్వాలని ప్రభుత్వం భావించింది. దీనిని కొన్నాళ్లకు ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు కూడా విస్తరించారు.

సామాజిక న్యాయ మంత్రిత్వ శాఖ మరియు ట్రైబల్ అఫైర్స్ మినిస్ట్రి ఆధ్వర్యంలో RGNF నిర్వహణ ఉండేది. ఎంపిక విధానాన్ని యూజీసీ పర్యవేక్షించేది. ఈ ప్రక్రియ 2017 వరకు నిరాటంకంగా కొనసాగింది. ఈ ఇరవై ఏళ్లలో ఎందరో పరిశోధకులు ఈ ఫెలోషిప్‌ను ఉపయోగించుకొని నాణ్యమైన పరిశోధనలు చేసారు. సమాజాన్ని, రాజకీయార్థిక విధానాలను, ప్రకృతి శాస్త్రాలను కొత్త దృష్టితో విశ్లేషించే పద్ధతి పరిశోధనా రంగంలోని ప్రవేశించింది. సాహిత్యంలోనైతే బ్రాహ్మణీయ భావజాలానికి ప్రత్యామ్నాయ ఆలోచనలు పరిశోధనలోకి వచ్చాయి. పరిశోధన పరికరాలు మారిపోయాయి. విశ్లేషణ పద్ధతిలో కూడా మార్పులు వచ్చాయి. ఫెలోషిప్ రావటం వలన పరిశోధకులకు ఆర్థిక వెసులుబాటు లభించింది. అధ్యయనం కోసం పుస్తకాలు సొంతంగా సమకూర్చుకున్నారు. పరిశోధిత అంశానికి సంబంధించి క్షేత్ర పర్యటనలు చేయడానికి గతంలో ఉండిన ఆర్థిక లేమి అనే పరిమితిని ఈ కాలం పరిశోధకులు అధిగమించారు. ఉత్పత్తి కులాల నుంచి వచ్చిన ఈ పరిశోధకులు అధ్యయనం, పరిశోధనతో పాటు తమ సామాజిక బాధ్యతగా సామాజిక ఉద్యమాలలో పాల్గొంటూ నాయకత్వం వహించారు. మరీ ముఖ్యంగా మార్క్స్, అంబేద్కర్ ఆలోచనల ఆధారంగా విశ్వవిద్యాలయాల రాజకీయాలను ప్రభావితం చేసారు.

ఫెలోషిప్ పొందిన పరిశోధకులు తమ సామాజిక బాధ్యతను నిర్వర్తిస్తూనే, వైయక్తిక స్థాయిలో కుటుంబ అస్తిత్వాన్ని నిలబెట్టుకున్నారు. వేల సంవత్సరాలుగా సంపదకు, సామాజిక హోదాకు, విద్యకు దూరమైన వర్గాలకు ఫెలోషిప్‌ల ద్వారా మొత్తం కుటుంబానికి కూడా మేలు జరిగింది. సొంత గ్రామాలలో ఉండడానికి ఇళ్లు లేక చదువుకునే వాతావరణం ఉండేది కాదు. ఫెలోషిప్ వచ్చాక ఉన్నదాంట్లో కొంత మేరకైనా సొంత ఇళ్లను నిర్మించుకునే అవకాశం ఏర్పడింది. తల్లిదండ్రుల అనారోగ్య సమస్యలకు పరిష్కారంగా మెరుగైన వైద్యం అందించ గలిగారు. మధ్యలో ఆగిపోయిన తోబుట్టువుల పెళ్లిలు చేయడమే కాకుండా, స్వయంగా పరిశోధకులు కూడా వివాహాలు చేసుకున్నారు. ఒకవేళ ఫెలోషిప్‌లు లేకపోతే ఇన్ని వేల కుటుంబాలు సామాజిక సంక్షోభంలో పడిపోయేవి. కనీస అవసరాలైన కూడు, గూడు, గుడ్డ లభిస్తే మనిషికి ఆత్మగౌరవం లభిస్తుంది. ఆత్మగౌరవం ఉన్న చోట ఆలోచనలు వికసిస్తాయి.

ఇట్లా దేశవ్యాపితంగా RGNF వలన కనీసం పదిహేనేళ్లలో ముప్పై వేల ఎస్సీ కుటుంబాలు, పది వేల ఎస్టీ కుటుంబాలు ఇంకో ఇరవై వేల బీసీ, మైనార్టీ కుటుంబాలు బాగుపడ్డాయి. కేవలం పరిశోధనలు జరగటం మాత్రమే కాకుండా, సూక్ష్మ స్థాయిలో కుటుంబాలు సమాజంలో మెరుగయ్యాయి. అంటే దేశ ప్రగతిలో వాళ్లు కూడా పాక్షికంగానైనా భాగమయ్యే అవకాశం లభించింది. ఈ ఫెలోషిప్ వలన ప్రత్యక్షంగా, పరోక్షంగా దేశవ్యాపితంగా లక్ష కుటుంబాలు ప్రయోజనం పొందాయి. అట్టడుగు వర్గాలలోని కుటుంబాలు ప్రధాన స్రవంతిలోకి వచ్చే అవకాశం దొరికింది. ఉపరి తలంలోని ఈ సామాజిక మార్పును అంగీకరించలేని వర్గాలకు ఇది నచ్చలేదు. విద్య, సామాజిక ఆవరణలో వచ్చిన చలనం ప్రగతి నిరోధకుల ముందు అనేక ప్రశ్నలను ఉంచింది.

సరిగ్గా ఈ సమయం(2014)లోనే కేంద్రంలో అధికారం సంఘ్ పరివార్ శక్తుల చేతుల్లోకి పోయింది. ఈ శక్తుల సైద్ధాంతిక పునాది బ్రాహ్మణిజంలో ఉంది. అంటే కుల వ్యవస్థలో. బ్రాహ్మణిజం మార్క్సిస్టు, అంబేద్కర్ సిద్ధాంతాలను, భావధారను, మైనార్టీల ప్రగతిని, ఎస్సీ, ఎస్టీల చైతన్యాన్ని అంగీకరించదు. పైగా తమ భావజాలాన్ని ఎల్లెడలా విస్తరించాలని కోరుకుంటుంది. కనుక పాలకవర్గం ద్వారా అడ్డంకిగా ఉన్న శక్తులను భౌతికంగా అడ్డు తొలగించుకోవడం, మానసికంగా భయపెట్టడం, ఆర్థిక వనరులు అందకుండా చేయడం అనే ఆచరణాత్మక విధానంలోకి వెళ్లింది. మొదట్లో(2014-18) సంఘ్ పరివార్, బ్రాహ్మణీయ నిర్మాణాలు సామాజిక వ్యవస్థలోని ఉపరితలంలో ఉండే సంస్కృతిని ఆధారం చేసుకున్నారు. బ్రాహ్మణీయ హిందూత్వ పండుగలకు ఎప్పుడూ లేని ప్రాధాన్యతను ఇచ్చి దేశభక్తి, జాతీయతను జోడించారు. ఇదే సమయంలో భావోద్వేగాలతో ముడిపడిన ఆవు రాజకీయాలను ముందుకు తెచ్చారు.

అతివాద హిందూత్వ ముందుకు తీసుకొచ్చిన ఈ ఉన్మాద రాజకీయాలకు బలమైన అసమ్మతిని ప్రకటించినది మొదట మేధోవర్గం. క్రియాశీల అసమ్మతిని ప్రదర్శించినది విశ్వవిద్యాలయాలు. చర్చలు, సెమినార్‌లు, ధర్నాలు, ర్యాలీలు దిగ్బంధం లాంటి రూపాలలో కూడా నిరసన వ్యక్తమైంది. ఏ మార్పు పట్ల అయినా, అది అప్రజాస్వామికంగా ఉంటే తీవ్రంగా స్పందించే లక్షణం విద్యార్థులలో ఉంటుంది. చరిత్ర అసాంతం అదే జరిగింది. ఆవు రాజకీయాల పట్ల, బ్రాహ్మణీయ హిందూత్వ దేశభక్తి, జాతీయవాద విషయంలో జరిగే విద్యార్థి ఉద్యమాలలో ఉత్పత్తి కులాల నుంచి విశ్వవిద్యాలయ స్థాయికి వచ్చిన మొదటితరం స్కాలర్స్ ముందున్నారు. పునాదిలో మార్క్స్, అంబేద్కర్, రెవల్యూషనరీ భావజాలమేదైనాసరే, నాయకత్వంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ స్కాలర్స్ ఉన్నారు. వీళ్లలో కూడా ఫెలోషిప్ పొంది కొంత ఆర్థిక వెసులుబాటు ఉన్నవాళ్లు అవసరమైన ఉద్యమ ఆర్థిక అవసరాలు తీర్చగలిగిన వాళ్లు నాయకత్వం వహించారు. ఈ మొత్తం సామాజిక చలనం గిట్టని వర్గాలు అధికారంలో ఉండటం వలన వారి స్పందన కూడా పోరాట శక్తుల పట్ల తీవ్రంగానే ఉండింది. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో రోహిత్ వేముల హత్య, జేఎన్‌యూలో కన్హయ్య కుమార్‌పై దేశద్రోహం కేసు ఈ క్రమంలోనే జరిగాయి. ఇవన్నీ ప్రగతి నిరోధకుల ఎత్తుగడలో ఉన్న భౌతిక నిర్మూలనా చర్యలు. వీటితో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ స్కాలర్స్ ఆర్థిక మూలాలను దెబ్బకొట్టాలని భావించారు. ప్రభుత్వ స్థాయిలోనే విధాన నిర్ణయం జరిగేలా బ్రాహ్మణీయ శక్తులు కృషిచేసాయి. అందులో భాంగా 2017 నుంచి ఆర్‌జీఎన్ఎఫ్ పేరు మార్పు, ఎస్సీ, ఎస్టీలను వేరు చేసి, మైనార్టీ, ఎస్సీ ఫెలోషిప్ నిలిపి వేసారు. ఆర్‌జీఎన్ఎఫ్ పేరును నేషనల్ ఫెలోషిప్ ఫర్ హైయ్యర్ ఎడ్యుకేషన్ ఆఫ్ ఎస్సీ, ఎస్టీగా మార్చారు. ఎస్టీ ఫెలోషిప్‌లను ట్రైబల్ అఫైర్స్ మినిస్ట్రీ కిందకు మార్చి క్రమం తప్పకుండా ఇస్తున్నారు. ఎస్సీ ఫెలోషిప్‌ను సామాజిక న్యాయ మంత్రిత్వ శాఖ పరిధిలోనే ఉంచి గత మూడేళ్లుగా నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదు. కొన్నిసార్లు నోటిఫికేషన్ ఇచ్చి నెట్ లాంటి నిబంధనలు పెట్టి ఆ ప్రక్రియను కూడా అర్థాంతరంగా

నిలిపివేసారు. దేశ వ్యాపితంగా సంఘ్ పరివార్ శక్తులకు వ్యతిరేకంగా నిలబడుతున్నది దళితులు, మైనార్టీలు. అందుకే ఈ వర్గాల మీద ఉన్న వ్యతిరేకత ఫెలోషిప్‌లు విడుదల చేయకుండా ఉంటూ వ్యక్తం చేస్తున్నారు. ప్రజల నుంచి పన్నుల రూపంలో వచ్చిన డబ్బును ఈ వర్గాలకు అందించటంలో కూడా ఆధిపత్య శక్తులు ఇన్ని ఆటంకాలు కల్గిస్తున్నాయి.

మన నిచ్చెన మెట్ల సమాజంలో కులవివక్ష వివిధ రూపాలలో కొనసాగుతున్నది. ఉత్పత్తి క్రమంలో ఉత్పత్త శక్తుల మధ్య అంటరానితనం అమలవుతున్నది. ఉత్పత్తి సంబంధాలలో కూడా అన్‌టచ్‌బులిటి ఉంటుంది. పునాదిలో అంటరానితనం ఎంతగా ఆచరించబడుతుందో ఉపరితల అంశాలైన రాజకీయ, సాంస్కృతిక, విద్యా రంగాలలో అంటరానితనం ద్రవస్థితిలో ఉంటుంది. సమాజమే కాకుండా ప్రభుత్వాలు కూడా దళితుల విషయంలో వివక్షను ప్రదర్శిస్తాయి. సహజంగానే మన దేశంలో బ్రాహ్మణీయ భావజాలమున్న పాలకులు అధికారంలో ఉన్నారు. అందుకే ఇవాల్టి ఏలిక దళిత విద్యార్థుల విషయంలో ఫెలోషిప్ అన్‌టచ్‌బులిటి పాటిస్తున్నారని అంటే, అది అన్నవాళ్ల తప్పుకాదు.

ఆర్‌జీఎన్‌ఎఫ్‌ను క్రమం తప్పకుండా ఈ వర్గాలకు అందించాలనే చిత్తశుద్ధి ఆనాటి కాంగ్రెస్‌కైనా ఈ నాటి బీజేపీకైనా ఉంటే ఈ కింది విధాన నిర్ణయాలు జరిగి ఉండాల్సింది.

1. యూజీసీ సంవత్సరానికి రెండుసార్లు నెట్ పరీక్షను నిర్వహించి మెరిట్ విద్యార్థులకు జేఆర్‌ఎఫ్‌ను ఇస్తుంది. కారణమేమిటంటే యూజీసీ స్వయం ప్రతిపత్తి కలిగిన సంస్థ కావడం వలన కేంద్ర బడ్జెట్‌లో ప్రతీ సంవత్సరం కావల్సిన డబ్బులు అధికారికంగా కేటాయింపు జరుగుతుంది. కనుక ఆ డబ్బును ఫెలోషిప్‌ల రూపంలో క్రమం తప్పకుండా ఇస్తున్నారు. ఈ విధంగానే ఆర్‌జీఎన్‌ఎఫ్‌ను ఆయా మంత్రిత్వ శాఖల నుంచి విడదీసి యూజీసీకి అప్పగించి ఆ ఫెలోషిప్‌కు కావల్సిన డబ్బును కేంద్ర బడ్జెట్‌లో భాగంగా కేటాయింపు చేయాలి.

2. ప్రచారం కోసం పాలసీని ప్రవేశపెడుతున్న పాలకులు వాటి అమలు జరగాలంటే నిధుల కేటాయింపును చిత్తశుద్ధిగా చేయాలి. విడుదలైన నిధులను నిబద్ధతతో ఆయా వర్గాలకు ఖర్చుచేయాలి.

3. అగ్రకుల బ్రాహ్మణీయ భావజాలం కలిగిన పాలకులు కింది వర్గాల విద్యార్థుల మేలు కోసం నిధుల కేటాయింపులు, విడుదల, ఉపయోగం సరైన పద్ధతిలో చేయరు. ఆ సందర్భంలో రిజర్వేషన్ ఫలాలతో ఎంపికైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజా ప్రతినిధులు ప్రభుత్వం, అధికారుల మీద ఒత్తిడి తీసుకరావాలి. చట్ట సభలలో ఈ అలసత్వం మీద మేధోపరమైన చర్చలు చేయాలి.

4. ముందు పేర్కొన్న ప్రక్రియ ఏది కూడా సరైన ఫలితాలను ఇవ్వదని డెబ్బై ఏళ్ల కాలం నిరూపించింది. కనుక ప్రజాక్షేత్రమే అంతిమ వేదిక. ప్రజల ఓట్లతో ఎన్నికైన ప్రభుత్వాలు ఆ ప్రజల పిల్లల విద్య కోసం నిధులు కేటాయించి విడుదల చేయటం లేదని వారికి అర్థమయ్యేలా చెప్పి చైతన్యం చేయాలి.

5. విద్యార్థులు పోరాటం చేస్తూ అవసరమైతే ఏ త్యాగానికైనా సిద్ధపడే లక్షణం కలిగి ఉంటారు. దీనితో పాటు మేధస్సును తక్కువ సమయంలో పొంది ఏ సమస్యకైనా కార్యాకారణ సంబంధాన్ని చెప్పగలరు. కనుక భావజాల రంగంలో ఎక్కువ కృషిని చేసి విద్యార్థి సమూహాన్ని చైతన్యం చేయాలి. ప్రగతి నిరోధక భావజాలానికి దీటుగా అభివృద్ధికర ఆలోచనలను యువతలో ప్రోదిచేయాలి.

దళిత విద్యార్థుల ఫెలోషిప్‌లు ఆగిపోయిన సందర్భంలో దక్షిణ భారతదేశంలో మరో చర్చ కూడా జరుగుతున్నది. దేశ వ్యాపితంగా బీసీ విద్యార్థులకు విశ్వవిద్యాలయ స్థాయిలో అందే ఫెలోషిప్‌లలో రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన విద్యార్థులకు రెండంకెలలోపే వచ్చాయని ఆందోళనలు, చర్చలు జరుగుతున్నాయి. నిజానికి కళాశాల, విశ్వవిద్యాలయ స్థాయిలో దేశంలో ఢిల్లీ మినహాయిస్తే రెండు తెలుగు రాష్ట్రాల విద్యార్థులు చాలా సందర్భాలలో తమ ప్రతిభను ప్రదర్శించారు. ఇక్కడ మెరుగైన విద్యా బోధన ఉంటుందని కూడా అనేక సర్వేలు చెప్పాయి. కాని ఈ సారి ఉస్మానియా విశ్వవిద్యాలయ విద్యార్థులకు కూడా ఫెలోషిప్‌లు ఆశించినంతగా రాలేదు. అన్ని రంగాలలో ఉత్తరాది ఆధిపత్యం కొనసాగుతున్నట్లే ఫెలోషిప్‌ల సందర్భంలో కూడా వివక్ష కొనసాగడం చూస్తే ఆర్య భావజాలం మరోసారి ముందుకొచ్చిందని అన్పిస్తుంది. ఈ వివక్ష విషయంలో సంఘ్ పరివార్ అనుబంధ ఏబీవీపీ విద్యార్థి సంఘం కూడా తన అస్తిత్వం కోసం ఆందోళన చేసింది. యూజీసీలో దక్షిణ భారతీయులకు ఇప్పటికీ ఏ పని జరగదు, సంవత్సరాల తరబడి వాళ్ల ఫైల్స్ కదలకుండా ఉంటాయి. ఈ వివక్షకు కారణాలు పాలకవర్గాలలోని ఆధిపత్య భావజాలంలో ఉన్నాయని సమాజం అర్థం చేసుకోవల్సి ఉంది.

**★30 ఆగస్ట్, 2019**
**ఆర్-9, ఓయు**

నడుస్తున్న కాలం

# కశ్మీర్!

## మొన్న రాజ్యం, నిన్న రాష్ట్రం, నేడు కేంద్ర పాలిత ప్రాంతం- రేపు...?

ఎనిశెట్టి శంకర్

'కశ్మీర్' మాట వినగానే యావత్ దేశ ప్రజల మనసుల్లో ఓ సుందర, ఆహ్లాదకర కలల సామ్రాజ్యం సాక్షాత్కారమవుతుంది. కాని ఏడు దశాబ్దాలుగా అక్కడి ప్రజలు వుంటున్నది మంచుకొండల్లో నైనా వారందరి హృదయాలు అగ్ని జ్వాలల్లో మండుతున్న సంగతి చాలా కొద్దిమందికే తెలుసు.

మరి ప్రస్తుత మనువాద పార్టీ పాలన మొదలయ్యాక కశ్మీర్ అంటేనే ముస్లింలు-పాకిస్తాన్‌కు వంతపాడే వాళ్లని సగటు మనిషి మనసులో గాఢంగా నాటుకునేట్లు అన్ని విధాలా ప్రచారం జోరుగా సాగుతున్నది. అందులోనూ ప్రధాన ప్రసార మాధ్యమాలన్నీ పాలకపక్షం చెప్పిందే 'వేదం'లా భావించి గోబెల్ ప్రచారాన్ని మనసా వాచ కర్మణా సాగిస్తూ ప్రభుభక్తి పరాయణతను చాటుకుంటున్న విషయాన్ని మనం జ్ఞప్తిలోకి వుంచుకుంటే అసలు సమస్య స్వరూప స్వభావాలను హేతు బద్ధంగా ఆలోచించగలం-విశ్లేషించగలం.

మరీ ముఖ్యంగా మొన్న పార్లమెంటులో కశ్మీర్ స్వయం ప్రతిపత్తికి సంబంధించిన అధికరణాలు 370, 35ఎ రద్దు చేస్తూ, ఉన్న ఫళంగా రాష్ట్రాన్ని రెండు ముక్కలు చేసి, కేంద్ర పాలిత ప్రాంతాలుగా (జమ్మూ-కశ్మీర్, లడఖ్) చట్టం చేసిన బీజేపీని ఇంటా బయటా విమర్శిస్తున్నా, తాము చేసినది ఘనకార్యమని ఛాతీ గుద్దుకుంటూ బీజేపీ శ్రేణులు ఒకవైపు ప్రచారం చేసుకుంటూ మరోవైపు కశ్మీర్ ప్రజల అభీష్టానికి వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరించిందని అనే ప్రజల్ని పాకిస్తాన్ ఏజెంట్లుగా దెప్పి పొడుస్తున్నారు.

అసలు కశ్మీర్‌కు ఆ ప్రత్యేక చట్టమెలా వచ్చింది? అలాంటి ప్రత్యేక హక్కు సదుపాయం ఇంకే రాష్ట్రానికైనా వుందా? లేదా? కశ్మీర్ ప్రజలు ఏం కోరుతున్నారు? బీజేపీ ఏకపక్ష నియంతృత్వ చర్య ఏ రకంగా మొదలగు మౌలిక అంశాల్ని గాన్ని ప్రశ్నల్ని గానీ నేడు భారతీయులు కనీసం ప్రశ్నించకుండా పాలకపక్షం చేసినదే రైట్, రైట్' అని వత్తాసు పలకడం అత్యంత విచారకరం.

అంతెందుకు? మొన్నటి దాకా ప్రత్యేక తెలంగాణ కావాలని కోరుకున్న మన సంయుక్త రాష్ట్రంలో కూడా ' ముల్కీ' అనే ఓ నిబంధన వుండేది గదా! ఒకే దేశం-ఒకే రాజ్యాంగం అని చర్విత చరణంగా పలవరించే బీజేపికి తెలంగాణ వాదులు కూడా విదేశీయులేనా?

ప్రజలు ఆలోచించకుండా, ప్రధాన మీడియా అంతా తానై పాలకవర్గం చెప్పిందే రీతి, చేసిందే నీతి అని వ్యవహరించడం వల్లే సమస్యను లోతుగా చూడలేక పోతున్నారు.

ఒక్కసారి 'కశ్మీర్' చరిత్రను, 370 లాంటి అధికరణలు ఇంకేరాష్ట్రాలకున్నాయనే విషయాన్ని లోతుగా పరిశీలిస్తే కశ్మీరీయుల అస్థిత్వ పోరాటంలోని న్యాయబద్ధత, మనువాద పార్టీ మతోన్మాదంలోని గుట్టు సులభంగా తెల్సుకోగలం. ప్రస్తుత ప్రభుత్వానికి మానవ హక్కులపై గానీ దేశంలో ఫెడరల్ వ్యవస్థపై గానీ ఈషణ్మాత్రం ప్రేమ లేదనడానికి గత ఐదేండ్లుగా దేశంలో సాగుతున్న హక్కుల విఘాతాలే తార్కాణం.

రాష్ట్రాలు బలంగా వుంటే కేంద్రం బలంగా వుంటుందని అప్పుడే దేశ ప్రజలు అభివృద్ధి పథాన నడుస్తారని ఎందరో రాజ్యాంగ నిపుణులు నొక్కి వక్కాణించారు.


కేంద్ర, రాష్ట్రాల మధ్య అధికారాలు ఎలా పునర్ విభజించాలో సూచించమని మద్రాస్ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ పి.వి.రాజ మన్నార్ సూచించిన నివేదికను కేంద్రం ముందు ప్రవేశ పెట్టనున్నట్లు కేంద్రం పాజిటివ్‌గా స్పందించకుంటే తన ప్రభుత్వం ఉద్యమం చేస్తుందని 60 ఏండ్ల క్రితం ఆనాటి మద్రాస్ ముఖ్యమంత్రి ఎం.కే.కరుణానిధి ప్రకటించడాన్ని ఈ ఫెడరల్ వ్యవస్థ ప్రాధాన్యతా విషయాన్ని సూచించడాన్ని మనం మరువాద్దు.

ఒకే దేశం-ఒకే ఎన్నిక, ఒకే దేశం-ఒకేపన్ను, ఒకే దేశం-ఒకే రాజ్యాంగం అంటూ చిలుక పలుకుల్లా వ్యాఖ్యానిస్తున్న కమలనాథులు పక్కా ఫాసిజం మార్గాన

సాగుతున్నారనేది నిర్వివాదాంశం.

**ప్రత్యేక హక్కులు! చట్టం కేవలం కశ్మీర్‌కే ఉన్నాయా?**

ఈ ప్రశ్న ఏ కమలనాథున్ని ప్రశ్నించినా వాళ్ళ గొంతుల్లో పచ్చివెలక్కాయ పడ్డట్లే. ఎందుకంటే బలవంతులు, బలహీనులు కలిసి వున్నప్పుడు ఇద్దరికీ ఆయోదయోగ్యమైన అంశాలను పరిగణనలోకి తీసుకోవడం సామాజిక న్యాయసూత్రమే గదా!




1956 నవంబర్ 1న తెలంగాణ-ఆంధ్రలు రెండూ కలిసిపోయి నూతన ఆంధ్రప్రదేశ్ ఏర్పడ్డది గదా! ఆంధ్ర వాళ్ళతో బలహీనులైన తెలంగాణీయులు వేగలేరని ఆనాడే భావించి 'పెద్ద మనుషుల ఒప్పందం' జరిగింది గదా! ఈ ఒప్పందం ప్రకారం తెలంగాణ ప్రాంతంలోని భూములు ఇతరులు కొనాలంటే ఇక్కడున్న కమిటీ అనుమతి కావాలి.

ఈ ప్రాంతంలో ఇతరులు ఉద్యోగాలు చేయాలన్నా 14 ఏండ్ల స్థిర నివాసమున్నవారే అర్హులని ఆనాడు ముల్కీ నిబంధన వచ్చింది. అఫ్‌కోర్స్ అది 7 ఏండ్లకు కుదించబడ్డది- ఆ పిదప అదీ నిర్వీర్యం చేయబడింది గదా. అందుకే మన నిధులు, మన నీళ్ళు, మన కొలువులు మాకే అంటూ ఉద్యమం చేసి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని తెచ్చుకున్నది. మరిస్తే ఎలా?

ఇప్పటికీ ఏజన్సీ ప్రాంతంలో 1/70 చట్టం అమల్లో వుంది. ఈ ప్రాంత భూములు ఎవరన్నా కొనాలంటే అటవీ చట్టాలు అంత సులువుగా అంగీరించవనేది మనం గుర్తించాలి. మరి ఈ దేశంలోనే వుండి మనకొన్ని ప్రత్యేక చట్టాలు (అధికరణాలు) ఎందుకు కోరాం?

1960లో కేంద్రం, నాగా పీపుల్స్ సమితిల మధ్య 16 అంశాల ఒప్పందంగా చట్టం చేయబడిందే.

371 ఎ అధికరణం.

371 అధికరణం-మహారాష్ట్ర, గుజరాత్‌లకు

371 బి అధికరణం - అస్సాంకు

371 సి అధికరణం - మణిపూర్‌కు

371 డి, ఇ అధికరణం-ఆంధ్రప్రదేశ్(ప్రస్తుతం తెలంగాణకు)

371 ఎఫ్ అధికరణం - సిక్కింకు

371 జి అధికరణం - మిజోరాంకు

371 హెచ్ అధికరణం - అరుణాచల్ ప్రదేశ్‌కు

371 ఐ అధికరణం - గోవాకు

371 జె అధికరణం - కర్ణాటకకు

మరి రాజ్యాంగమే ఇచ్చిన ఇవన్నీ మనకెందుకు గుర్తుకు రావడం లేదు? ఒక్క కశ్మీరే ఎందుకు? అక్కడ ముస్లింలు మెజారిటీ కాబట్టా?

కశ్మీర్ అత్యంత పురాతన చరిత్రగల దేశం. ఇది క్రీ.పూ. మూడువేల సంవత్సరాల సాంస్కృతిక వైభవాన్ని కలిగివున్న దేశమనేది ప్రస్తుత తరానికి తెలియకపోవచ్చు.

అనేక దండయాత్రలకు, దురాక్రమణలకు ఈ ప్రాంతం వేదిక. దీని చరిత్రంతా రాజుల, యుద్ధాలతో రక్తసిక్తమైనదే.

దీన్ని మొగలులు, సిక్కులు, డోగ్రా వంశస్థులు పాలించారు.

రంజిత్‌సింగ్ 1808లో జమ్మూని జయించి డోగ్రా వంశస్థుడైన గులాబ్‌సింగ్‌ను జమ్మూకు రాజుగా ప్రకటించాడు. ఇతడు ఒక వైపు సిక్కులకు సామంత రాజుగావుంటూ మరోవైపు బ్రిటీష్ వారితో స్నేహం చేయసాగాడు.

బ్రిటీష్ వాళ్ళు కశ్మీర్ పైకి దండెత్తి రంజిత్ సింగ్‌ను ఓడించి 75లక్షల పరిహారాన్ని చెల్లించుమని ఆదేశించారు. దీన్ని ససేమిరా ఒప్పుకోని రంజిత్ సింగ్ కాశ్మీర్‌ను వదులుకున్నాడు. గులాంలాంటి గులాబ్‌సింగ్ వాళ్ళుకోరిన 75లక్షల రూపాయల సొమ్ము చెల్లించి 1846లో కశ్మీర్‌కు రాజు అయ్యాడు. ఈ ఒప్పందాన్నే 'అమృత్‌సర్ ఒప్పందం' అంటారు. ఈరకంగా 1846 నుండి కశ్మీర్‌లో డోగ్రా వంశ పాలన ప్రారంభమైంది.

ఇతని కాలంలో ఇక్కడ జమీందారీ వ్యవస్థ నెల కొల్పబడింది. వేలాది ఎకరాల భూస్వాములు పుట్టుకొచ్చారు. ఇతడు ఫక్తు మత దురభిమానాన్ని ప్రదర్శిస్తూ ప్రజల్ని అనేక ఇబ్బందుల పాలు చేశాడు. 'సంస్కృత భాష' ను రాజా భాషగా ప్రకటించి ప్రజల్ని హింసించాడు. కశ్మీరీయుల మాతృ భాషను అణచివేశాడు. భూస్వాములు, జమీందారులు అష్ట ఐశ్వర్యాలతో తులతూగుతుంటే సామాన్యులు దుర్భర దారిద్ర్యాన్ని చవిచూశారు. గులాబ్‌సింగ్ అనంతరం రణభీర్‌సింగ్, ప్రతాప్‌సింగులు–పిదప 1925 ఆధునిక కశ్మీర్ కీలక మలుపులో ప్రధాన వ్యక్తి, వివాదాస్పదుడైన హరిసింగ్ రాజు అయ్యాడు.

**కశ్మీర్ నైసర్గిక స్వరూపం:**

22 జూన్ 1948 నాడు కొత్త ఢిల్లీలో షేక్ అబ్దుల్లా కశ్మీర్ గూర్చి మాట్లాడిన విషయాన్ని మనమిపుడు మననం చేసుకోవాలి. ఆనాడు ఆయన తన ఉపన్యాసంలో, "భౌగోళిక ఆధిపత్యంకై ప్రపంచంలో జరిగే రక్తసిక్త యుద్ధాల్లో 5 వేళ్ళవలె ఉన్న ఇండియా, పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్, రష్యా, చైనాల మధ్య మా మాతృభూమి ఇమిడివున్నది. అంతర్జాతీయంగా జరిగే అధికార కుమ్ములాటలో మా కశ్మీర్ ఒక యుద్ధభూమిగా మారింది" అని అంటారు.

కశ్మీర్ ప్రధానంగా మూడు ప్రధాన భూభాగాలతో కలిసివున్నది. జమ్ము, కశ్మీర్, లడఖ్. జమ్మూలో హిందువులు 62.5%, ముస్లింలు 33. 5% ఇతరులు 3.9% వుంటే కశ్మీర్‌లో హిందువులు 2.5%, ముస్లింలు 96.4%, ఇతరులు 1.% మంది. లడఖ్‌లో హిందువులు 12.1%, ముస్లింలు 46.4%, ఇతరులు 41.5% కాగా పాత జమ్ము కశ్మీర్ రాష్ట్రంలో హిందువులు 28.4%, ముస్లింలు 68.3%, ఇతరులు 3.3%.

మొత్తం భూ భాగంలో కశ్మీర్ 15.7%, జనాభా 54.9% జమ్మూ 25% భూ భాగం, జనాభా 41.9% లడఖ్ 58.3% భూభాగం, 2.2% జనాభా. మాట్లాడే భాషలు– కశ్మీరీ 53.3%, హిందీ 20.8%, డోగ్రా 20%, పంజాబీ 1.7%, ఇతరులు 4.2% (ఈ గణాంకాలన్నీ ఇటీవల పత్రికల్లో ప్రకటించినవే) విచిత్రమేమంటే మనం ఊహించే 'ఉర్దూ' ను ఇక్కడి ముస్లింలు మాట్లాడడం లేదని తెలిస్తే ఆశ్చర్యం వేస్తుంది!

**సంస్కృతీ– సంప్రదాయాలు:**

కశ్మీర్‌యుల సంస్కృతి చాలా సుదీర్ఘమైనది. ఎందరు పాలకులు మారినా ఇక్కడి ప్రజలు తమ పురాతన సంస్కృతిని కాపాడుకుంటూనే వున్నారు. తమ జాతి ప్రత్యేక అస్థిత్వాన్నీ కాపాడుకోగలిగారు. కశ్మీర్ యువతులు ముస్లిం మహిళల వలె బురఖా వేసుకోరు (ఈ మధ్య పాకిస్తాన్ సంస్కారం వల్ల వీళ్ళూ మెల్ల మెల్లగా బురఖా వేసుకునే 'కొత్త' సంస్కృతికి వస్తున్నారు.) వీరి జాతి పరిరక్షణ, సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణ కోసం నిరంతరంగా సాగిస్తున్న ప్రజా ఉద్యమం నేడు దేశంలో వీరిపట్ల ఒక అపసవ్య ఆలోచనకు గురిచేయడం అత్యంత విచారకరం. చరిత్రలో జాతుల పరిరక్షణ కోసం ఎన్నో పోరాటాలు, ఉద్యమాలు సాగాయి. అందులో కశ్మీర్‌యుల అస్థిత్వపోరాటం ఎవరికీ తీసిపోనిది. మెజారిటీ ప్రజల ఆ కాంక్షలైన స్వయం పాలన గూర్చి సగటు భారతీయుడు తప్పుగా అర్థం చేసుకొని వీరిపట్ల అనూహ్య ఏహ్య భావాన్ని కలిగివుండడానికి కారణం పాలకులు వీరిని నిరంతరం పనిగట్టుకొని తప్పుగా చిత్రించడమే!

కశ్మీర్‌కు హరిసింగ్ రాజు అయ్యాక అక్కడి ప్రజల అసంతృప్తి రోజు రోజుకూ పెరుగుతూ వచ్చింది. 1931లో ప్రజా ఉద్యమం ఊపు అందుకుంది. ఇక్కడ 1932లో అఖిలజమ్మూ అండ్ కశ్మీర్ ముస్లిం మహాసభ ఏర్పడింది. లోయలో పెరిగిన అణచివేతను అప్పుడే లాహోర్‌లో గ్రాడ్యుయేషన్, ఆలీఘర్‌లో ఎమ్మెస్సీ పూర్తి చేసి వచ్చిన షేక్ అబ్దుల్లా వ్యతిరేకించసాగాడు. ఇతడు ఆ మతతత్వ పార్టీలో ఇమడలేక 'అఖిల జమ్మూ అండ్ కశ్మీర్ జాతీయ మహాసభ' (పాత పార్టీలోని 'ముస్లిం' పదం మతాన్ని సూచిస్తున్నందున దాని స్థానం మరింత ఉన్నతమైన 'జాతి' పదాన్ని చేర్చి)ను స్థాపించాడు. ఇదే 'నేషనల్ కాన్ఫరెన్స్' గా పరిణామం చెందింది. అత్యంత శక్తివంతమైన తన వాగ్పటిమతో షేక్ అబ్దుల్లా యువతను బాగా ఆకర్శించ గలిగాడు. జాతీయ, లౌకిక,

అభ్యుదయ భావాలతో ఏర్పడ్డ పార్టీ కనుక ఉద్యమం కూడా విశాల ప్రాతిపదికనే సాగింది.

**క్విట్ కశ్మీర్ ఉద్యమం:**

1944లో అఖిల జమ్మూ అండ్ కశ్మీర్ జాతీయ మహాసభ తన ప్రణాళికను విడుదల చేసింది. పౌరులందరికీ సమాన హక్కులు కావాలని, పనిచేసే హక్కు వుండాలని, కశ్మీరీ మహిళలకు సమాన హక్కులు లభించాలని, కశ్మీర్ ప్రజల చేత ఎన్నుకోబడిన రాజ్యాంగ నిర్ణాయక సభచే ప్రభుత్వం నెలకొల్పబడాలని, కీలక పరిశ్రమలను జాతీయం చేయాలని, ప్రైవేట్ వ్యక్తిగత గుత్త సంస్థలు రద్దు చేసి స్వాధీనం చేసుకోవాలని, జమిందారీ, ఫ్యూడల్ ఎస్టేట్లను రద్దుచేసి దున్నేవారికే భూమి ప్రాతిపదికన భూములు పంచాలని, అమృత్‌సర్ ఒప్పందం రద్దుకావాలని, బ్రిటీష్ వారిచే నియుక్తుడైన మహరాజు వెంటనే వైదొలగాలని మహాసభ డిమాండ్ చేసింది. ఇప్పుడు మనం ఎంతో పురోగామి చర్యలనుకునే ఎన్నో డిమాండ్లు 75 ఏండ్ల నాడే లోయలో షేక్ అబ్దుల్లా ప్రకటించి ఉద్యమం నడపడం గొప్ప పరిణామంగా భావించాలి.

ఈ ఉద్యమం సందర్భంగా ముస్లిం లీగ్ నేత మహ్మద్ అలీ జిన్నా కశ్మీర్‌కు వచ్చాడు. అతణ్ణి కలిసి షేక్ అబ్దుల్లా తమ నేషనల్ కాన్ఫరెన్స్ మతాల కతీతంగా వెళ్తున్నట్లు, నియంతృత్వ డోగ్రా రాజుకు వ్యతిరేకంగా హిందువులు, ముస్లింలు, క్రైస్తవులు, బౌద్ధులు మొదలైన వారంతా ఐక్యంగా నిలబడి పోరాడు తున్నారని, తమ పార్టీకి అతను మద్దతివ్వాల్సిందిగా కోరాడు. అలాగే ముస్లిం కాన్ఫరెన్స్ పెడధోరణులను సరిదిద్దాల్సిందిగా కూడా జిన్నాను అబ్దుల్లా అభ్యర్థించాడు.

జిన్నాను కలుసుకున్న ముస్లిం కాన్ఫరెన్స్ ప్రతినిధులు తాము మెజారిటీ ముస్లింల పక్షాన నిలబడుతున్నామని, హిందూ రాజు ముస్లింలను అణచివేస్తున్నాడని, తాము మాత్రమే ఇస్లాం ధర్మ సూత్రాలు పాటిస్తున్నామని ముస్లిం కాన్ఫరెన్స్‌కు జిన్నా మద్దతు ఇవ్వాలని ఆకాంక్షించారు.

17 జూన్ 1944న శ్రీనగర్‌లో జరిగిన బ్రహ్మాండమైన బహిరంగసభలో జిన్నా ప్రసంగిస్తూ అబ్దుల్లాను, అతని నేషనల్ కాన్ఫరెన్స్‌ను ఖండిస్తూ ముస్లిం లీగ్‌కు వత్తాసు పలికాడు.

ఈ క్రమంలోనే నేషనల్ కాన్ఫరెన్స్ 'నయా కశ్మీర్' పేర 'స్వతంత్ర కశ్మీర్' ఏర్పాటుకు పిలుపునిచ్చింది. శతాబ్దాలుగా అణచబడ్డ కశ్మీరీయులు ఈ పిలుపుతో పెద్దఎత్తున ఉద్యమబాట పట్టారు.

1946 ఏప్రిల్ 17 నుంచి 24 వరకు జమ్మూకశ్మీర్ సంస్థానంలో బ్రిటీష్ క్యాబినెట్ మిషన్ పర్యటించింది. నేషనల్ కాన్ఫరెన్స్ నాయకుడు షేక్ అబ్దుల్లా ఈ మిషన్‌ను కలిసి జమ్మూ కశ్మీర్‌ను సార్వభౌమాధికారం గల స్వతంత్ర దేశంగా ఏర్పర్చాలని డిమాండ్ చేశాడు.

**మహారాజాతో మౌంట్ బాటన్ భేటీ:**

ఎట్టకేలకు బ్రిటిష్ ప్రభుత్వం ఆగస్ట్ 15, 1947న భారత ఉపఖండాన్ని పాకిస్తాన్, భారత్‌లుగా విభజించడానికి నిర్ణయించారు. ఈ నేపథ్యంలోనే మౌంట్ బాటన్ రాజా హరిసింగ్‌ను కలిసి కశ్మీర్‌ను పాకిస్తాన్‌లో విలీనం చేయుమని సలహా ఇచ్చాడు. కానీ హరిసింగ్ అంత తొందరగా ఒప్పుకోలేదు. రాజా హరిసింగ్‌గానీ, అక్కడి ప్రజలు గానీ కశ్మీర్ స్వతంత్ర దేశంగా వుండేందుకు నిర్ణయించకుండా శకుని పాత్ర పోషించాడు మౌంట్ బాటన్.

**సంస్థానాల విలీనం:**

మత ప్రాతిపదికన రెండు దేశాలు ఏర్పడ్డాక దేశంలో సుమారు 560 సంస్థానాలు భారతదేశంలో విలీనమైనాయి. జునాగఢ్, హైద్రాబాద్, జమ్మూకశ్మీర్ లాంటివే పీటముడుల్లా మారాయి. జునాగఢ్ పాకిస్తాన్‌లో, హైద్రాబాద్ భారత్‌లో విలీనం అయ్యాక మిగిలింది కశ్మీర్ మాత్రమే!

మౌంట్ బాటన్ జిత్తులమారి సలహాను రాజాహరిసింగ్ తోసిపుచ్చాడు. ప్రజలు కూడా తన ఆలోచనతో వున్నందున తాను స్వతంత్రంగా వుంటానని, ఇరుదేశాలకు విజ్ఞప్తి చేస్తూ తమ స్వతంత్రతకు చేయూతనివ్వాల్సిందిగా కోరాడు. దీనికి వెంటనే పాకిస్తాన్ ప్రతిస్పందించింది. భారత్ మాత్రం కశ్మీర్‌కు సంబంధించిన రక్షణ, కమ్యూనికేషన్, విదేశీ వ్యవహారాల మీద తమకు అధికారం ఇవ్వాలని భారత్ కోరింది. మహరాజా కాదనడంతో తాను పాకిస్తాన్‌తో 'యధాతథ ఒప్పందం (Stand Still Agreement)'కుదుర్చుకున్నది.

**ప్లెబిసైట్‌కు కాంగ్రెస్ పట్టు**

మహారాజా హరిసింగ్ హిందువు. ప్రధానంగా కశ్మీర్ ప్రజలు ముస్లింలు. భారత్, పాక్‌లు రెండు దేశాలుగా ఏర్పడుతున్న సందర్భంగా బ్రిటీష్‌వాళ్లు విలీనాధికారం సంస్థానాధీశులకు వుంటుందని ప్రకటించారు. కాని పట్టు వదలని విక్రమార్కునిలా కాంగ్రెస్ పార్టీ అనివార్య పరిస్థితుల్లో రాజాహరిసింగ్‌ను ఒప్పించుమని గాంధీని పంపింది. గాంధీ ప్రభావానికి కూడా రాజా లొంగలేదు. అప్పటికే రాజాహరిసింగ్


పాకిస్తాన్‌తో చేసుకున్న ఒప్పందం పట్ల వ్యతిరేకత మొదలైంది. ఇది గమనించిన గాంధీ ఢిల్లీ చేరుకున్నాడు. అక్కడ 'కశ్మీర్‌లో వెంటనే సర్వజన ఆమోదం కోసం అభిప్రాయ సేకరణ(ప్లెబిసైట్) జరుపాల్సి ఉంది' అని ప్రకటించి సంచలనం లేపాడు.

ప్లెబిసైట్ విషయంలో ఆనాడు 2 జనవరి 1952లో ప్రధాని నెహ్రూ ప్రకటనను చూద్దాం.(ఇది అమృత్ బజార్ పత్రికలో వచ్చిన ఇంగ్లీష్ ప్రకటనకు అనువాదం.

"కశ్మీర్ అనేది ఇండియా–పాకిస్తాన్ దేశాల ఆస్తి కాదు. అది కశ్మీరీ ప్రజలకే చెందుతుంది. భారతదేశంలో కశ్మీర్ విలీన సమయంలో 'ప్రజాభిప్రాయ సేకరణ'(ప్లెబిసైట్)కి కట్టుబడి వుంటామని కశ్మీర్ ప్రజా నాయకులకు మనం స్పష్టం చేసాం. వాళ్లు మనలను విడిచి పెట్టాలని కోరినప్పుడు, కశ్మీర్‌ను వదిలి రావడంలో నేను వెనుకాడేది లేదు. ఈ అంశాన్ని ఐక్య రాజ్యసమితి దృష్టికి తీసుకెళ్లాం. శాంతియుత పరిష్కారంకై మాట ఇచ్చాం. ఒక గొప్ప దేశంగా ఇచ్చిన ఆ మాట నుండి వెనక్కి వెళ్లలేం. అంతిమ పరిష్కారాన్ని కశ్మీర్ ప్రజలకే వదిలేశాం. వాళ్ల నిర్ణయానికి మనం కట్టుబడి ఉంటాం."

**పాకిస్తాన్ కుట్ర–దాడి:**

భారత కాంగ్రెస్ నాయకత్వం నేషనల్ కాన్ఫరెన్స్‌తో సాన్నిహిత్యం పెంచుకుంది. అటు ప్లెబిసైట్ డిమాండ్ మెల్లమెల్లగా పెరుగుతున్నందున పాకిస్తాన్‌కు పాలుపోని పరిస్థితి ఎదురైంది. కశ్మీర్‌ను గెలుచుకోవడానికి ఎన్నో కుట్రలూ, కుతంత్రాలకు వ్యూహం పన్నింది. ఈ వ్యూహంలో భాగంగానే వాయవ్య, కొండ ప్రాంతాల్లోని పఠాన్లు తదితర కొండ జాతుల వారికి సైనిక శిక్షణనిచ్చి వారిని పెద్ద సంఖ్యలో 1948 అక్టోబర్ 15న కశ్మీర్లోకి పంపించడం ప్రారంభించారు. అక్టోబర్ 28వ తేదీన కశ్మీర్‌లోని పలు ప్రాంతాల్లోకి ఈ కొండ జాతులవారు హఠాత్తుగా పెద్దసంఖ్యలో చొరబడ్డారు. అప్పటికే అమల్లో వున్న యథాతథ ఒప్పందాన్ని ఖాతరు చేయకుండా దాడులు ప్రారంభజంచింది. షేక్ అబ్దుల్లా లాంటి నాయకులు జైళ్లలో ఉన్నారు. అన్నివైపుల నుంచి దాడిచేస్తూ నిత్యావసర సరకులు అందకుండా చేశారు. గత్యంతరం లేక రాజా హరిసింగ్ తమ శరణు కోరుతాడని భావించింది. అంతేగాక తమ వాళ్లు అంతటా వ్యాపించాక ప్రజాభిప్రాయ సేకరణ జరిగినా తమకు లాభదాయకమని వెర్రి ఎత్తుగడలు వేసింది. పాకిస్తాన్ కుట్రను గ్రహించిన కశ్మీర్ సంస్థాన ప్రధాని ఎప్పటికప్పుడు అటు ఇంగ్లాండ్‌కు, ఇటు పాకిస్తాన్‌కు పలు లేఖలు, టెలిగ్రాంలు పంపాడు. పాకిస్తాన్



చొరబాటుదారుల ముందు హరిసింగ్ సైన్యం నిలబడలేకపోయింది. ఎట్టి పరిస్థితుల్లోనూ కశ్మీర్ తమ వశం కాక తప్పదని పాకిస్తాన్ ప్రభువులు పగటి కలలు కన్నారు.

**భారత్‌తో విలీన ఒప్పందం:**

పాకిస్తాన్ చొరబాటుదారులను ఎదుర్కోవడానికి రాజా హరిసింగ్‌కు బద్ధ శత్రువైన నేషనల్ కాన్ఫరెన్స్ శ్రేణులు ప్రజలను సమీకరించడం ప్రారంభించింది. రాజా హరిసింగ్ పరిస్థితి అడకత్తెరలో పోకచెక్కలా మారింది. ఒకవైపు కుట్రపూరిత పాకిస్తాన్ చొరబాటుదారులు, మరో పక్క ఆగర్భశత్రువు నేషనల్ కాన్ఫరెన్స్ శ్రేణుల ప్రజాసమీకరణ. వీరిని కాదని బ్రిటిష్ వారిని శరణుకోరుదామంటే 1947 ఆగస్ట్ 15 తర్వాత బ్రిటీష్ సేనలు పంపకూడదు. గత్యంతర లేక మిగిలిన ఆశ భారత్‌పైనే.

కేంద్ర ప్రభుత్వం కార్యదర్శి వి.కే.మీనన్‌ను తన దూతగా శ్రీనగర్‌కు పంపడం, ఆ ప్రకారం షేక్ అబ్దుల్లా విడుదల, తాత్కాలిక ప్రభుత్వ ఏర్పాటు, ఆ పిదప తనతో ఢిల్లీలోనే రాసుకొని తెచ్చిన 'విలీన పత్రం'పై హరిసింగ్ సంతకం చకచకా 26 అక్టోబర్ 1947నాడు గత్యంతరం లేని పరిస్థితుల్లో జరిగిపోయింది. కశ్మీర్‌కు సంబంధించిన రక్షణ, కమ్యూనికేషన్లు, విదేశీ వ్యవహారాలు కేంద్ర అధికారంలో వుంటాయి. మిగిలిన సర్వాధికారాలు కశ్మీర్ ప్రభుత్వ ఆధీనంలో వుంటాయి.

అందుకే ఒకే దేశంలో వున్నా ఇక్కడొక ప్రధాని, అక్కడొక(కశ్మీర్‌లో) ప్రధాని. దశాబ్దాల పాటు తమ అస్థిత్వాన్ని పరిరక్షించుకుంటూ పోరాడిన కశ్మీరీయులు పూర్తిగా గెలువలేదు. పూర్తిగా ఓడిపోలేదు. అలా ఒక ప్రత్యేక పరిస్థితుల్లో ఒక దేశంలో మరో దేశం షరతులతో విలీనం అన్నమాట. ఒప్పందం ప్రకారం భారతసేనలు 27 అక్టోబర్ 1947న శ్రీనగర్‌లో అడుగుపెట్టగానే అక్కడి వేలాది మంది ప్రజలు భారత సైన్యానికి జేజేలు పలుకుతూ స్వాగతం పలికారు.

అనేక ఆటంకాలు, స్పర్థల పిదప మహారాజ హరిసింగ్ షేక్ అబ్దుల్లా ప్రధానిగా 05 మార్చి, 1948న కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాడు. ఎన్నో కారణాల వల్ల ఆనాడు కశ్మీర్ ప్రజలు మత రాజ్యమైన పాకిస్తాన్ కంటే లౌకిక రాజ్యం భారత్‌వైపే మొగ్గుచూపారు.

**ఐక్యరాజ్యసమితి ప్రవేశం**

26.11.1947న న్యూఢిల్లీలో ఇరుదేశాల ప్రధానులతో మౌంట్ బాటన్ చర్చలు జరిపాడు. ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో కశ్మీర్లో ప్లెబిసైట్ జరుపాలని, మరికొన్ని ఇతర అంశాలు ఇరుపక్షాలు అంగీకరించి ఒప్పందానికి వచ్చాయి.

**వాస్తవాధీన రేఖ**

1948 నుంచి ఐరాస ఇరుదేశాల బాధ్యుల్ని కూర్చుండబెట్టి కశ్మీర్లో ప్లెబిసైట్ నిర్వహణకు సన్నాహాలు ప్రారంభించింది. ఆ నేపథ్యంలోనే ఇరుపక్షాల మధ్య కాల్పుల విరమణ జరిగింది. పాక్ చొరబాటుదారుల చేతుల్లో కొంతభాగం, మెజారిటీ కశ్మీర్ భూభాగం భారత్ ఆధీనంలో వున్నది. ఐరాస పెద్దమనుషుల మధ్యవర్తిత్వంలో రూపొందిన సరిహద్దు గీతనే 'కాల్పుల విరమణరేఖ'(Ceasefire Line)గా పిలువబడే దీన్నే 'వాస్తవాధీనరేఖ'(Line of Actual Control)గా ప్రసిద్ధి చెందింది. ఈ రేఖకు అవల భాగాన్ని పాక్ ఆక్రమిత కశ్మీర్(Pak Occupied Kashmir)గా ఇవతలి భాగం ఇండియాలో ఉంది. దీన్ని ప్రపంచ వ్యాప్తంగా భారత్ ఆక్రమిత కశ్మీర్(India Occupied Kashmir)గా పిలుస్తున్నారు.

ఈ రేఖకు ఇరువైపుల గలవారు ఒకే జాతి, ఒకే సంస్కృతీ సంప్రదాయాలు గల కశ్మీరీయులే. ఈ రెండు కశ్మీర్ల మధ్యనున్న ఈ వాస్తవాధీన రేఖ సుమారు 750 కిలోమీటర్ల పొడవు కలిగి ఉంది.

1951 సెప్టెంబర్, అక్టోబర్‌లలో ఇక్కడ ఎన్నికలు జరిగాయి. 1951 అక్టోబర్ 31న షేక్ అబ్దుల్లా ప్రధానిగా ఎన్నికయ్యాడు. 1951 నవంబర్ 12న జమ్మూ అండ్ కశ్మీర్ నూతన రాజ్యాంగ చట్టం అమల్లోకి వచ్చింది.

**జమ్మూ ప్రజా పరిషత్ ఆందోళన**

పక్కా హిందూ మతోన్మాదం కలిగిన జనసంఘ్ లోయలో జమ్మూ ప్రజా పరిషత్ పేర ఆందోళన ప్రారంభించి

**"ఏక్ దేశ్‌మే దో విధాన్ -ఏక్ దేశ్‌మే దో నిశాన్**

**ఏక్ దేశ్‌మే దో ప్రధాన్ నహీ చలేగా నహీ చలేగా"**

అంటూ అక్కడి ప్రజలపై మతం రంగు పులుముటకు నడుం గట్టింది. ఈ సంస్థ మెల్లమెల్లగా కశ్మీర్‌లో అడుగుపెట్టడానికి ప్రయత్నించింది.

మరోవైపు షేక్ అబ్దుల్లా స్వతంత్ర కశ్మీర్ నినాదానికి ప్రజల్ని అప్రమత్తం చేస్తున్నాడు. కొరకరాని కొయ్యలా మారుతున్న షేక్‌అబ్దుల్లాను కేంద్ర ప్రభుత్వం అరెస్టు చేసింది. ఆ పిదప ఢిల్లీ తొత్తు బక్షీ గులాం మొహ్మద్‌ను కశ్మీర్‌కు ప్రధానిగా నియమించారు.

**కశ్మీర్లో అధికరణం 370**

భారత రాజ్యాంగ చట్టం జమ్మూ-కశ్మీర్ రాష్ట్రం మినహా ఇతర రాష్ట్రాలకు వర్తిస్తుంది. దీన్నే భారత ప్రభుత్వం తన రాజ్యాంగంలో చేర్చింది. ఇది 1949 నుంచి అమల్లో ఉంది.

**35 ఎ**

జమ్మూకశ్మీర్లో స్థానికేతరులు స్థిరాస్తులు కొనకుండా నిరోధించే రాజ్యాంగ హక్కు 35 ఎ. ఇక్కడ శాశ్వత నివాసులు ఎవరో నిర్ణయించే అధికారం ఈ ఆర్టికల్ ఆ రాష్ట్ర అసెంబ్లీకి ఇచ్చింది. 1954లో రాష్ట్రపతి ఉత్తర్వుల ద్వారా ఇది రాజ్యాంగంలో చేర్చబడింది.

1971 సిమ్లా ఒప్పందం, 1975లో షేక్ అబ్దుల్లా విడుదల, తిరిగి ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి కావడం, సుదీర్ఘ జైలు జీవితం అనుభవించిన 'కశ్మీర్ సింహం' 'స్వతంత్ర కశ్మీర్' నినాదాన్ని త్యజించడం వగైరా వగైరా ఎన్నో ఒడిదుడుకులు, ఒప్పందాలు జరిగినా కశ్మీర్ ప్రజల స్వాతంత్ర్య ఆకాంక్ష, స్వయం పాలనాకాంక్ష సన్నగిల్లలేదు.

కశ్మీర్ సమస్య ఇలా ఎప్పుడూ ఉధృతంగా ఉన్నందునే ఎప్పటికప్పుడు పాలక పక్షాలు కూడా పైకి చూడడానికన్నా ఏవేవో సంప్రదింపులు జరిపింది చూస్తాం. 2003లో ఎన్‌డీఏ సర్కార్‌లో ప్రధానిగా వున్న వాజ్‌పాయ్ కశ్మీర్ సమస్య పరిష్కారానికి 3 అంశాల సూత్రాన్ని ప్రతిపాదించాడు. దీన్నే ఆనాడు(Vajpay on Jammu and Kashmir)జమ్మూ కశ్మీర్‌పై వాజ్‌పాయ్ సిద్ధాంతంగా ప్రాచుర్యంలోకి తెచ్చారు. అది

1. కశ్మీరియత్(కశ్మీర్ విశిష్ట అస్థిత్వం)
2. ఇన్సానియత్(మానవతావాదం)
3. జంబూరియత్(ప్రజాస్వామ్యం)

ఈ మూడు అంశాలను లోతుగా పరిశీలిస్తే అతి పురాతన సాంస్కృతిక నేపథ్యమున్న కశ్మీరీయుల అస్థిత్వవాదాన్ని గౌరవించాలని, ఏండ్ల తరబడి అక్కడ మానవహక్కులు మృగ్యమైనందున మానవతా దృష్టితో కశ్మీర్‌ను చూడాలని, ఆ ప్రాంతంలో స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రజాస్వామ్య పరిరక్షణ జరగాలని ఆనాటి ప్రధాని ఆలోచన. కాని ఆ భావ పరంపరతో సాగుతూ అదే పార్టీతో ఎన్నుకోబడ్డ మోదీ-షా ద్వయం ఈ సూత్రాలనే కాక నియంతల్లాగా రాజ్యాంగాన్ని ఖాతరు చేయకుండా, ఎన్నుకోబడ్డ వారి ఆలోచనలకు విలువ నివ్వకుండా కశ్మీర్‌పై కక్ష సాధించడం అత్యంత విషాదకరం. దశాబ్దాలుగా తమ ఆకాంక్షలను ఖాతరు చేయడం లేదని, తమ అభీష్టానికి వ్యతిరేకంగా భారత ప్రభుత్వం నడుస్తున్నదని కశ్మీర్ ప్రజలంతా భారత్‌పై నరనరాన విద్వేషాన్ని నింపుకున్నారు అందుకే ఒకనాడు భారత సైన్యానికి జేజేలు పలికిన ఆ ప్రజలే 'ఇండియా గో బ్యాక్' 'ఇండియన్ ఆర్మీ గో బ్యాక్' అంటూ నినదిస్తున్నారు. అంటే ఢిల్లీ పాలకులు ఆధిపత్య ధోరణులన్నీ కశ్మీర్ ప్రజల్ని నిలువెత్తున ముంచాయి.

ఈ చారిత్రక సత్యాలను, కశ్మీర్ ప్రజల స్వయం పాలనా ఆకాంక్షల నేపథ్యాన్ని మరిచిపోయి సగటు భారతీయులను మనువాద పార్టీతో బాటు కాంగ్రెస్ లాంటి పెక్కు పార్టీలు కశ్మీర్‌కు ద్రోహం చేస్తున్నాయి.

ఢిల్లీ పాలకుల విధానం ఎలా వుందంటే 'ఏరు దాటే దాక ఓడ మల్లయ్య, ఏరు దాటాక బోడ మల్లయ్య' అన్నట్లున్నది. వేలు, లక్షల సంఖ్యలో రకరకాల మిలటరీ శక్తుల్ని పంపి చల్లని కొండల్లో విద్వేషపు మంటల్ని మండిస్తూ రక్తపాతం సృష్టించి ఉద్యమకారుల్ని బంధించి అందరికీ 'మిలిటెంట్లు' అనే ముద్ర వేసి లోయంతా శవాల దిబ్బగా మార్చి పబ్బం గడుపుకునే కమలనాథుల అప్రజాస్వామిక విధానాలు, ఆధిపత్య హిందూ ఫాసిస్టు పద్ధతులను ఇప్పటికైనా ఎండగట్టాలి.

రామమందిర నిర్మాణం, హిందూ కోడ్ పూర్తవగానే వాళ్ల దాడి భారత రాజ్యాంగంపై పడనున్న ప్రమాదాన్ని మనం మరువొద్దు. మోదీయులకు ఫెడరల్ వ్యవస్థపై, భిన్న ప్రజల మధ్య సఖ్యత పట్ల గానీ ఏ మాత్రం శ్రద్ధలేదనడానికి నాటి జనసంఘ్ నుంచి నేటి భాజపా పనితీరు, విధివిధానాలు తెలుపు తున్నాయనడంలో ఎలాంటి సందేహమక్కరలేదు. వీరి మార్గదర్శి రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ పుట్టినదే హిందూత్వ ఎజెండాలోననే సత్యాన్ని మనం గుర్తుంచుకుంటే ఈ పాలకుల కార్యక్రమాలను మనం ఎప్పటికప్పుడు బేరీజు వేయగలం.

ఇలా మోదీయులు భిన్నత్వంలో ఏకత్వం చూడ నిరాకరిస్తూ అంతా ఒకటే అంటూ భిన్నత్వాన్ని ఏ మాత్రం సహించని వాతావరణానికి పునాదులేస్తున్నారు. వాళ్ల నినాదాలు అందంగా కనిపించవచ్చు. కాని దాని వెనకాల ఆధిపత్య ధోరణి అర్థం చేసుకోకపోతే ప్రమాదమే.

'ఒకే-ఒకే' అంటూ వాళ్ల బాణం ప్రస్తుతం మొన్న వాళ్ల 'గురువు' ప్రబోధించినట్లు రిజర్వేషన్లపై కూడా పడగలదు. అందరమూ ఒక్కటే. ఈ రిజర్వేషన్లు కొందరికే ఎందుకు? అనీ పల్లవి ఎత్తుకుంటారేమో! అందుకే వీళ్ల వల్ల జాగ్రత్త. ఎవరికి వాళ్లే నాకేం నష్టం అంటూ నిర్లిప్తంగా కూచుంటే మన కాళ్ల కిందే వీళ్లు నిప్పులు పోసే రోజులు ఎంతో దూరానలేవనే నగ్న సత్యాన్ని ఎంత తొందరగా గ్రహిస్తే మనకు అంతమంచిది.

★ **రచయిత: ఫ్రీలాన్స్ జర్నలిస్టు**

# కశ్మీర్‌పై కాషాయ దాడి

వి.గోపీనాథ్

ఆర్టికల్ 370, ఆర్టికల్ 35(ఏ)ని రద్దు చేసిన భారత ప్రభుత్వం కశ్మీర్ ఇప్పుడిక సంపూర్ణంగా భారత్‌లో భాగమని గర్వంగా ప్రకటించుకుంది. దేశానికి మంచి రోజులొచ్చాయని, ఇప్పుడు కశ్మీర్‌లో ఎవరైనా ఆస్థులు కొనుగోలు చేయవచ్చనీ, ఎవరైనా కశ్మీర్ అమ్మాయిలను పెళ్లి చేసుకోచ్చని ప్రచారాన్ని లంఘించింది. సంబురాలు జరుపుకుంది. నిజంగానే 370 రద్దుతో మేలు జరిగితే ఆనందించాల్సింది కశ్మీరీ ప్రజలు కానీ, బయటి వాళ్లు కాదు. కశ్మీరు నేలను ఓ బహిరంగ చెరసాలగా మార్చి, లక్షలాది సాయుధ బలగాలతో యుద్ధ వాతావరణాన్ని సృష్టించి, చట్టసభల్లో మంద బలాన్ని ప్రదర్శించడాన్ని, బీజేపీ గొప్ప విజయంగా ప్రకటించుకుంది.

కశ్మీరు ప్రజలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తూ తీసుకున్న నిర్ణయం కశ్మీరీలను పెనం మీది నుంచి పొయ్యిలోకి నెట్టివేసింది. నిత్య నిర్బంధాన్ని చవిచూస్తూ విముక్తిని కలగంటున్న కశ్మీరీల ఆకాంక్షను పూర్తిగా అణిచివేసేందుకు భారత ప్రభుత్వం పూనుకుంది.

1947 అధికార మార్పిడి నాటికి దేశంలో 560కిపైగా సంస్థానాలు ఉన్నాయి. మెజార్టీ సంస్థానాలను నయానో, భయానో భారత్‌లో విలీనం చేసుకున్నప్పటికీ కశ్మీర్, హైదరాబాద్ దక్కన్, జునాఘడ్ సంస్థానాలు భారత్‌లో విలీనం పట్ల అనాసక్తిని కనబరిచాయి. 1948లో నిజాం నవాబు రాజ్యం భారత్‌లో విలీనం, హైదరాబాద్ సంస్థానంపై పోలీసు చర్యలకు ఐక్యరాజ్య సమితి స్పందించింది.

నిజాం రాజ్యం పాలనను మూడు ముక్కలుగా చీల్చి మూడు రాష్ట్రాల్లో కలిపారు. అంతర్గత విభేదాలు చోటు చేసుకోకుండా ఉండడం కోసం భౌగోళికంగా హైదరాబాద్ స్టేట్ లేకుండా చేశారు. ముస్లింలు అత్యధికంగా ఉన్న ప్రాంతం కశ్మీర్‌ను కూడా విలీనం చేసుకోవాలని అనుకుంది. హరిరాజ్ సింగ్ ఒప్పుకోలేదు. కశ్మీరీ ప్రజలు కూడా స్వతంత్రంగా ఉండడం వైపే మొగ్గు చూపారు. ఈ క్రమంలో ఒక గిరిజన తెగ కశ్మీర్‌లో తిరుగుబాటుకు సిద్ధమైంది. దానిని పాకిస్తాన్ అవకాశంగా తీసుకొని యుద్ధానికి సిద్ధమైంది.

దీంతో.. రాజా హరిసింగ్ తమను కాపాడాలని భారత్ సైనాన్ని శరణుజొచ్చాడు. అలా.... భారత్ సైన్యం కశ్మీర్లోకి ప్రవేశించింది.

రెండు సంవత్సరాల పాటు యుద్ధ వాతావరణం నెలకొంది. రెండు దేశాల నడుమ కాల్పుల విరమణ ఒప్పందాన్ని కుదిర్చినప్పటికి కశ్మీర్ నుండి తన సైన్యాన్ని ఉపసంహరించు కోవడానికి ఆనాడు పాకిస్థాన్ ఒప్పుకోలేదు. దీనితో కశ్మీర్ రెండుగా విడిపోయింది.

కొంత భారతదేశంలో రాగా మరికొంత బాగం పాకిస్థాన్‌లో ఉంది. 1950లో తూర్పు కశ్మీర్‌లో కొంత భాగాన్ని చైనా ఆక్రమించుకుంది. దీంతో కాశ్మీర్ వివాదాన్ని భారత్ ఐక్యరాజ్య సమితి దృష్టికి తీసుకెళ్లింది. ఐక్యరాజ్య సమితి భారత్, పాకిస్థాన్ దేశాలకు సూచనలు చేసింది. కశ్మీర్‌లో ప్లెబిసైట్(ప్రజాభిప్రాయ సేకరణ) నిర్వహించాలని, కశ్మీరుకు సంబంధించిన ఓటర్ల అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసు కోవాలని సూచించింది. కానీ ఈ విషయంలో భారత్ చిత్త శుద్ధితో వ్యవహరించలేదు. కశ్మీర్‌ను ఆక్రమించుకునేందుకు భారత్, పాక్ నాటి నుంచీ ప్రయత్నిస్తూనే ఉన్నాయి. కానీ... ఇరు దేశాలూ కశ్మీర్ ప్రజల ఆకాంక్షలను మాత్రం పరిగణలోకి తీసుకోలేదు.

ఈ నేపథ్యంలో కశ్మీర్ రాజుతో భారత్ చేసుకున్న ఒప్పందంలో భాగంగా రాజ్యాంగంలో ఆర్టికల్ 35(ఎ)(డి) 1954లో చేర్చబడింది. ఆర్టికల్ 370(1)(డి) కింద రాష్ట్రపతి ఉత్తర్వుచే చేర్చబడింది. ఆర్టికల్ 370 కశ్మీర్‌కు స్వయం ప్రతిపత్తిని కల్పిస్తుండగా, ఆర్టికల్ 35(ఎ) కశ్మీర్ శాశ్వత నివాసులను నిర్వచిస్తుంది. 35 (ఎ) ప్రకారం శాశ్వత నివాసులకు మాత్రమే రాష్ట్రంలో స్థిరాస్తులు కొనుగోలు చేసే హక్కు, శాశ్వత నివాసులకు మాత్రమే స్థిర నివాసం ఏర్పచుకునే హక్కు ఉంది.

ఆర్టికల్ 370 ప్రకారం... జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఆమోదం లేకుండా ప్రాంతం పేరు, సరిహద్దులు మార్చేందుకు వీళ్లేదు. రక్షణ, విదేశీ వ్యవహారాలు, కమ్యునికేషన్ మినహా ఇతర చట్టాల అమలుకు కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం

తీసుకోవాలి. కానీ... గడిచిన 70 ఏళ్లలో భారత ప్రభుత్వం ఏనాడూ ఆర్టికల్ 370ని అమలు చేయలేదు. లక్షలాదిగా సైన్యాన్ని మోహరించి నియంతృత్వంగా కశ్మీర్‌పై పెత్తనం చెలాయిస్తూ వస్తోంది. అంతే కాదు.. భారత పాలక వర్గాలు ఆర్టికల్ 370, 35(ఎ) విషయంలో తప్పుడు ప్రచారాన్ని చేస్తూ వచ్చాయి.

కశ్మీర్ యువతులను దేశములోని వేరే రాష్ట్ర పౌరుడిని పెండ్లి చేసుకుంటే, అమెకు కాశ్మీరీ పౌరసత్వం రద్దైతుందని, పాకిస్థాన్ యువకుడిని పెండ్లి చేసుకుంటే మాత్రం భర్తకు కాశ్మీరీ పౌరసత్వం లభిస్తుందని తప్పుడు ప్రచారం జరుగుతోంది. ఇలాంటి తప్పుడు ప్రచారాలతో కశ్మీర్ స్వయం ప్రతిపత్తి పట్ల వ్యతిరేకతను కూడగట్టేందుకు యత్నించాయి. వాస్తవానికి ఆర్టికల్ 35 (ఎ) ప్రకారం.. రాష్ట్రంలోని పురుషుడు వేరే రాష్ట్ర యువతిని పెండ్లి చేసుకుంటే వారి సంతానానికి వారసత్వ హక్కులు లభిస్తాయి. అదే కాశ్మీర్ యువతి వేరే రాష్టానికి చెందిన యువకుడిని పెండ్లి చేసుకుంటే, వారి సంతనానికి ఆ రాష్ట్ర పౌరహక్కులు, వారసత్వ హక్కులు లభించవు.

భారత రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలు, ప్రాథమిక విధులు జమ్ముకశ్మీర్ రాష్టానికి వర్తించవు. అందుకే... 370తో పాటు, జమ్ముకాశ్మీర్ స్వయం ప్రతిపత్తిని కాపాడుతున్న రాజ్యాంగంలోని 35 ఎ అధికారణను రద్దు చేసేందుకు బీజేపీ ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవ హరించింది. ఉగ్రవాదుల దాడులు పెరుగుతున్నాయనే సాకుతో, దేశానికి ప్రమాదం పొంచి ఉందనే సాకుతో కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. శాంతి భద్రతల పేరిట కశ్మీర్‌కు లక్షలాది అదనపు బలగాలను తరలించింది. కశ్మీర్ నేతలను, ప్రజలను నిర్బంధించి ఆర్టికల్ 370, 35 (ఎ)లను రద్దు చేసింది. హైదరాబాద్ సంస్థానాన్ని మూడు ముక్కలు చేసినట్లే.. ఇప్పుడు జమ్ముకాశ్మీర్ నుంచి జమ్ము, లద్దాఖ్‌లను వేరుచేసింది.

లద్దాఖ్‌ను కేంద్రపాలిత ప్రాంతంగా చేయాలనేది మొదటి నుంచీ ఆర్‌ఎస్‌ఎస్ డిమాండ్. ఆర్‌ఎస్‌ఎస్ 2002 జూన్‌లో జరిగిన కురుక్షేత్ర జాతీయ స్థాయి కార్యవర్గ సమావేశంలో బహిరంగంగానే తీర్మానం చేసింది. జమ్ము, కశ్మీర్, లద్దాఖ్‌లను మూడు ముక్కలుగా చేయాలని సూచించింది. ఇదే వ్యూహాన్నీ అమిత్ షా, మోడీలు అనుసరించారు. 2002 జులై 14న జమ్ము స్టేట్ మోర్చా ఏర్పాటు చేసింది. మొన్నటి దాకా రెండు డివిజన్లు జమ్ముకశ్మీర్లో ఉన్నాయి. కొన్ని నెలల క్రితం లద్దాఖ్ డివిజన్ ప్రకటించారు. మిగిలింది లద్దాఖ్‌ను కేంద్రపాలిత ప్రాంతం చేయడమే. 2014లోనే లద్దాఖ్‌ను కేంద్రపాలిత ప్రాంతం చేయడాన్ని తమ మేనిఫెస్టోలో పొందు పరిచిందీ బీజేపీ.

మొన్నటి వరకు రాష్ట్ర అసెంబ్లీలో మిత్ర పక్షంగా ఉన్న పీడీపీ నాయకురాలు మెహబూబాముఫ్తీ ఈ ప్రతిపాదనలను వ్యతిరేకిచ్చారు. కానీ.. జమ్ము, లద్దాఖ్ వేరు పడితే అక్కడ ఉగ్రవాదుల సమస్య ఉండదని బీజేపీ వాదిస్తూ వచ్చింది.

రాష్టాన్ని విభజించడం ద్వారా జమ్ము, లద్దాఖ్‌లలో పట్టు సాధించవచ్చనేది బీజేపీ యోచన. అందుకోసం... 87 సీట్లున్న అసెంబ్లీ నియోజకవర్గాలను పునర్విభజన చేయాలని చూస్తున్నది. కశ్మీర్లో జనాభా 52.88 శాతం, 47 అసెంబ్లీ స్థానాలు, కశ్మీర్ లోయలో జమ్ము ప్రాంతంలో 37 అసెంబ్లీ స్థానాలు, లద్దాఖ్‌లో 4 స్థానాలు ఉన్నాయి. జమ్ము, లద్దాఖ్‌లో బీజేపీకి పట్టుందని రాజకీయ నాయకుల అంచనా. జమ్ము, లద్దాఖ్ ప్రాంతంలో హిందువులు, బౌద్ధులు అధికంగా ఉన్నారు. అసెంబ్లీ పునర్విభజన చేస్తే బీజేపీకి లాభం ఉంటుందని కమలం నేతలు అరాట పడుతున్నారు. 2026 వరకు పునర్విభజన చేయాకూడదనే చట్టం అక్కడ ఉంది. నాడు రాష్ట్ర గవర్నర్ పాలనలో ఉంది. గవర్నర్ పాలన ద్వారా అసెంబ్లీ పునర్విభజన చేయాలని బీజేపీ చూస్తున్నది.

కశ్మీర్ ప్రజల అభిప్రాయాలను పరిగణలోకి తీసు కోకుండా బలవంతంగా కశ్మీర్‌ను తమలో కలుపుకునేందుకు భారత పాలకులు చేసిన ప్రయత్నం పూర్తి రాజ్యాంగ విరుద్ధమైనది. ఆర్టికల్ 370, ఆర్టికల్ 35 (ఎ) రద్దు తరువాత ప్రజలు నిరసన వ్యక్తం చేయకుండా జమ్ము కశ్మీర్‌లో లక్షలాది సైన్యాన్ని మోహరించింది ప్రభుత్వం. ప్రజలను ఇళ్లలోంచి బయటకు రానీయకుండా నిర్బంధించి యుద్ధ వాతావరణాన్ని సృష్టించింది. వైద్య సదుపాయాలు, కమ్యూనికేషన్, రవాణాలను నిలిపివేసింది. ప్రభుత్వ పాసిస్టు చర్యలను నిరసించే ప్రజలపై తూటాల వర్షం కురిపిస్తోంది. భారత పాలక వర్గాల ఫాసిస్టు చర్యలకు వ్యతిరేకంగా బలమైన ప్రజా ఉద్యమాన్ని నిర్మించాల్సిన సందర్భం ఇది. కశ్మీరీ ప్రజల విముక్తి పోరాటానికి అండగా నిలవాల్సిన సందర్భం ఇది.

T

# జమ్మూ కశ్మీర్ - ఐక్యరాజ్యసమితి తీర్మానాలు

ఎ.జి.నురాని

3 జూన్ 1947 నాటి విభజన పథకం పిదప వివిధ చర్చలు చోటు చేసుకున్నాయి. 13 జూన్ 1947 నాటికి మౌంట్ బాటన్ అధ్యక్షతన జరిగిన సంయుక్త రక్షణ కౌన్సిల్ సమావేశ సమయానికి ఉపఖండాన్ని నాశనం చేసే ఆలోచన ముందుకు వచ్చింది. ఎవరితో కలిసిపోవాలో సంస్థానాధీశులే నిర్ణయించుకోవాలని మహ్మద్ అలీ జిన్నా ప్రకటించాడు. ఆ విషయంలో జవహర్‌లాల్ నెహ్రూ జోక్యం చేసుకుంటూ అది ప్రజలు నిర్ణయించాల్సిన అంశం అని పేర్కొన్నాడు. 17 జూన్, 20 జులై రోజులలో జిన్నా తన మనోగతాన్ని పత్రికకు ప్రకటనల రూపంలో ప్రకటించాడు.

అఖిల భారత కాంగ్రెస్ కమిటీ ఈ విషయంలో ప్రధాన పాత్ర ప్రజలదే అని చెప్పింది(ద టైమ్స్ ఆఫ్ ఇండియా, 16 జూన్ 1947) భారత్‌లో కలువడానికి హరిసింగ్‌కు స్వేచ్ఛ వుంది. పాకిస్తాన్‌లో జునాగఢ్ కల్సినదాన్ని జిన్నా సమర్థిస్తూ భారత్‌లో నిజాం నవాబు కలువకపోవడమే మంచిదన్నాడు. కొందరు గిరిజనులు జరిపిన దాడి నేపథ్యంలో హరిసింగ్ భారత్ కోరినట్లుగానే భారత్‌లో కలువడానికి ఒప్పుకున్నాడు. అప్పుడే మౌంట్ బాటన్ ప్రకటన విడుదల అయింది. దాంట్లో ఒక దేశంలో విలీనం కావడం అనేది అక్కడి ప్రజల కోరిక మేరకే జరుగాలని, కశ్మీర్‌లో ప్రశాంతత నెలకొనగానే దాడికి పాల్పడ్డ వారిని వెనక్కు పంపడం-అక్కడి ప్రజల కోరిక మేరకు వాళ్లు ఏ దేశంలోనైనా కలువొచ్చు అనేది మా ప్రభుత్వ ఆలోచన అని ప్రకటన ద్వారా తెలిపాడు. అలా భారత్ పాక్‌ల మధ్య కొంత తగాదా వున్నట్లు బహిర్గతమయింది.

1948లో విడుదల చేసిన 'శ్వేతపత్రం'లో ప్రజలు సంపూర్ణ మద్దతు తెలిపేంత వరకు విలీనం అనేది తాత్కాలికమే అని భారత్ ప్రకటించింది. 30 అక్టోబర్ 1947 నాడు విడుదల చేసిన ఒక ప్రకటనలో "కశ్మీర్ ఏ పరిస్థితుల్లో భారత్‌లో విలీనం కోరుకున్నదో బహిర్గతం చేయాలన్నది".

విలీనానికి సంబంధించిన ప్రధాన పత్రంలో ఇవి కూడా భాగమే. భారత్‌లో కలవడం అనేది తాత్కాలికం లేదా షరతుల తోటిది అనడం విచిత్రమైన విషయం. భారత్‌లో కశ్మీర్ కలవడంతో కశ్మీర్ ప్రజల హక్కు దాన్ని సెక్యూరిటీ కౌన్సిల్ వద్దకు తీసుకపోవడంతో గుర్తించబడ్డది.

భారత్-పాక్‌ల మధ్య ఘర్షణ తలెత్తింది కూడా భారతదేశం గుర్తించగల్గింది. అక్టోబర్ 25, 1947 నాడు కశ్మీర్ విలీనం పిదప బ్రిటీష్ ప్రధానికి, ఆ పిదప పాకిస్తాన్ ప్రధానికి పంపిన టెలిగ్రాంలో నెహ్రూ "ఈ పరిస్థితిలో కశ్మీర్ రాష్ట్ర సహాయం కోసం భారత్ ఎలాంటి ప్రభావాన్ని చూపడం లేదు. ఏ పరిస్థితుల్లో ఒక ప్రాంతం ఇంకో దేశం/ప్రదేశం లోనికి కలిసి పోతుండడం అనేది ఆ ప్రాంత ప్రజల ఇష్టంపైనే ఆధారపడాలనే ఆలోచనకు భారత్ గట్టిగా మద్దతు ఇస్తున్నది".

పాకిస్తాన్ ప్రధాని లియాకత్ అలీకి 31 అక్టోబర్ 1947లో పంపిన టెలిగ్రాంలో నెహ్రూ "శాంతి పునరుద్ధరణ జరిగిన మరుక్షణమే ఆ ప్రాంతం నుంచి మా సైన్యాన్ని ఉపసంహరిస్తాం. ఒక దేశంలో కలిసే విషయంలో ఆ రాష్ట్ర ప్రజలే నిర్ణయించుకోవాలనే విషయాన్ని మేం బలంగా దృఢపరుస్తున్నాము. ఇది మీకు, ప్రపంచానికి మేము చేసే ప్రతిజ్ఞ". 2 నవంబర్‌నాడు రేడియోలో ప్రసంగిస్తూ నెహ్రూ "కశ్మీర్ విషయంలో కశ్మీర్ ప్రజలే నిర్ణయాత్మక పాత్ర పోషించాలి. ఇది మేము ప్రతిజ్ఞా పూర్వకంగా చెబుతున్నాం. దీనికి మహారాజు మద్దతిచ్చాడు. మేము ఈ విషయంలో వెనుకకు పోము, పక్కకుపోము".

ఆ విధంగా ఐక్యరాజ్యసమితి 1948లో చేసిన తీర్మానాల నేపథ్యంలో కశ్మీర్ ప్రజల హక్కు ఎన్నడూ ప్రశ్నించబడలేదు. ఈ తగాదాలో భాగస్వామియైన పాకిస్తాన్ కశ్మీర్ భవితవ్యం గూర్చి ప్రశ్నించలేదు.

ఐక్యరాజ్యసమితి 35వ అధికరణం కింద భారతదేశం తన ఉద్దేశాన్ని 1 జనవరి 1948నాడు నమోదు చేసింది. ఆ విధంగా ఏ తగాదా గాని సమస్య గాని అంతర్జాతీయ ఉద్రిక్తతకు గాని అశాంతికి గాని దారితీస్తే చక్కదిద్దే అవకాశాలను ఐక్యరాజ్యసమితి భుజాన వేసుకుంటుంది. ఆర్టికల్ 25 ప్రకారం అది చేసే నిర్ణయాలకు సభ్యదేశాలు కట్టుబడి వుండాల్సిందే.

**ఐక్య రాజ్యసమితి భద్రతా మండలి ప్రొసీడింగ్స్:**

**యుఎన్ఎస్‌సికి భారత్ మూడు విజ్ఞాపనలు:** అవి.. జమ్మూ

కశ్మీర్ ఆక్రమణ పాకిస్తాన్ ప్రభుత్వ వ్యక్తులెవరినైనా నిలువరించడం, ఆ దేశ జాతీయులు ఏ ఆందోళనకు దిగకుండా కట్టుదిట్టం చేయడం, ఆక్రమణదారులకు ఏ సహాయ సహకారాలు అందించ కుండడం. 15 జనవరి 1948న పాకిస్తాన్ ప్రభుత్వం దీనికి జవాబుగా ఫిర్యాదు చేసింది. అందులో కశ్మీర్ సమస్యతో పాటు, మిగులు నిధుల పంపకం, వస్తు పంపకం వగైరా చూపింది. అందుకే కౌన్సిల్ ఎజెండాలో ఇది భారత్-పాకిస్తాన్ సంబంధిత ప్రశ్నగా నిలిచింది. ఇరుదేశాలకు ఐక్యరాజ్య సమితి కమీషన్‌ను నియమించింది. పాకిస్తాన్ జమ్మూకశ్మీర్‌లో 'ప్రజాభిప్రాయ సేకరణ' జరగాలని ఆ రాష్ట్ర ప్రజలు భారత్‌లో వుంటారా పాకిస్తాన్‌లో వుంటారా తెల్సుకోవడంతో బాటు తక్షణ కాల్పుల విరమణకు ఆదేశించాలని కోరింది. జూన్ 17, జులై 30 1947నాడు దేశ ప్రజలనుద్దేశించి జిన్నా 'రాష్ట్రాలు స్వతంత్రంగా వుండే హక్కు కలిగి వున్నాయ'ని నొక్కిచెప్పాడు. కాని 1948 నుంచి ఏ ప్రకటన చేసినా 'మూడవ ఐచ్ఛికమైన 'స్వతంత్రం' అనే మాటను సంపూర్ణంగా విసర్జించడం గమనించాల్సిన విషయం. అంటే స్వయం నిర్ణయానికి ఇది గొడ్డలిపెట్టు లాంటిది.

ఇద్దరు వితండవాదులు, తలబిరుసువాళ్లుగా చెప్పుకునే సర్ గోపాలస్వామి అయ్యంగార్(కశ్మీర్ మాజీ దివాన్), ఎం.సి.సెతల్వాడ్(భారత్ అడ్వొకేట్ జనరల్)లను భారత్ కేస్ వాదించడానికి పంపారు. అలాగే పాకిస్తాన్ విదేశాంగమంత్రి సర్ మహ్మద్ జఫ్రుల్లా ఖాన్(గుండెలు దీసిన బంటు, చలాకైన వ్యక్తి) 15 జనవరిన గోపాలస్వామి, జనవరి 16, 17 తేదీల్లో జఫ్రుల్లాఖాన్ ప్రసంగించారు.

## వాదనల పిదప కౌన్సిల్ ఈ కింది తీర్మానాలను చేసింది:

1. 17 జనవరి 1948(ఎస్/651)న "ఇరుపక్షాలు సంయమనంతో వుండాలి. ఏదేని భౌతిక మార్పు జరిగితే తక్షణమే కౌన్సిల్‌కు తెలియజేయాలి" పాకిస్తాన్ వినకపోగా తదనంతరం తన మూడు బ్రిగేడ్ల సైన్యాన్ని పంపింది.

2. 20 జనవరి 1948(ఎస్/654) ఇరుపక్షాల నుంచి ఒక్కొక్క సభ్యుడు, వారు సూచించిన మూడవ వ్యక్తితో కమీషన్ ఏర్పాటు. పెట్టిన షరతులు కొత్త ఢిల్లీని తీవ్ర ఆవేశానికి గురిచేశాయి. 'సి' కమీషన్ రెండు చర్యలతో కూడివున్నది.

1. ఛార్టర్‌కు సంబంధించి 34వ అధికరణం కింద అక్కడి వాస్తవ పరిస్థితులను బేరీజువేయడం.

2. కౌన్సిల్‌కు ప్రతిబంధకం కాని ఇతర మార్గాల ద్వారా అక్కడ పని మరింత సులభతరమయ్యే విధంగా మరో సంస్థ/ వ్యక్తి ద్వారా సంక్లిష్టతలను దూరం చేయడం.

"డి క్లాజు 'సి'లో సూచించిన విధంగా కౌన్సిల్ పనిచేస్తుంది. 1. దీనికి మూలం రెండు లేఖలు: ఒకటి-1 జనవరి 1948నాడు భద్రతా మండలి అధ్యక్షునికి కశ్మీర్ విషయమై భారత ప్రధాని నెహ్రూ రాసిన లేఖ. రెండు: 15 జనవరి 1948నాడు ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్‌కు రాసి పాకిస్తాన్ విదేశాంగమంత్రి లేఖ. 2. పై తేదీతో పాకిస్తాన్ విదేశాంగ మంత్రి రాసిన కశ్మీర్‌కు సంబంధించిన ఇతర అంశాలు. ఇది ఓ చిన్న ఓదార్పే. 8 ఫిబ్రవరినాడు వెనుకకు రావడానికి భారత బృందం నిశ్చయించింది. ఒక నెల పిదప తిరిగి వచ్చేసింది. సుదీర్ఘ మూడు నెలల చర్చల పిదప కౌన్సిల్ స్పందించింది. 3. 21 ఏప్రిల్, 1948 (ఎస్/726) కమిటీ సభ్యత్వాన్ని 5కు పెంచుతూ తక్షణమే పని ప్రారంభిస్తూ భారత ఉపఖండంలో కార్యాలయాన్ని ప్రారంభించడానికి నిశ్చయమైంది. కాల్పుల విరమణ, సైన్యాన్ని పంపకపోవడం, శ్రీనగర్‌లో సంకీర్ణ ప్రభుత్వ ఏర్పాటు, ప్రజాభిప్రాయ నిర్వహణకు ఒక అధికారిని నియమించడం-అజెండా అంశాలు. వీటికి 30 ఏప్రిల్‌నాడు పాకిస్తాన్ సమ్మతించింది. భారత్ తన వ్యతిరేకతతోనే వీటికి మే 7న సమ్మతించింది.

4. 3 జూన్ 1948(ఎస్/819) నాడు కౌన్సిల్ సంబంధిత కమిషన్‌ను తక్షణమే ప్రారంభించాలని సూచించింది. అత్యంత ప్రాధాన్యతగల అంశంగా 21 ఏప్రిల్ 1948నాటి తీర్మానాన్ని అనుసరించి కమిషన్ సభ్యులు ఘర్షణ ప్రాంతాలకు వెళ్లాలని, అత్యంత ప్రాధాన్యతాంశంగా భావిస్తూ ఎలాంటి ఆలస్యం చేయక పని ప్రారంభించాలని నొక్కి చెప్పింది. పాకిస్తాన్ విదేశాంగమంత్రి 15 జనవరి 1948నాడు లేవనెత్తిన అంశాలకు ప్రాధాన్యత నివ్వడంతో నెహ్రూ తన తీవ్ర వ్యతిరేకతను తెల్పుతూ జూన్ 9నాడు 'కశ్మీర్ ప్రాధాన్యతను' నిల్పుకుంటుందని చెప్పాడు.

యుఎన్‌సిఐపి తీర్మానాలు: కమీషన్ 11 వారాల సమయం తీసుకొని ఎట్టకేలకు 5 జూలైనాడు కరాచీ చేరుకున్నది. యుఎన్‌సిఐపి(భారత-పాకిస్తాన్‌ల పై ఐక్యరాజ్యసమితి కమీషన్) దీనికి పాకిస్తాన్ 3 బ్రిగేడ్ల సైన్యాన్ని పంపినట్లు ఫిర్యాదు. కమీషన్ రెండు తీర్మానాలు చేసింది. ఒకటి: 13 ఆగస్ట్ 1948(ఎస్/ 1100, ప్యారాగ్రాఫ్ 75) పాకిస్తాన్ సైన్యాన్ని ఉపసంహరించాలి. ఆ ప్రాంతం ఖాళీ చెయ్యాలి. ఇదంతా స్థానిక అధికారులు కమీషన్ నేతృత్వంలో పనిచేయాలి. భారత్ కూడా పెద్ద ఎత్తున మోహరించిన తన సైన్యాన్ని వెనక్కు తీసుకోవాలి.

ఇంకా ఈ విధమైన ప్రతిన చేసింది. "భారత్ పాకిస్తాన్‌లు మరొక్కసారి కశ్మీర్ భవితవ్యం ఆ దేశాల ప్రజల అభీష్టం మేరకే జరగాలని ఇరుపక్షాలు కమీషన్ సూచించే, చేసే అన్నిరకాల

ఒప్పందాలను గౌరవించాలి". ఈ పదాలతో మూడవ ఐచ్ఛికమైన 'స్వతంత్రం' అనే దానికి తెరలేపింది. 20 ఆగస్టు 1948 నాడు నెహ్రూ వీటికి తన సమ్మతిని తెలిపాడు. జఫ్రుల్లాఖాన్ మాత్రం 'సంపూర్ణ కాల్పుల విరమణ' ప్రకటించాలని లేదా 'ఫైనల్ ఫలితం' ప్రకటించాలన్నాడు. యునిసిప్ తీర్మానాన్ని అతడు ఒప్పుకోనందున కమీషన్ 19 సెప్టెంబర్ నాడు తన విచారాన్ని తెలిపింది.

భారత్ నామినేట్ చేసిన చెకోస్లవేకియా దేశసభ్యుడు జోసెఫ్ కార్బెల్ కమీషన్‌ను తప్పుపడ్తూ 'కశ్మీర్ ప్రమాదం' అనే అంశాన్ని రాశాడు. అతని కూతురు మడెలిన్ ఆల్‌బ్రైల్ ఆ పిదప ఐక్యరాజ్యసమితి 'సెక్రెటరీ ఆఫ్ స్టేట్స్' పదవికి వెళ్లింది. మిగతా సభ్యులు అర్జెంటీనా, బెల్జియం, కొలంబియా, అమెరికా దేశస్తులు పారిస్‌లో జరుగుతున్న సెషన్స్‌కు కౌన్సిల్ తన తాత్కాలిక నివేదికను 22 నవంబర్ 1948(ఎస్/1100) నాడు అందజేసింది. ఆ నివేదికలో కమీషన్ తన పనిని కొనసాగిస్తున్నట్లు తెల్పింది. ఆ సమావేశంలోనే ప్రజాభిప్రాయ సేకరణ, విధి, విధానాల గూర్చి చర్చించి 5 జనవరి 1949 నాడు రెండవ తీర్మానం చేసింది.(ఈ తీర్మానాన్నే సయ్యద్ గిలానీ ప్రస్తావిస్తున్నాడు) ఇది రెండవ తాత్కాలిక నివేదిక 10 జనవరి 1949(ఎస్/1196)లో భాగమయింది.

ఐక్యరాజ్యసమితి ప్రజాభిప్రాయ సేకరణ జరుపుటకు ఒక అధికారిని నియమించాలి. అందరి సంప్రదింపులయ్యాక మార్చి 1949లో అమెరికాకు చెందిన ఫ్లీట్ అడ్మిరల్ ఛెస్టర్ డబ్ల్యు నెమిట్జ్ నియామకం జరిగింది. అతడు కశ్మీర్ కార్యాలయానికి వెళ్లాలి. కాందిశీకులు తిరిగి చేరుకోవాలి. 2016లో ఇలాంటి వారెందరు జీవించివున్నారో? అదో ఆశ్చర్యకరం. కశ్మీర్ పౌరులు కాని మిగతావాళ్లు రాష్ట్రం విడిచి వెళ్లాలి. నెమిట్జ్ ప్రజాభిప్రాయ సేకరణ ఫలితాన్ని భద్రతా మండలికి/ కశ్మీర్ ప్రభుత్వానికి తెలియచేయాలి. పాక్ ఆక్రమిత కశ్మీర్(ఆజాద్ కశ్మీర్) ఈ విషయంలో కలుపబడలేదు.

ఇరుదేశాలు ఈ విషయాన్ని ఒప్పుకున్నాయి. భారత్ నూతన సైన్యవిధానం వలన ఆగస్టు 1948 జనవరి1949 మధ్యకాలంలో పాకిస్తాన్ కశ్మీర్‌లో చాలా భూభాగం కోల్పోయింది. భారత విదేశాంగ మంత్రి వి.కే.కృష్ణ మీనన్ – 8 ఫిబ్రవరి 1957నాడు భద్రతా మండలిలో ఇలా అన్నాడు. " ఆగస్ట్ 13, 1948, 5 జనవరి 1949 నాడు చేసుకున్నవి రెండూ అంతర్జాతీయ తీర్మానాలు. ఇవి రెండే మేము ఒప్పుకున్న ఒప్పందాలు కావచ్చు లేదా అంశాలు కావచ్చు. గతంలో ఇరుదేశాల హక్కులు, సంబంధిత విషయాలు అన్నీ కూడా 'గౌరవప్రదమైన తీర్మానాల' ద్వారా కల్సిపోయాయి. ప్రస్తుతం మన ముందు మిగిలివున్నది ఈ ఒప్పందాలను ఎలా అమలుచేయాలి? తీర్మానాలు ఒప్పుకున్నాక 'దాడి–దూకుడు' అని వాడడం తప్పు.

కాని "ఆగస్టు 1948 నాటి యుఎన్‌సిఐపి తీర్మానం ద్వారా జరిగిన ఒప్పందంపై 'ప్రజాభిప్రాయ సేకరణ' అనేది యాదృచ్ఛికం, అనిశ్చితత్వం. ఏప్రిల్ 2, 15–1949న రెండు అభిప్రాయాలు చెప్పింది. ఇరువైపులు వీటిని వ్యతిరేకించాయి. ఆజాద్ కశ్మీర్లో 35 బెటాలియన్లకు పెరిగిన సైన్యం ఉపసంహరణ, భారత్ విస్తృతంగా పంపిన సైన్య ఉపసంహరణ అంశాలపై భేదాభిప్రాయాలు కేంద్రీకృతమయ్యాయి. 9 డిసెంబర్ 1949(ఎస్/1430)న ఇచ్చిన మూడవ తాత్కాలిక నివేదికలో కమీషన్ తన వైఫల్యాన్ని ఒప్పుకుంది. 29 జులై 1949 నాడు జరిగిన ఒప్పందంలో కశ్మీర్లో కాల్పుల విరమణ జరగాలి అనేది మాత్రమే సఫలమైన అంశం.

1950 నుంచి 1958 వరకు ఏక ప్రతినిధితో కమీషన్ నడిచింది. అంతకు ముందు దాని అధ్యక్షుడైన ఎజిఎల్ మెక్‌నాటన్ (కెనడా)ను ఒక ప్రణాళిక నేర్పాటు చేయమని ఇరుపక్షాలూ అడుగలేదు. అతని 27 డిశంబర్ 1949 నాటి ప్రతిపాదన సఫలం కాలేదు. భేదాభిప్రాయాలు సమసిపోలేదు(ఎస్/1453)

5. 14 మార్చ్ 1950 నాడు తలెత్తిన విభేదాలను పరిష్కరించుటకు ఒక ప్రతినిధిని ఎన్నిక(ఎస్/1469) చేసింది. సర్ ఒవెన్ డిక్సన్ ఆస్ట్రేలియా హైకోర్టు న్యాయాధీశుడు(ఆ పిదప ప్రధాన న్యాయాధీశుడు)ను ఎంపిక చేశారు. 15 సెప్టెంబర్ 1950 నాడు అతడిచ్చిన సొగసైన వాక్యాల నివేదిక(ఎస్/1791) నెహ్రూ మొండివైఖరిని స్పష్టీకరించింది. ఇరుదేశాల ప్రధానులతో అతడు ఒక సమావేశాన్ని ఏర్పాటుచేశాడు. ఆ సమావేశంలోనే నిక్సన్ కశ్మీర్ విభజన, లోయలో ప్రజాభిప్రాయ సేకరణ ప్రతిపాదించాడు. 'సమగ్ర ప్రజాభిప్రాయసేకరణ'ను అతడు తిరస్కరించాడు. అతని నివేదిక సమగ్రంగా, ఇరుపక్షాలకు ఆమోదయోగ్యంగా వుండి 'నిక్సన్ పథకం'గా పేరు పొందింది. అతని నివేదికలో ఈ సమస్యను ఇరుపక్షాలకు వారు వారే పరిష్కరించుకోవడం ఉచితంగా తోచదు. ఇప్పటి వరకు ఇరుపక్షాలు వాళ్లు వాళ్లే పరిష్కరించుకోలేక భారాన్నంతా భద్రతా మండలిపైన పెట్టడం–వాళ్లు నియమించిన ప్రతినిధులపైన పెట్టడం జరిగింది". ఎన్ని తీర్మానాలు చేసినప్పటికీ భద్రతా మండలి ఇరుపక్షాలకు బలవంతంగా పరిష్కారాన్ని సూచించలేదు.

పాకిస్తాన్ ఏదో ఒకటి జరిగి తీరుతుందని తన ప్రజలకు నమ్మకం కల్గించింది. భారత్ కూడా కట్టుబడే ఉంది. నెహ్రూ మాత్రం బహిరంగంగా కాకుండా 25 ఆగస్టు 1952లో షేక్ అబ్దుల్లాకు సోనామార్గ్ నుంచి రాసిన లేఖలో 'ప్రజాభిప్రాయ సేకరణ'ను వ్యతిరేకించాడు. తీర్మానాన్ని సమర్థిస్తూ, ప్రస్తుతం తనకు మిలటరీ భాగస్వామిగా వున్న పాకిస్తాన్ ప్రతిపాదనను అమెరికా సమర్థించాల్సి వచ్చింది.

అమెరికాకు చెందిన డా॥ఫ్రాంక్ పి.గ్రాహం ఆశావాది. అతని ఆశావాద అభిప్రాయాలపై అతని ఆదేశాలు పునరుద్ధరించబడ్డాయి. సంప్రదింపులు మూలకుబడ్డాక చాలా కాలం వరకు ఇతడు ఐరాస పేరోల్‌పై వున్నాడు. ఇతనిలాగే నిమ్ట్జు చాలాకాలం ఐరాస సేవలో వున్నాడు. గ్రాహం ఐదు నివేదికలు రాసి 1951 నుంచి 1958 వరకు తీరిక లేకుండా వున్నాడు.

6. 30 మార్చ్ 1951న (ఎస్/2017) మండలి నూతన సభ్యుణ్ణి నియమించుకోవాలనుకుంది. ఆ అవకాశం గ్రాహంను వరించింది.

7. 10 నవంబర్ 1951(ఎస్/2392) ఆదేశం పునరుద్ధరించబడ్డది.

8. 23 డిశంబర్ 1952(ఎస్/2553) ఆదేశం మళ్లీ పునరుద్ధరించబడ్డది.

9. 24 జనవరి 1957 సమస్యపై పరిశీలన కొనసాగించాలని నిర్ణయమైంది.

10. 21 ఫిబ్రవరి 1957 భద్రతా మండలి అధ్యక్షుడు, స్వీడన్ దేశస్థుడు గునార్ జరింగ్ తన విధిని కొనసాగించాలని ఆదేశించాడు.

11. 2 డిశంబర్ 1957 డా॥ఫ్రాంక్ గ్రాహం బాధ్యతలు స్వీకరించాలని ఆదేశాలు.

**నివేదికలు-వాటిల్లోని విఫలమైన అంశాలు:**

1. 15 అక్టోబర్ 1951(ఎస్/2375)న గ్రాహం మొదటి నివేదికలో ఇరుపక్షాల భేదాభిప్రాయాలను ఎత్తిచూపాడు.

2. 19 డిశంబర్ 1951(ఎస్/2443) రెండవ నివేదిక. వివిధ అంశాల మీద ఒప్పుదలలు రాశారు. మిగతావన్నీ పునరుద్ధరించాలని నిర్ణయం. కొత్త విషయాలేవీ పరిగణనలోకి రాలేదు.

3. 22 ఏప్రిల్ 1952(ఎస్/2611) మూడవ నివేదిక

4. 19 సెప్టెంబర్ 1952(ఎస్/2783) నాల్గవ నివేదిక.

5. 27 మార్చ్ 1953(ఎస్/2957) ఐదవ నివేదిక ఎలాంటి పురోగతి లేదు. ఇక్కడ గమనించవలసిన ముఖ్య విషయం ఏమిటంటే గ్రాహం ప్రతిపాదనలను భారత్ వ్యతిరేకించినంత వరకు పాకిస్తాన్ జఫ్రుల్లాఖాన్ వ్యతిరేకించాడు.

6. 29 ఏప్రిల్ 1957(ఎస్/3821) గునార్ జరింగ్ నివేదిక. కొత్త వాటి కోసం ప్రయత్నించి విఫలమయ్యాడు. ఏది ఏమైనా ఈ పరిశీలన చేశాడు. "తాత్కాలిక నివేదికల మీద భద్రతా మండలి ఆధారపడి ఒక ఘర్షణగా వున్న అంశం మీద తుది పరిష్కారం చూపడం కష్టమే" అని గునార్ అన్నాడు. ఇది 60 ఏండ్ల నాటి మాట.

7. గ్రాహం చివరి ప్రయత్నం. 31 మార్చి 1958(ఎస్/3984) నాడిచ్చినది. రమారమి పాత దానిలాగే వుంది. ఈ ప్రయాణంతో బహుశా ఢిల్లీలో అతనికి స్వాగత వచనాలు వుండవని తేటతెల్లమైంది.

22 జూన్ 1962(ఎస్/5134) నాడు ఆమోదించగా, యునైటెడ్ కింగ్‌డమ్, ఫ్రాన్స్‌లు ప్రవేశపెట్టిన చిత్తు ముసాయిదాను సోవియట్ రష్యా 'వీటో' చేసింది. ఇది 14 ఫిబ్రవరి 1957న కూడా అలాంటి ప్రతిపాదనను 'వీటో' చేసింది. కాని ఒక వారం తర్వాత తన ఆలోచనను మార్చుకోవడం వల్ల గ్రాహంకు కొంత ఊరట కల్గింది.

**పాకిస్తాన్ నిస్పృహ:**

కశ్మీర్‌ను భారతదేశంలోకి కలుపుకోవడానికి చేసిన విషయాల గూర్చి చర్చించడానికి (ఎస్/5517) ఒక సమావేశాన్ని ఏర్పాటు చేయాల్సిందిగా పాకిస్తాన్ విదేశాంగ మంత్రి జుల్ఫీకర్ అలీ భుట్టో 16 జనవరి, 1964నాడు భద్రతా మండలి అధ్యక్షునికొక లేఖ రాశాడు. జరిగిన చర్చలు ఏ ఫలితాలనివ్వలేదు. కేవలం చర్చల సారాంశాన్ని అధ్యక్షుడు 18 మే 1964 నాడు విడుదల చేశాడు. పాల్గొన్న సభ్యులందరూ సెక్రెటరీ జనరల్ చొరవ తీసుకోవాలని, కశ్మీర్ విషయంలో నెలకొన్న సందిగ్ధాన్ని సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని సమావేశంలో కోరారు. కౌన్సిల్ ఇతర సభ్యులు కొందరు ఇతరుల జోక్యం వల్ల కశ్మీర్ సమస్య మరింత జటిలమవుతుందని అభిప్రాయం వెలిబుచ్చారు. ఇంకా భారత-పాకిస్తాన్ విషయం మాత్రం భద్రతా మండలి ఎజెండాలో అలాగే వున్నది.

భుట్టో మనసులో ఆ వైఫల్యం బాధగానే మిగిలిపోయింది. ఆ బాధే 1965లో అధ్యక్షుడు ఆయూబ్‌ఖాన్‌ను కశ్మీర్ సమస్యపై సైనిక చర్యకు పురికొల్పింది. 1972లో సిమ్లాలో జరిగిన ద్వైపాక్షిక ఒప్పందానికి దారివేసింది.

**భద్రతా మండలి ఈ తీర్మానాలను చేసింది:**

12. 4 సెప్టెంబర్ 1965(ఎస్/6661)తక్షణ కాల్పుల విరమణ

13. 6 సెప్టెంబర్ 1965 తక్షణ ఘర్షణల విరమణ-ఈ రెండు తీర్మానాలను సెక్రటరీ జనరల్ తక్షణ అమలుకు చర్య తీసుకోవడం.

14. 20 సెప్టెంబర్ 1965(ఎస్/ఆర్‌సిఎస్/211(1965) చాప్టర్–VII కింద తక్షణ కాల్పుల విరమణ జరగాలి. 5 ఆగస్టు 1965లోగా యధాతథస్థితి నెలకొనాలి. ప్యారాగ్రాఫ్ '4' ప్రకారం కౌన్సిల్ తీర్మానం–210 ప్యారాగ్రాఫ్ 1(6 సెప్టెంబర్) కార్యరూపం దాల్చి ప్రస్తుత ఘర్షణకు కారణమైన వాటికి తగిన నివారణ అడుగులు వేయాలి. అదే సమయంలో చార్టరులో సూచించిన 33 ప్రకరణం ప్రకారం సాధ్యమైనన్ని 'శాంతి' పునరుద్ధరణ కార్యక్రమాలను ఇరుదేశాలు చేపట్టాలి. అలాగే ఈ విషయంలో సెక్రటరీ జనరల్ తన చొరవతో ఈ తీర్మానాలు కార్యరూపం దాల్చి సమస్య పరిష్కారం అయ్యేట్లు కోరడమైనది.

15. 27 సెప్టెంబర్ 1965,

16. నవంబర్ 5, 1965 ఇరువైపులా కాల్పుల విరమణ ఉల్లంఘనలు. వీటినే 10 జనవరి 1966న 'తాష్కెంట్'లో జరిగిన డిక్లరేషన్ అధిగమించింది.

యాభై సంవత్సరాల నుంచి ఒకరికొకరు సవాలుగా సాగిన ఆట ఇరుదేశాల అణుపరీక్షలనంతరం భద్రతామండలి తీర్మానం 1172 డి–6 జూన్ 1998తో ముగిసింది. '5'వ ప్యారా ప్రకారం "కశ్మీర్ సమస్య"తో బాటు ఇతరేతర సమస్యలనన్నింటిని సామరస్య పూర్వకంగా పరిష్కరించుకొని ఎలాంటి ఒత్తిళ్లు తలెత్తకుండా చూసుకోవాలని ఇరుదేశాలకు విన్నవిస్తుంది. ప్యారాగ్రాఫ్ '15 ప్రకారం' ప్రస్తుతం ఇరుదేశాలు తీసుకున్న నిర్ణయాలను రక్షణకు భద్రతామండలికి పంపుమని సెక్రటరీ జనరల్‌ను కోరినది. అతని పూర్వ అనుచరుని(1965) వలె ఇతనూ ఖాతరు చేయలేదు. మరి భద్రతామండలి 16 తీర్మానాలు, 'యునిసెఫ్' రెండు తీర్మానాలు ఏమి సాధించినట్లు? ఈ రెండు తీర్మానాలు కూడా పాత 'ఐరాస' తీర్మానాలను స్పృశించకుండా కేవలం రాజకీయ సమస్యను ఇరుపక్షాలు సంప్రదింపుల ద్వారా పరిష్కరించుకోమన్నాయి.

అందుకొరకే 'సిమ్లా' చర్చల సందర్భంగా 1964లో వాళ్ల జాతీయ అసెంబ్లీ భద్రతా మండలికి ప్రతిపాదించిన విషయాలను జ్ఞప్తికి తెచ్చాడు. ఆ విషయంలో తాను ఏ మాత్రం భయపడాల్సిన అవసరం లేదని ఇందిరాగాంధీ అన్నారు. ఐదుగురు శాశ్వత సభ్యుల్లో ఏ ఒక్కరూ 1964, 1965 నాటి 'ఐరాస' తీర్మానాలను పట్టించుకోలేదు.

కశ్మీర్ భవిష్యత్ అస్తిత్వం పాక్‌తో సంబంధించినంవి అనేదాన్ని భారత్ నిరాకరించలేదు. అలాగే కశ్మీర్ ప్రజల అంగీకారం లేకుండా కశ్మీర్ సమస్య అస్థిత్వాన్ని కాదనలేదు. ఏ ఒప్పందమైనా మూడు 'వాస్తవాల' పరిగణలో వుంటుంది. భారత్‌లో కశ్మీర్ విలీనం విషయం, పాకిస్తాన్ నియంత్రణ రేఖ అంతర్జాతీయ సరిహద్దుగా పరిగణించడం, కశ్మీర్ స్వయం పాలన. వీటన్నింటినీ భారత్ పరిగణలోకి తీసుకోకుండా కశ్మీర్‌ను విలీనం చేసుకోవడం కోసం ప్రయత్నిస్తోంది.

**ఫ్రంట్ లైన్‌లో ప్రచురితమైన ఎ.జి.నురాని వ్యాసం నుంచి**

**తెలుగు అనువాదం: ఎనిశెట్టి శంకర్(రచయిత–ఫ్రీలాన్స్ జర్నలిస్టు)**

**<u>రచయితలకు సూచనలు:</u>**

**1. రచనలను పేజీకి ఒకవైపు మాత్రమే అర్థమయ్యేలా రాసి పత్రిక అడ్రస్‌కు ప్రతినెల 15వ తేదీలోగా పంపగలరు.**

**2. డీటీపీ చేయించి పంపేవారు ప్రతినెల 18వ తేదీలోగా ఓపెన్‌ఫైల్‌లో పంపించగలరు.**

**3. చేతి రాతలో పంపే రచనలను స్కాన్ చేసి మెయిల్ ద్వారా కాకుండా పోస్ట్ ద్వారా పంపించగలరు.**

**4. స్మార్ట్‌ఫోన్లలో ఫొటోలు తీసి వాట్సప్ ద్వారా రచనలను పంపించవద్దు.**

**5. ఇతర పత్రికలకు పంపే రచనలను మాకు పంపవద్దు.**

**6. అర్థం కాకుండా, కొట్టివేతలతో ఉండే వ్యాసాలను పత్రిక అంగీకరించదు.**

**7. పరిశోధక రచయితలు పంపే రచనలు కచ్చితంగా తమ ఆమోదపత్రం జతచేసి పంపించగలరు. గతంలో ముద్రించిన వ్యాసాల్లోని పేరాలు ఎత్తి రాసి పంపవద్దు.**

**–సం.**

నడుస్తున్న కాలం

# యురేనియం-ప్రజాభిప్రాయాలు

● గీతాంజలి

(గత సంచిక తరువాయి...)

ఒకసారి ఓపెన్‌కాస్ట్ మైనింగ్‌లు, మరోసారి ప్రత్యేక ఆర్థిక మండళ్లు... ఇంకోసారి టైగర్‌జోన్లు, అభయారణ్యం-ఇప్పుడు యురేనియం తవ్వకాలు అంటూ వేల ఎకరాల మైదాన, అటవీ భూమిని తవ్వాలనుకుంటోంది. అదీ రైతులు, ఆదివాసులు సాగు చేసుకుంటున్న పోడు భూమా? సంవత్సరానికి రెండో, మూడో పంటలు పండిస్తున్న వ్యవసాయ భూమా ఏదీ చూడకుండా అభివృద్ధి పేరుతో పేద దళితుల, ఆదివాసీల భూమే లక్ష్యంగా వారి భూమిని దోచేస్తూ తన ల్యాండ్ బ్యాంక్ ఖాతాని పెంచుకుంటూ పోతూనే ఉన్నాడు. భూమి నుంచి, ఇంటి నుంచి, ఊరి నుంచి బేధఖల్ అయిపోయి నిర్వాసితులుగా, అఖరికి పట్టణాల్లో రోజు కూలీలుగా, క్రాస్‌రోడ్స్‌లో బిచ్చమెత్తే బిచ్చగాళ్లుగా ఆదివాసులు మారిపోతున్నారు.

తెలంగాణ రాష్ట్ర సాధన ముందు కూడా ఇదే పరిస్థితి. నీళ్లు, వనరులు, ఉద్యోగాలు, ఆంధ్రా వలస పాలకుల నుంచి ప్రజలను రక్షించుకోవాలని దశాబ్దాలుగా పోరాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో కూడా వనరుల దోపిడీ యథేచ్ఛగా సాగుతున్నది. కాకపోతే ఇప్పుడు బంగారు తెలంగాణ నినాదంతో గెలిచిన తెలంగాణ రాష్ట్ర సమితి దోచుకుంటున్నది. దోపిడీ చేసే వర్గం, దోపిడీ రూపాలు మారాయంతే.

పాలకవర్గాల, దళారీల, కాంట్రాక్టర్ల చేతుల్లో ఓపెన్‌కాస్ట్ మైనింగ్‌లు కొనసాగుతూనే ఉన్నాయి. ప్రత్యేక ఆర్థిక మండళ్లలో ఫార్మాసూటికల్ కంపెనీలు, రియల్‌ఎస్టేట్ వ్యాపారాలు నిర్విఘ్నంగా కొనసాగుతున్నవి. నేరెళ్లలో ఇసుక మాఫియా ఎప్పటిలాగే వృద్ధి చెందుతున్నది.

దేశవ్యాప్తంగా యురేనియం ఖనిజం కోసం గ్రామాల్లో తవ్వకాలు ప్రజలను, పర్యావరణాన్ని ఫణంగా పెట్టి దశాబ్దాలుగా కొనసాగుతూనే ఉన్నాయి.

ముఖ్యంగా ఇప్పుడు దేశభద్రత, విద్యుదుత్పాదన పేరుతో అభివృద్ధి ముసుగులో యురేనియం తవ్వకాలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు యుసిఐఎల్‌కి పర్మిషన్ ఇచ్చాక గత రెండు దశాబ్దాలుగా తెలంగాణలో మహబూబ్‌నగర్ నుంచి ఆదిలాబాద్ వరకూ పులులను రక్షించే నెపంతో అభయారణ్యం, టైగర్ జోన్లంటూ ప్రజలను మభ్యపెడ్తూ అసలు యురేనియం కోసం సర్వే నిర్వహిస్తున్నది. యుసిఐఎల్ వాళ్లు అక్రమంగా యురేనియం శాంపిల్ కోసం గ్రామాల్లో 100-250 ఫీట్ల లోతుకు తవ్వుతున్న బోర్‌వెల్స్ ప్రత్యక్ష సాక్ష్యాలుగా కనిపిస్తున్నాయి.

1940కి ముందు బ్రిటిష్ పాలనలో చెంచులను, అభివృద్ధి పేరుతో పులులను కాపాడాలని కూడా బ్రిటిష్ ప్రభుత్వం నల్లమల అడవి బయటకు రావడానికి, వచ్చిన తర్వాత అన్ని వసతులు కల్పించి పెట్టినా బయట వాతావరణంలో వారికి పడక చాలామంది చెంచులు చనిపోయారు. వెంటనే బ్రిటిష్ ప్రభుత్వం ఆ ప్రయత్నాన్ని విరమించుకొని మిగిలిన చెంచులను అడవిలోకి పంపింది. కానీ మన దేశ నాయకులు మాత్రం వనరుల దోపిడీ కోసం సామ్రాజ్యవాద దేశాల కంపెనీల లాభాల కోసం దేశ వనరులను వాళ్లకు అప్పచెప్పే ప్రయత్నాలను ఆదివాసీలను నల్లమల నుంచి దండకారణ్యం దాకా చంపి మరీ అప్ప చెప్తున్నారు. అడవి బయట మైదాన ప్రాంతంలో పట్టణాల్లో వారికి జీవనాధారం ఏమీ ఉండదు. ప్రభుత్వం ఇస్తానంటున్న నష్టపరిహారం ఎలాగూ పూర్తిగా ఇవ్వదు. కూలీలుగా మారిపోవాల్సిందే. అదే అడవిలో అయితే అటవీ సంపదే వారిని పోషిస్తుంది. అడవి కన్నతల్లిలా కాపాడుతుంది.

మా బతుకు ఇక్కడ్నే. ఇక్కడ్నించి బయటకు పంపితే చచ్చిపోతాం. ఎలాగూ పోయేదే! ఉంటే యురేనియం ప్రాజెక్టుకు వ్యతిరేకంగా పోరాడి చచ్చిపోతాం కానీ ఇక్కడ్నించి మాత్రం వెళ్లం అని అమ్రాబాద్ మన్ననూర్ మండలంలో ఆరు గ్రామాల ప్రజలు కచ్చితంగా చెప్తున్నారు.

“మొన్నటిదాకా పులులను రక్షించడం కోసం మేం అడవి నించి పోవాలన్నారు. పులులు మాకు చుట్టాలు. వాటిని మేం జంతువులు అనుకోం. పులిని ‘మాట వినని పెద్దకొడుకు’ అంటాం. పులి ఎప్పుడొస్తుంది. ఎటుపోతుందో మాకు బాగా తెలుసు. వాటికి కూడా అడవిలో మా కదలిక బాగా తెలుసు. మా పక్కలకెళ్లే పోతాయి. తప్పితే మమ్ముల్ని ఏమీ అనవు కూడా. అయినా మనుషుల ప్రాణాలు తీసే యురేనియం ఖనిజం, టైగర్




జోన్లు అని పులుల్ని కాపాడుతున్న మంటున్నారు కదా. అడవిలో పులుల్ని ఈ యురేనియం చంపదా?" అని నిలదీస్తున్నారు.

"బంక, అడ్డాకులు, బీడీ ఆకులు, తేనె, ఉసిరికాయలు, రేగుపళ్లు, కుంకుడుకాయలు, చింతపండు, జానపళ్లు, పరికి పళ్లు, జీడి, నేరేడు, మామిడి, జామ, ఇప్పపువ్వు దాకా అడవే మాకు ఇస్తుంది. మందుల చెట్లు కూడా ఎట్లనూ ఉన్నాయి. ఆకులు, వేర్లు, పూలు, పండ్లు, విత్తనాలు, కొమ్మలు, బెరళ్లు అన్నీ చెట్ల మందుల కంపెనీలు, డాక్టర్లకు అమ్ముకుంటాం. చెరువుల్లో చేపలు కూడా పడతాం, అమ్ముతాం. ఇదంతా పోడు వ్యవసాయ చేయని కాలంలో చేసేవాళ్లం. ఇప్పుడు పోడు వ్యవసాయం ఎలాగూ ఉంది. మెట్టపంటలుగా జొన్నలు, కందులు, వరిగలు, సజ్జలు, కొర్రలు, సామలు, ఊదలు వేసుకుంటాం. పశువులు, మేకలు, కోళ్లు, ఆవులు ఎలాగూ ఉంటాయి. పాడి, పాలు, పెరుగు, వెన్న, నెయ్యి అమ్ముతాం. ఎట్లాగో బతికేస్తాం. ఇక్కడే ఉంటే ఈ అడవి ఇచ్చే సంపదతో పాటు మా భూమి మాకుంటుంది కదా" అంటారు వాళ్లు.

నిజమే, మేము మన్ననూరు బస్టాండు చేరుకున్న వెంటనే చెంచుల నుంచి సేకరించిన జానపండ్లు, పరికిపండ్లు చిన్న ఉంగరం వేలంత పొడవున్న డబ్బాలో ఒక డబ్బాకు పది రూపాయల చొప్పున లంబాడావాళ్లు అమ్ముతున్నారు. రోజుకో 300 నుంచి 500 దాకా సంపాదిస్తారట వాళ్లు.

చెంచులు సేకరించే బంకకు అంతర్జాతీయ మార్కెట్‌లో మంచి గిరాకీ ఉంది. బంక లేక జిగురు ఇచ్చే చెట్లు చాలా రకాలుంటాయి. కరయా బంక లేదా తెల్లబంక ఇచ్చే తప్సిచెట్లు ప్రసిద్ధి చెందినవి. చెంచులు ఆహారణ సేకరణ, పూలు, పండ్లు విస్తరాకులు, బీడీ ఆకులు, ఇప్పపువ్వు మొదలైన చిన్న చిన్న వ్యాపారాల స్థాయి నుంచి బంక సేకరించి అమ్మడంతో అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లారు. దళారీల వలన దెబ్బతిన్నా ఎంతో కొంత సంపాదిస్తూ వస్తున్నారు. ఈ బంక ఇచ్చే తాప్సీ చెట్లను చెంచు కుటుంబాలు పెంచుకుంటాయి. ఒక్కో కుటుంబానికి ఇరవై చొప్పున కొన్ని వందల చెట్లు చెంచు కుటుంబాలకుంటాయి. బంక ఆదాయం, మార్కెట్ డిమాండ్ పెరగడంతో భూమి లాగా ఇల్లు లాగా బంక చెట్లు కూడా కుటుంబ ఆస్తిగా మారిపోయాయి. చెట్ల నుంచి బంకను ఒక రోజంతా తిరిగి సేకరిస్తే 1-2 కిలోలు వస్తుంది. ఒక కేజీ బంక 40 రూపాయల నుంచి 110 రూపాయలకు పెరిగింది. ఇప్పటికే అభయారణ్యం, టైగర్‌జోన్ల పేరుతో చెంచుల భూముల్ని, పాకల్ని ఫారెస్ట్ డిపార్టుమెంటు వాళ్లు పీకేస్తే చెంచులు అడవిలోనే పాకలు వేసుకొని ఈ అటవీ వనరుల మీద బతుకు వెళ్లదీస్తున్నారు. కానీ అడవిని వదిలి వెళ్లడంలేదు. టైగర్ జోన్ తర్వాత ఇప్పుడు ఊర్లకూర్లను తీసేసే యురేనియం ప్రాజెక్టు వచ్చిపడింది.

నల్లమలలో దాదాడు 21,500ల ఎకరాలు అంటే 83 చదరపు కిలోమీటర్లు. ఈ యురేనియం ప్రాజెక్టుల కోసం 4000 లోతు వరకు బోర్లు వేసి అణుశక్తి కోసం కావల్సిన యురేనియం ఖనిజాలను వెలికితీయడానికి కేంద్ర అణుశక్తి సంస్థకి రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చేసింది. తవ్వకాలు మొదలుపెట్టడానికి ప్రయత్నిస్తున్నారు. గ్రామసభలు నిర్వహించకుండానే అర్ధరాత్రి దొంగల్లాగ చెంచు పెంటల్లో తవ్వకాలు కొనసాగిస్తున్నది

యూసీఐఎల్ సంస్థ. తవ్వకాలు ఎందుకు అన్న విషయంలో గ్రామస్థులకు కనీస సమాచారం ఇవ్వటం లేదు. ఫ్యాక్టరీలొస్తాయ్ ఇంటికో ఉద్యోగం(ఫ్యాక్టరీలో), లక్షల రూపాయల నష్టపరిహారం ఇస్తాం అంటున్నారు. తప్పితే యురేనియం తవ్వకాల వలన వచ్చే పర్యావరణ కాలుష్యం, మనుషులకు, పశుపక్ష్యాదులకు వంధ్యత్వం, చర్మవ్యాధులు, కాన్సర్ లాంటి ప్రాణాంతక వ్యాధులు వచ్చి చనిపోతారని ఎవరూ చెప్పడం లేదు. ఊరు లేపాస్తారంట. ప్రాజెక్టు కడితే ఊరెందుకు లేపాలి అని గ్రామస్థులు ఆందోళన పడుతున్నారు.

అడవినీ, పర్యావరణాన్ని, జంతువుల్ని, అడవిలో బతికే చెంచుల్ని కాపాడాల్సిన పర్యావరణ, అటవీ శాఖలు అడవి మొత్తాన్ని కంపెనీల చేతుల్లో దోచిపెట్టే దళారీల్లాగా తయారయ్యి అమాయక ఆదివాసీలకు ప్రాజెక్టుల గురించి, ఉద్యోగాలు, నష్టపరిహారం గురించి తప్పుడు సమాచారం అందిస్తూ మోసపుచ్చుతున్నాయి. పదిలక్షల నష్టపరిహారం ఇస్తామని నాలుగు సంవత్సరాల(2014) క్రితం వందల అప్లికేషన్లు తీసుకున్నారు. అప్పుడు 2005-06 సంవత్సరంలో ఒక ఎన్జీవో సంస్థ మమ్మల్ని మభ్యపెట్టింది. ప్రభుత్వానికి అనుకూలంగా పనిచేసింది. వజ్రాలున్న అటవీ భూమిని 'డీ బీర్' కంపెనీకి ఇస్తారని తెలిసింది. పులుల సంరక్షణ ఒట్టి నాటకమని తేలింది. దీన్ని వ్యతిరేకిస్తూ స్థానిక ప్రజలు వటవర్లపల్లి నుంచి సార్లపల్లి వరకు ఆదివాసీ ఐక్యవేదిక ఇతర ప్రజాసంఘాలతో కలిసి ధర్నాలు, రాస్తారోకోలు చేసారు. ఫారెస్టు డిపార్టుమెంట్ వాళ్లు అడ్డుకున్నారు. పోలీసులు లాఠీచార్జీ చేసారు. కానీ డీబీర్ సంస్థ తవ్వకాల నుంచి 3 సంవత్సరాలు వెనక్కి తగ్గింది. కానీ ఇప్పుడు వజ్రాల మాట పక్కకుపెట్టి నేరుగా యురేనియం అనే మళ్లీ వచ్చింది అడవిలోకి, ఆదివాసీల జీవితాల్లోకి. యురేనియం తవ్వకాలు-నష్టాల గురించి ఎవ్వరికేమీ సమాచారం లేదు. అంతా అయోమయంగా ఉన్నది. ఇప్పటికే 4 మండలాలు అమ్రాబాద్, సవర్ల, ఉడిమిల్ల, అచ్చంపల్లె మండలాల్లో డ్రిల్లింగ్ చేస్తూ సర్వేలు కొనసాగిస్తున్నారు. తిరుమలాపూర్‌లో ఐదేళ్ల క్రితమే 1050 అడుగులు తవ్వి ల్యాబ్ టెస్ట్‌కి పంపారు. చెంచు పెంటల్లో తమ జీవితాల్లో ఏం జరుగుతున్నదో తెలియదు. బంక, చింత, కుంకుడు కాయలు, జానపళ్లు, పరికిపళ్లు, తేనె అమ్ము కుంటూనే భయం భయంగా ఈ డ్రిల్లింగ్‌ల వైపు చూస్తున్నారు. ఎక్కడికక్కడ ధర్నాలు చేస్తూనే ఉన్నారు. టీఆర్ఎస్ ఎమ్మెల్యే మాత్రం బోల్డెంత భద్రత ఇస్తామని అంటున్నాడు.

2008 నుంచీ అయితే హెలికాప్టర్‌ల ద్వారా కూడా సర్వేలు చేయడం మొదలెట్టారు. 2014లో జీవో వచ్చాక 2000 చదరపు కిలోమీటర్లపైన టైగర్ జోన్‌లో వచ్చిన చెంచుపెంటలు, గ్రామాలు స్వాధీనం చేస్కొని కొద్ది ఖజానాను బయటకు పంపారు.

జిల్లా కలెక్టరు కూడా ఏం జరుగుతుందో ప్రజలకు తెలియనివ్వకుండా మభ్యపెడుతున్నట్లు తెలిసింది. గ్రామసభకు విలువలేదు. 5వ షెడ్యూల్ జోన్‌లోకి రావడానికి ప్రభుత్వం కూడా సభ అనుమతి తీసుకోవాలి. రాష్ట్ర ప్రభుత్వం అటవీ అధికారాలు డీబీర్ లాంటి సంస్థలకు యూసీఐఎల్‌ను ఎందుకు అనుమతి ఇవ్వాలి? ఫారెస్టు డిపార్ట్‌మెంటు ఆదివాసీల కోసం పనిచెయ్యడం లేదు. డబ్బుకు అమ్ముడు పోయిందని స్థానికులు అంటున్నారు.

అసలు ఒకపక్క ఆదివాసీలను అడవి నించి వెళ్లగొడ్తూ వాళ్ల బతుకులను ఆగం చేస్తూ 28 జూలై, 2019న టైగర్ దినంగా ఎందుకు జరుపుతున్నాయి. ఆగస్ట్ 9న ఆదివాసీ ప్రపంచ దినోత్సవం జరపడం హాస్యాస్పదంగానే అనిపిస్తుంది. గుబులుగా ఉన్న హృదయాలతోనే ఆగస్ట్ 9న అమ్రాబాద్ చెంచులు ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహించుకున్నారు. "అసలు ప్రభుత్వం ఎందుకు చెయ్యాలి. చెంచులమైన మేం ఇప్పుడుల కాలంలో టైగర్‌డేని చేస్కుంటాం. ప్రభుత్వం దీన్ని డిక్లేర్ చేయాలని" అంటున్నారు ఆదివాసీలు.

"సంపదను మేం అనుభవిస్తున్నాం, రక్షిస్తున్నాం. అడవిలో పులిజాడైనా, పాము కదలిక అయినా మాకు తెల్సినంతగా ఎవరికి తెలుస్తుంది? నీటి చెలమలు, మడుగుల లోతైన అవగాహన మాకే ఉంది. అడవిపై మొత్తం సాధికారత మాదే. అటవీ హక్కుల చట్టమూ అదే చెబుతుంది. అసలు మాకు చెప్పకుండా అడవిలో మీరు ఎందుకు డ్రిల్లింగ్‌లు చేస్తున్నారు. చట్టాలంటే గౌరవం లేదా? ఫారెస్టు అధికారులు డ్రిల్లింగ్ కోసం సంతకాలు ఎందుకు పెడ్తున్నారు. మేం కదా డ్రిల్లింగ్ కావాలా, వద్దా చెప్పాల్సింది?" అంటూ గద్దిస్తున్నారు.

అడవిని కాపాడుతాం అని చెప్తున్నారు. యురేనియం తీస్తే జంతువులు చనిపోతాయని, నీరు-భూమి-గాలి పాడవుతాయని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో వీరంతా ఇతర ప్రజా, ఆదివాసీ, గిరిజన సంఘాలతో కలిసి 130 కిలోమీటర్ల పాదయాత్రలు చేసారు. "టైగర్ జోన్లకు వ్యతిరేకంగా అడవిలో మా పోడు వ్యవసాయాన్ని అడ్డుకున్న వాళ్లు ఈ ప్రమాదకరమైన యురేనియం డ్రిల్లింగ్‌లను అడ్డుకోవట్లేదంటే ప్రభుత్వమే ఈ పని చేయిస్తుందని ప్రభుత్వాలన్నీ ప్రజలకు వ్యతిరేకంగానే ఉంటాయని మాకు యురేనియం వద్దు. బంగారు తెలంగాణలో మేం కూడా భాగమే. మమ్మల్ని జంతువుల్లా చూడకండి. మనుషుల్లా చూడండి" అంటూ సార్లపల్లి, వటవర్లపల్లి, కుడిచింతలపల్లి, చిల్పకుంట, మల్లెలతీర్థం చెంచులు ఆవేశంగా మాట్లాటారు. "పర్యావరణ కమిటీలో

మా స్థానిక ఎంపీ కూడా సభ్యుడు. ఢిల్లీకి యురేనియం వద్దని రాసినా అన్నాడు. కానీ డ్రిల్లింగ్‌కి అనుమతి ఇచ్చాడు. మా పిల్లల ఆరోగ్యాలు ఏం కావాలి?" అని కోపం వ్యక్తం చేస్తూ ఎవరిని నమ్మాలో తెలియడం లేదని చిల్వకుంట చెంచుపెంట నివాసి రమేష్ అన్నాడు.

ఎంపీ ఆ ఫైల్‌పై మొదట సంతకం చేయకుండా ఆపినం. ఆగింది. కానీ మళ్లీ వచ్చారు. అసలు ఏం జరుగుతుందో తెలియట్లేదు. కలెక్టర్ శ్రీదేవి మేడం కూడా మాతో కల్సిన తర్వాత మారిపోయి ఎంతిస్తే అంత తీస్కోని ఎల్లిపోండి అంటున్నది. మేం ఏ దారిలో వెళ్లాలో గైడెన్స్ కావాలని అక్కడ చాలామంది వాపోయారు. ఒకపక్క ఫారెస్టు అధికారుల స్వార్థం వలన చెట్లు కొట్టి కలపను స్మగ్లింగ్ చేయడంతో చెట్లు తగ్గిపోయి బంక ఉత్పత్తీ తగ్గింది. దాంతో తేనెటీగలు తగ్గి తేనె ఉత్పత్తి తగ్గింది. వర్షాలూ తగ్గాయి. ఇప్ప-మొర్రి పలుకులు, కుంకుడు, చింతగింజలు, కరక్కాయలు లాంటివన్నీ తగ్గిపోతూ వస్తున్నాయి. పశుసంపదా తగ్గింది. అయినా చెంచులు అడవిని విడిచి పెట్టాలని అనుకోవట్లేదు.

కొంతమంది పిల్లలు సిటీలో ఇంటర్ కూడా చదువుతున్నారు. అడవిలో అమ్మా, నాన్న కష్టపడి సంపాదిస్తుంటే అందులో చాలామంది ఆడపిల్లలు కూడా ఉన్నారు. "యురేనియం ప్లాంట్ వస్తే మేం నిర్వాసితులమైతే మా పిల్లలను ఎట్లా చదివించు కుంటాం. ఇక్కడైతే మాకు ఇళ్లు కూడా ఉన్నాయి. పట్నంలో ఇల్లెక్కడివి? సంపాదనే లేకపోతే అద్దెలెట్లా కడతాం? మేం పోం. అడవి నుంచి బయటకు పోవడం అంటే చావు తప్ప మరోటి ఉండదు. ప్రభుత్వం మమ్మల్ని చంపాలనుకుంటున్నది." పట్నంలో ఇద్దరు ఆడపిల్లలను చదివిస్తున్న నాయక్ ఆవేదనతో తన బాధను ఆందోళనను పంచుకున్నారు.

"అడవి నుంచి మాకొచ్చే జీవనాధారం గమనించకుండా, 'పెసా' చట్టాన్ని గౌరవించకుండా ప్రభుత్వం యురేనియం ప్రాజెక్టుని తీసుకొచ్చి మా జీవితాలను, ఇక్కడి జీవనవైవిధ్యాన్ని సంస్కృతీ, సంప్రదాయాలనూ తుడిచిపెట్టాలని చూస్తే మేం ఊరుకునేది లేదని దేశీ కంపెనీల కోసం కాదూ. తమ దేశంలోనే భాగమైన తెలంగాణకు ప్రాణం లాంటి నల్లమల అడవిని కాపాడే మా ఆదివాసీల మేలు కోసం పనిచెయ్యాలని చెపుతాం. అప్లికేషన్ పంపుతామని" ఆదివాసీ ఐక్యవేదిక రాష్ట్ర కన్వీనర్ చిగురాల మల్లికార్జున్ అన్నాడు.

జార్ఖండ్ రాష్ట్రం జాదుగూడలో, కడప జిల్లా తుమ్మలపల్లిలో గత పదేళ్ల నుంచీ దాదాపు యురేనియం కాలుష్యంతో ప్రజల్ని పిల్లల్ని హత్యలు చేస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు యూసీఐఎల్ ఇప్పుడు తమ విషపు దృష్టిని అమ్రాబాద్ నల్లమల మీదకు కేవలం యురేనియం కోసమే సారించి, ఆక్రమించి అటవీ భూమి గుండెల్లోకి వందల ఫీట్ల డ్రిల్లింగులు చేపిస్తూ యురేనియం నమూనాలు కేంద్ర అణుఇంధన శక్తి శాఖకి పంపిస్తున్నారు. ప్రభుత్వానికి దళారీ పత్రికల్లా పనిచేస్తున్న కొన్ని పత్రికలు మాత్రం ఈ రోజు 14 జూలై, 2019న మొదటి పేజీల్లో ఎక్కడా కూడా యురేనియం పేరు ప్రస్తావించకుండా తెలంగాణ బంగారం అంటూ పాలమూరు, వనపర్తి, నాగర్ కర్నూల్, గద్వాల, నల్లగొండ, సూర్యాపేట అనే ఆరు జిల్లాల్లో బంగారమూ, వజ్రాల నిక్షేపాలు బయట పెట్టి, వాటిని వెలికి తీయడానికి గనుల శాఖకు అనుమతి ఇచ్చిందని ప్రకటిస్తుంది.

నిజానికి యూసీఐఎల్ ప్రాణాంతక యురేనియం కోసం తవ్వకాలు కొనసాగిస్తున్నది. కానీ ప్రజలను మభ్యపెట్టటానికి ప్రభుత్వం యురేనియం బదులుగా బంగారం, వజ్రాలు, సున్నపురాయి నిక్షేపాల కోసమే తవ్వకాలు అంటున్నది. ప్రజలను తప్పుదోవ పట్టించటానికి ఎంత పెద్ద కుట్ర ఇది?

ఇరవై సంవత్సరాల క్రితం నుంచీ 2014 వరకూ కనీసం 14 సంవత్సరాలుగా టైగర్‌జోన్లు, అభయారణ్యాలు, సున్నపురాయి, వజ్రాల నిక్షేపాలు అంటూ అడవిలోకి రావాలని చూసిన బహుళజాతి కంపెనీలు అప్పటి తెలంగాణ ఉద్యమం, నల్లమలలోని విప్లవోద్యమం బలంగా ఉండడంతో వెనక్కి వెళ్లిపోయాయి. ఈ గనుల తవ్వకాలే కాక ఇప్పుడు కశ్మీర్ 370 ఆర్టికల్ రద్దు చేస్తూ కశ్మీర్ ప్రజల స్వయం పాలనాధికారాన్ని తుంగలో తొక్కి ఒక రాజకీయార్థిక లాభం కోసం అక్కడి భూమి, ఆపిల్ తోటల్ని అంబానీలకు కట్టబెట్టాలని బీజేపీ ప్రభుత్వం చూస్తున్నది.

అటవీ హక్కుల చట్టాన్ని, పెసాని, ఐదవ షెడ్యూల్‌ను తొలగించి, నల్లమలను పూర్తిగా ఆక్రమించి అదే అంబానీలకు దారాదత్తం చేయదా? దోపిడీ రాజ్యం ఎంతకైనా తెగిస్తుంది.

బ్రిటీష్ కాలం నాటి యూఏపీఏ చట్టాన్ని ప్రశ్నించే ప్రతి గొంతునూ నొక్కేసి, జైలులో నిర్బంధించే చట్టాన్ని ప్రజాస్వామ్య దేశంలో అమలు చేస్తున్నారు. 20 శాతంగా ఉన్న పెట్టుబడి దారుల్ని తప్ప, 80శాతంగా ఉన్న దేశ పౌరుల్ని యూఏపీఏ కింద అరెస్టు చేయవచ్చని బీజేపీ అనుకుంటున్నది. యురేనియం హైదరాబాద్‌లో ఉండే బంజారాహిల్స్ భూమిలో ఉన్నట్లుగా తేలింది. ఇక్కడ తవ్వకాలు ప్రభుత్వాలు చేపడుతాయా? చూడాలి.

T

# దూకుడుగా ఫాసిజం-స్తబ్ధంగా ప్రజాస్వామ్యం

ఎ.నర్సింహ్మారెడ్డి


అడాల్ఫ్ హిట్లర్ నాయకత్వంలో జర్మనీలో 1933 నుంచి 1949 వరకు సాగిన నాజీ పాలనను తలపిస్తూ ఇవాళ కేంద్రంలో నరేంద్ర మోడీ–అమిత్‌షాల పాలన సాగుతున్నది. ఈ విద్వేష నియంతృత్వ పాలన అధికార పగ్గాలు చేపట్టి మూడు మాసాలే గడిచింది. ఈ స్వల్ప కాలంలోనే ముస్లింలు, దళితులు, మహిళలు, భిన్నాభిప్రాయం కలిగి ఉన్నవారిపై అసహనం, దాడులు పెరిగిపోయాయి. బహుళత్వానికి, వైవిధ్యానికి చిహ్నమైన మన సమాజం మొత్తాన్ని మోడీ పాలన ఆందోళనకు గురి చేస్తున్నది. ఈ మూడు మాసాలలో జరిగిన ఘటనలు, మొదటి పార్లమెంట్ సమావేశాలలోనే దాదాపు 20పైగా చట్టాలకు సవరణలు తెచ్చింది. అంటే ఈ నిరంకుశ ప్రభుత్వ రాజకీయ రథం పాలనా విధానాలను, చట్టాలను మార్చి తన భావజాలాన్ని సమాజం మీద బలవంతంగా రుద్ది, ఆ భావజాలానికి భిన్నమైన ఆలోచనలు ఉన్న వారందరినీ ఉక్కుపాదంతో అణచివేయడానికి, వేధించడానికి మార్గాలు సిద్ధం చేసుకుంటున్నట్లు స్పష్టంగా కనబడుతున్నది.

**ప్రభుత్వ నిరంకుశ అధికారాలు :**

సమాచార హక్కు చట్టానికి సవరణలు, జాతీయ మానవ హక్కుల కమిషన్ సవరణలు, నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ చట్టానికి సవరణలు, అన్‌లాఫుల్ ఆక్టివిటీస్ ప్రివెన్షన్ చట్టానికి సవరణలు, ట్రిపుల్ తలాక్ చట్టం వంటివి నేరుగా కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జరిగిన సవరణలు ఆందోళన కలిగిస్తున్నాయి. అవన్నీ రాజ్యాంగ ఆదర్శాలకు, ప్రాథమిక హక్కులకు, చట్టబద్ధ పాలనకు, సామాజిక న్యాయభావనకు తూట్లు పొడిచేవే. బిజెపి రెండోసారి గెలిచాక ప్రజాస్వామిక హక్కులపై దాడిని వేగవంతం చేసింది. అందులో భాగంగా సమాచార హక్కు చట్టానికి సవరణ చేసింది. ఇప్పటి వరకు కేంద్ర, రాష్ట్ర సమాచార కమీషనర్, సభ్యుల కాల పరిమితి ఐదేళ్లుగా ఉండేది. దాన్ని సవరించి ఐదేళ్ల గడువును ఎత్తేశారు. ప్రభుత్వం ఎప్పుడనుకుంటే అప్పుడు వారిని మార్చొచ్చు. అందులో పని చేసే అధికారుల జీతభత్యాలు ఎన్నికల కమిషన్‌తో సమానంగా ఉండేవి. దాన్ని సవరించి వీరికి విడిగా జీతభత్యాలను ప్రవేశపెట్టింది. దాన్ని కేంద్ర ప్రభుత్వమే నిర్ణయిస్తుంది. ఎన్నికల కమిషన్‌తో సమానంగా ఉన్న హోదాను రద్దు చేసింది. తద్వారా వారి భవిష్యత్తును తమ చేతుల్లోకి తీసుకుంది. ఈ విధంగా 'సమాచార కమిషన్' రెక్కలు కత్తిరించి తమ పంజరంలో బందీగా మార్చేసింది.

అలాగే 1967 నాటి చట్ట విరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టానికి సవరణలు చేసింది. ఈ బిల్లు ప్రకారం ఇక నుంచి సంస్థలనే కాకుండా వ్యక్తులను కూడా ఉగ్రవాదులుగా ముద్ర వేసి వారిపై తగు చర్యలు తీసుకొనే అధికారం కేంద్ర ప్రభుత్వానికి కలుగుతుంది. ఏ వ్యక్తినైనా ఉగ్రవాదిగా పరిగణించే అధికారం ప్రభుత్వం సంక్రమింప చేసుకోవడం దేశ ప్రజల వ్యక్తి స్వేచ్ఛను తీవ్రంగా హరిస్తుందనే భయం సహజంగానే వ్యక్తమవుతున్నది. చట్టవ్యతిరేక కార్యలకలాపాల నిరోధక చట్టం (ఉపా) క్రొత్త కత్తులు ఒరలో దోపుకుంటూ ముందు కొచ్చింది. ఈ దేశంలో ప్రజాస్వామ్యం నాలుగు కాలాలపాటు నిలవాలనుకున్న వారంతా వ్యతిరేకిస్తున్నారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారికంటే, ప్రధానంగా తమకు నచ్చని సిద్ధాంతాలున్న వారినీ, ప్రజాక్షేత్రంలో పనిచేస్తున్న వారినీ ఉగ్రవాదుల పేరిట జైళ్ళలోకి నెట్టేందుకు ఈ సవరణలు తెచ్చారన్నది యదార్థం. పాలక పీఠాల్లో ఉన్నవారి సిద్ధాంతాలకు, ఆశయాలకు విరుద్ధమైన భావజాలం గల పౌరులను శిక్షించడానికి దీనిని దుర్వినియోగపరిచే ప్రమాదం లేకపోలేదు.

'ఉపా' దుర్వినియోగాన్ని చూస్తూనే ఉన్నాం. చార్జిషీటు దాఖలు చేయడానికి కూడా పోలీసులకు ఆర్నెల్ల గడువిస్తూ, తాము అమాయకులమని నిరూపించుకోవలసిన బాధ్యత అరెస్టయిన వారిమీదకే నెడుతూ, బెయిల్ దొరకడాన్ని అసాధ్యం చేయడంతో వేలాదిమంది ఏళ్ళ తరబడి కోర్టుల చుట్టూ తిరుగుతూ కారాగారాల్లో మగ్గుతూ, దశాబ్దాల తరువాత నిర్దోషులుగా బయటకొస్తుంటారు. ఎన్‌సిఆర్‌బి డేటా ప్రకారం న్యాయ స్థానాల్లో విచారణ పూర్తి చేసుకున్న ఉపా కేసుల్లో 75 శాతం వీగిపోతున్నాయి. ఉగ్రవాద చర్యలకు విస్తృతార్థాన్నిస్తూ పాలకులు సవరణలు చేస్తూపోవడం, తత్ఫలితంగా




మరింతమంది హక్కుల కార్యకర్తలు, ఆందోళనకారులు, నిరసనకారుల కేసులు నమోదుకావడం చూస్తున్నదే.

నేరం చేసిన వారిని శిక్షించడం కన్నా, పాలకులకు ఇబ్బందికరంగా పరిణమించినవారిని జైళ్ళలోకి తోసేందుకు ఉపకరిస్తున్న ఉపా, ఇప్పుడు వ్యక్తి కేంద్రంగా కొత్త కోరలతో ముందుకొచ్చినప్పుడు మరింత భయం కలగడం సహజం. ప్రజల హక్కులు, సమస్యలపై మాట్లాడేవారన్నా, ప్రజాజీవితంలో ఉన్న సామాజిక కార్యకర్తలు, సంస్థలన్నా ప్రస్తుత పాలకులకు మా చెడ్డ కోపం. ఇప్పటి వరకూ 'ఉగ్రవాది' ముద్రలేకుండానే ఈ చట్టాన్ని అడ్డుపెట్టుకొని అనేకులను వేధిస్తున్న స్థితిలో, కొత్తగా ఆ పదాన్ని చేర్చడం వెనుక లక్ష్యం ఎదుటివారి క్రియాశీలతను దెబ్బతీసి వారిని సామాజికంగా శిక్షించడమే. ప్రభుత్వ విధానాలను, వైఖరులను విమర్శించేవారికి కొత్త కొత్త పేర్లు పెడుతూ, వ్యక్తిత్వానికి చంపడానికి పాల్పడుతున్నారు. తమను ప్రశ్నించేవారు లేకుండా చేయడానికి, అసమ్మతిని అణిచి వేయడానికీ పాలకులు తెగ కష్టపడుతున్నారు.

ప్రజాస్వామ్య చైతన్యంతో ప్రశ్నించడాన్ని మన రాజ్యాంగం పూర్తిగా అనుమతిస్తుంది. ప్రశ్న నిరంకుశాధికారాన్ని నిలదీసి ప్రజాస్వామ్యం పాలనను మెరుగుపరుస్తుంది. ప్రభుత్వాలు ప్రజలకు జవాబుదారీగా ఉండేలా చేస్తుంది. సామాజిక ఆర్థిక న్యాయం సాధించే లక్ష్యంతో పని చేస్తున్న వారిని పట్టణ నక్సలైట్లుగా ముద్ర వేయడం సమంజసం కాబోదు. ఇది చివరికి దేశంలో ప్రశ్నించే ప్రతి గొంతునూ అణచివేసేందుకు దోహదం చేస్తుంది. వ్యక్తి స్వేచ్ఛను పూర్తిగా హరిస్తుంది. భిన్న సిద్ధాంతాలు, ఆశయాలు, ఆలోచనలు శాంతియుతంగా ఘర్షించే వేదికగా ప్రజాస్వామ్యం వర్ధిల్లవలసిన చోట ఇటువంటి అధికారం నిరంకుశ ఆయుధంగానే దుర్వినియోగపడుతుంది. కొండ నాలుకకు మందు వేస్తే ఉన్న నాలుకను ఊడబెరికినట్టవుతుంది. ఉగ్రవాదాన్ని మట్టుబెట్టడం మాట అటుంచి ప్రజాస్వామిక స్వేచ్ఛల మూలాలకు ముప్పు కలుగుతుంది.

అలాగే ఇంతకాలం ఎంతో కొంత, ఎప్పుడో ఒకప్పుడు స్వతంత్రంగా పనిచేసే అవకాశం ఉన్న జాతీయ మానవ హక్కుల సంఘం, రాష్ట్ర మానవ హక్కుల సంఘాల విధివిధానాలను మారుస్తూ, అంటే వాటిని బలహీనపరుస్తూ కేంద్ర ప్రభుత్వం మరొక చట్టం తీసుకువచ్చింది. నేషనల్ ఇన్వెస్టిగేటింగ్ ఏజెన్సీ కోరలు పదును పెడుతూ, దాన్ని బలోపేతం చేస్తూ ప్రజల మీద, భిన్నాభిప్రాయాలు ఉన్నవారి మీద, ప్రతిపక్ష పార్టీల మీద

విరుచుకుపడడానికి, తప్పుడు కేసుల్లో ఇరికించడానికి, అక్రమంగా నిర్బంధించడానికి, శిక్షలు విధింపజేయడానికి ప్రభుత్వం మరొక చట్ట సవరణను ప్రవేశపెట్టింది. వ్యక్తులను 'ఉగ్రవాదులు'గా ముద్రవేసేందుకు జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ)కు చట్టసవరణ తెచ్చారు. ఇది అత్యంత ప్రమాదకరం. ఈ బిల్లులన్నీ వివిధ వ్యవస్థల, తరగతులపై ఎక్కుపెట్టినవే. దశాబ్దాల పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కులను, సదుపాయాలను ఒక్క దెబ్బతో లాగివేసేవే. ఇవన్నీ కార్మికులు, కర్షకులు, మహిళలు, ఉద్యోగులు, దళితులు, మైనారిటీలు ఆదివాసులు, మేధావులు ప్రగతిశీలవాదుల భావ వ్యక్తీకరణ గొంతునొక్కే చర్య.

లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు అత్యధిక మెజారిటీతో బిజెపిని గెలిపించారంటే అందుకనుగుణంగా ప్రజానుకూలమైన పాలన సాగించాలని ఇచ్చిన తీర్పుగా భావించాలి తప్ప, పార్లమెంటులో మెజారిటీ వుందన్న అహంకారంతో చర్చలే లేకుండా చట్టాలు తీసుకురావటం, చట్టాలకు సవరణలు తీసుకురావటం దేనికి సంకేతం? అసహన దాడులు, హక్కులను హరించే ధోరణులు, దోపిడీకి సోపానాలు వేసే శాసనాలు, రాజ్యాంగ వ్యవస్థలను నిర్వీర్యం చేసే పద్ధతులు, పౌర ప్రజాతంత్ర హక్కులను హరించే ధోరణులు వెరసి మనిషి స్వేచ్ఛను శృంఖలావృతం చేస్తున్న సన్నివేశం ఆందోళనకరమైంది.

అంతకన్న ఘోరంగా, చట్టవ్యతిరేక కార్యకలాపాల (నిరోధ) చట్టంలో అన్యాయమైన సవరణలు ప్రవేశపెట్టి నెగ్గించుకుంది. ఈ నాలుగు చట్ట సవరణలు అంతిమంగా రాజకీయ ప్రత్యర్థుల మీద, భిన్నాభిప్రాయాలు ప్రకటించేవారి మీద, సంఘ్ పరివార్ వ్యతిరేకుల మీద కక్ష సాధింపుకూ, వేధింపుకూ మాత్రమే ఉపయోగిస్తారనడంలో సందేహం లేదు. పారదర్శకపాలనకు దోహదం చేసే సమాచార హక్కు చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు దానికి సవరణను లోక్‌సభలో ఆమోదింప చేశారు. కార్మికులు ఎన్నో పోరాటాల ద్వారా సాధించుకున్న 44 కార్మిక చట్టాలను '4 కోడ్'లుగా కుదించి యాజమాన్యాల ఇష్టానికి వదిలేసేలా ఉన్నాయి.

ఇటువంటి "చట్టబద్ధమని" అనిపించే చట్టాలను మార్చే, ఏమార్చే చర్యలు ఒకవైపు జరుగుతుండగానే, దేశవ్యాప్తంగా చట్టవ్యతిరేక, దుర్మార్గ, దౌర్జన్య చర్యలు పెచ్చుమీరుతున్నాయి. ఆదివాసుల భూమి ఆక్రమించి, వారిని వెళ్లగొట్టడానికి కాల్పులు జరిపేదాకా భూస్వాములు తెగబడుతున్నారు. వచ్చినది తమ ప్రభుత్వమే గనుక తమ హంతక చర్యలకు అనుమతి దొరికినట్టేనని భావిస్తున్న సంఘ పరివార్ శక్తులు, వారి ఆశ్రితులు దేశ వ్యాప్తంగా జైశ్రీరాం అని నినదించమని ఇతరులను హింసిస్తున్న ఘటనలు పెరిగిపోయాయి. ఇటువంటి మూక హత్యలు సమాజానికీ, భవిష్యత్తుకూ మంచివి కావని, వీటిని ఆపడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సమాజ భవిష్యత్తు మీద ప్రేమ ఉన్న మేధావులు, ప్రజాస్వామికవాదులు ప్రభుత్వానికి లేఖ రాస్తే, వారి మీద వేధింపులు, దుర్భాషలు, వారిని చంపుతామని బెదిరింపులు సాగుతున్నాయి.

## నియంతృత్వ పోకడలు–అప్రజాస్వామిక పద్ధతులు :

భారతదేశ చరిత్రను తిరగరాసి, దేశాన్ని మధ్యయుగ కాలం నాటికి తీసుకువెళ్లేందుకు కేంద్ర బిజెపి ప్రభుత్వం ముమ్మర ప్రయత్నాలు చేస్తోంది. మతోన్మాద ఆరెస్సెస్ నేతృత్వంలోని కేంద్ర సర్కారు ద్వారా తన రహస్య అజెండాను ముందుకు తీసుకువెళ్లి అమలు చేసేందుకు పావులు కదుపుతున్నది. తాము చెప్పేదే నిజమైన జాతీయతవాదమని దేశంలోని మెజారిటీ వర్గ ప్రజలను నమ్మించి దేశంలో హిందూరాజ్య స్థాపనకు కుట్ర పన్నుతోంది. ఇది భారతదేశ విలక్షణమయిన 'భిన్నత్వంలో ఏకత్వానికే' అత్యంత ప్రమాదకరమైన భావన. భారత రాజ్యాంగం ప్రసాదించిన ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాలకే 'గొడ్డలిపెట్టు' వంటిదనడం అతిశయోక్తి కాబోదు. 'మందబలం' నియంతృత్వానికి దారితీస్తుందన్న వాస్తవాన్ని కేంద్రంలో తిరిగి అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ ప్రభుత్వ చర్యలు చెప్పకనే చెబుతున్నాయి.

దేశ సర్వోన్నత న్యాయస్థానం హెచ్చరికలను కూడా బేఖాతరు చేసి 'గోమాతే దేశ భవిష్యత్తు' అని చిత్రీకరించేందుకు సంఘ్‌పరివార్ అనుబంధ సంస్థలు ప్రయత్నిస్తూ మైనారిటీ వర్గాలను భయభ్రాంతులకు గురిచేస్తూ భౌతిక దాడులకు పాల్పడుతున్నా మోడీ సర్కారు మౌన ప్రేక్షకపాత్ర పోషిస్తున్నదే తప్ప వాటిని నివారించేందుకు ఎట్టి కఠిన చర్యలు తీసుకోకపోవడంతో దాడులకు పాల్పడే గోమూకలకు ప్రభుత్వ ఆశీస్సులున్నట్లు స్పష్టమవుతున్నది. గోమూకల 'భయానక చర్యలను' ఎదుర్కోడానికి ఒక నూతన చట్టాన్ని తీసుకువచ్చే విషయాన్ని పరిశీలించాలని గతవారం సుప్రీంకోర్టు పార్లమెంటుకు సూచించింది. గోమూకల దాడులను అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసినప్పటికీ మోడీ సర్కారుకు చీమకుట్టినట్లు కూడా లేదు. గోమూకల దాడులు దేశ వ్యాప్తంగా

'పెనుతుఫానులాంటి భయానక పరిస్థితులు' సృష్టించవచ్చని సుప్రీంకోర్టు తీవ్రంగా హెచ్చరించింది.

ఎన్నికల ప్రక్రియ పొడవునా తాము గత ఎన్నికలలో చేసిన వాగ్దానాలను నెరవేర్చారో లేదో అన్న ప్రస్తావన రాకుండానే ఎన్‌డిఎ గడిపేసింది. ఎన్‌డిఎ ప్రచారక్రమంలో మునుపు చేసిన వాగ్దానాలు, వాటి అమలు గురించిన ఊసే వినిపించలేదు. ఎన్‌డిఎ చేసిన వాగ్దానాలు నెరవేరిన దాఖలాలే లేవు. ముఖ్యంగా దళితులు, మైనారిటీలు ఎన్‌డిఎ. ఏలు బడిలో సురక్షితంగా ఉన్న ఆనవాళ్లే లేవు. గత అయిదేళ్ల కాలంలో దళితులకు, మైనారిటీలకు సామాజిక భద్రత కల్పించామని, భౌతికంగా రక్షణ కల్పించామని చెప్పుకోవడానికి ఎన్‌డిఎకు అవకాశమే లేదు. ఈ వర్గాలు నిరంతరం తమ మీద దాడులు జరుగుతాయేమో, మూకలు దాడి చేసి హతమారుస్తారేమో అన్న భయంతోనే గడిపాయి. గ్రామీణ ప్రాంతాలలో దుర్భర స్థితిలో ఉన్న రైతులకు, వలస కార్మికులకు ఎలాంటి భరోసా ఇవ్వలేదు. అపారంగా ఉన్న నిరుద్యోగ సేనకు ఉపాధి కల్పించామని చెప్పుకోవడానికి కూడా ఎన్‌డిఎకు అవకాశం లేదు. సామాజిక మాధ్యమాలలో భిన్నాభిప్రాయాలు ఉన్న వారిని వేధించడాన్ని నిరోధించడానికి ఎన్‌డిఎ చేసిందేమీ లేదు. అసమ్మతి వ్యక్తం చేసే వారిని సామాజిక మాధ్యమాలలో విపరీతంగా వేధించారు.

ఒక పథకం ప్రకారంగా, మిగతా పార్టీలవారిని తమలో కలుపుకోవటం, బిజెపియేతర పార్టీల ప్రభుత్వాలను పడగొట్టి, ఇతర పార్టీల ఎమ్ఎల్ఎలను నయానా, భయానా లొంగ దీసుకుని, అవసరమైతే సంతలో పశువుల మాదిరిగా కొనుగోలు చేసే అధికారాన్ని పొందటం సంఘ పరివార శక్తుల మాస్టర్ ప్లాన్. నిన్నటికి నిన్న కర్నాటకలో జరిగిందిదే! అసలు ప్రజాస్వామ్యం అంటే ఏవగించుకునే వారు, ఏ అడ్డదారినైనా తొక్కి, అధికారాన్ని చేజిక్కించుకోవటం, మిగతా పార్టీలను నామ రూపాలు లేకుండా నాశనం చెయ్యటంకోసం వీరి పథక రచన సాగుతున్నది. పారిశ్రామిక వేత్తలకు, బడా కాంట్రాక్టర్లకు బిజెపి అయినా, వైఎస్సార్ కాంగ్రెస్ అయినా, టిఆర్ఎస్ అయినా, టిడిపి అయినా పెద్దగా తేడా కనిపించదు. వారికి కావలసిందల్లా, నల్లేరుమీద నడకలాగా తమ వ్యాపారాలు అభివృద్ధి కావాలి. తాము చేసే అనైతిక వ్యాపార కార్యకలాపాలకు అధికార పార్టీ రక్షణ కావాలి. వారిపై అప్పటికే ఉన్న ఆర్థిక నేరాల కేసులు మాఫీ కావాలి. అందుకోసం, ఏ పార్టీ అధికారంలోకి వస్తే, వారి పంచన చేరుతారు. చేరి తమ పబ్బం గడుపుకుంటారు.

**జర్మనీలో హిట్లర్‌ను పోలిన మోడీ పాలన :**

ఈ బలహీనతను ఉపయోగించుకునే జర్మనీలో హిట్లరు తన అధికారాన్ని పదిలం చేసుకున్నాడు. మన స్వదేశీ కాపీ రాయుళ్ళు ఇదే మార్గాన నడుస్తున్నారు. ఒకసారి రాజకీయంగా తమకు ఎదురులేదనే స్థాయికి చేరిన తరువాత, ఒక్క ఆర్ఎస్ఎస్ తప్ప, మిగతా ఎవరినీ అధికార స్థానాలలో మిగల్చరు. భారతదేశంలోని బూర్జువా పార్టీలు ఈ విషయాన్ని గ్రహించలేకున్నారు. జర్మనీలో కమ్యూనిస్టులతో ప్రారంభించి, సోషల్ డెమోక్రాట్లను, క్రిస్టియన్ డెమోక్రాట్లను ఒకరి తరువాత ఒకరిని జైలు పాలు చేశాడు హిట్లరు. ఇతర మితవాద పార్టీలను తమ నాజీ పార్టీలో విలీనం చేసుకున్నాడు. ఇవాళ భాజపా అదే పని చేస్తోంది.

జర్మనీలో హిట్లరును ఓడించి, జైళ్ళలోని బందీలను విముక్తులను చేస్తోంటే, జైలు గోడలపై వ్రాసిన ఒక ప్రకటన ప్రపంచ ప్రజల దృష్టిని ఆకర్షించింది. అది రాజ్యంతో పోరాడే సంఘాలకు, కార్యకర్తలకు చిరస్మరణీయమే కాదు ఒక గుణ పాఠం కూడా. "వాళ్ళు కమ్యూనిస్టులను నిర్బంధించారు. నేను పట్టించుకోలేదు, ఎందుకంటే నాకు కమ్యూనిస్టులంటే పగ కనుక. వాళ్ళు సోషల్ డెమోక్రాట్లను బంధించారు. నేను పెద్దగా పట్టించుకోలేదు. వాళ్ళు ప్రజాస్వామికవాదులను నిర్బందించారు. అయినా నేను పట్టించుకోలేదు. ఆఖరున వాళ్ళు నన్ను అరెస్టు చేశారు. ఇదేమని అడగటానికి నన్ను పట్టించుకోవడానికి ఎవరూ మిగలలేదు! "చరిత్ర పునరావృతమవుతోంది. తస్మాత్ జాగ్రత్త." అయితే, ఇప్పుడు మోడీ, అమిత్–షాల ద్వయం మిగతా అన్ని పార్టీలను కరిగించివేసి, బీజేపీ తమలో విలీనం చేసుకోగలదేమో కాని, వారికి కొరకరాని కొయ్యిగా చివరి ఉద్యమ కారుని వరకూ ఫాసిజంతో పోరాటం చేస్తాడు.

ఫాసిస్టు పాలనలో రాజ్యం కత్తి మన మీద వేలాడుతూనే ఉంటుంది. దృశ్యాదృశ్యంగా మనం అడిగిన సమాచారం మనకు ఇవ్వకపోవచ్చు. ఏదో ఒకరోజున నువ్వొక ఉగ్రవాదివని ముద్రవేసి కటకటాల పాలుజేయవచ్చు. ఏది స్వేచ్ఛ, ఏది స్వాతంత్ర్యం, ఏది ప్రజాస్వామ్యం అని అడిగినందుకు గొంతు నొక్కవచ్చు. కనీసవేతనం కోసం పోట్లాడే వాళ్ళ తరపున మనం నోరు విప్పం. మన జీతాల గురించీ, ప్రమోషన్ల గురించీ ఎపుడో ఒకసారి చిన్న ధర్నానో, వినతిపత్రమో ఇచ్చినా రాజ్యానికి కంటగింపవుతుంది. ఆఫీసుల్లో పనులు చేయడం లేదనో, బళ్ళల్లో పాఠాలు చెప్పడం లేదనో జనాన్ని ఎగదోస్తారు. సంక్షేమ పథకాలు చూపి ఎంతో చేస్తున్నామని ఊదరగొట్టవచ్చు. అది నిజమని,

తాము కట్టే పన్నులే ఇస్తున్నారని మధ్యతరగతి వాపోవచ్చు. కానీ నెలనెలా ఎదురుచూపుల మధ్య నీరుగారే వ్యథార్థుల సంవేదన ఎవరికీ పట్టదు. ఇలా ఎవరికి వారిని, ఎక్కడికక్కడ విభజించి, వేరుచేసి పెత్తనం చేసే పాలక యంత్రాంగం మీద మనం దృష్టి సారించక తప్పదు.

**జమ్ము-కశ్మీర్‌పై నిరంకుశ పదఘట్టన :**

ప్రధాని నరేంద్రమోడీ, హోంమంత్రి అమిత్‌షా, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ త్రయం ఒక వ్యూహం ప్రకారం జమ్మూ-కశ్మీర్‌ను నిట్టనిలువునా చీల్చింది. రాష్ట్రం స్వయం ప్రతిపత్తిని రద్దు చేసింది. రాజ్యాంగం పూచీపడిన కశ్మీరీయం స్వయంప్రతిపత్తి, ప్రత్యేక హోదా, ప్రత్యేక హక్కులను ఏకపక్షంగా రద్దు చేసింది. పార్లమెంట్ సాక్షిగా ప్రజాస్వామ్యాన్ని పట్టపగలే హత్య చేసింది. ఆగష్టు నాలుగున అర్ధరాత్రే జమ్మూ-కశ్మీర్‌లోని కీలక నేతలను గృహనిర్బంధం చేసి లోయంతా 144వ సెక్షన్ విధించి, ఇంటర్‌నెట్, మొబైల్ సేవలు నిలిపివేసి భీభత్స వాతావరణాన్ని మోడీ సర్కార్ సృష్టించింది. ఆగష్టు ఒకటి నుంచి జమ్మూ-కశ్మీర్‌లో కేంద్రం భారీగా సైనిక బలగాలను మోహరించింది. అర్థాంతరంగా పర్యాటకులను వెనుకకు రప్పించింది. విద్యా సంస్థలను మూసివేసింది. ఇవన్నీ కేంద్రం ఏదో పన్నాగం పన్నిందన్న అనుమానాలు మొదలయ్యాయి.

అంతలోనే ఆగష్టు 4 ఉదయం 370 అధికరణకు కేంద్ర మంత్రి మండలి సూచించడం, వెంటనే రాష్ట్రపతి ఉత్తర్వులిచ్చి గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయడం జరిగింది. అలా రాష్ట్రపతి ఉత్తర్వులిచ్చాడోలేదో క్షణాల్లో హోంమంత్రి షా రాజ్యసభలో 370 రద్దు తీర్మాణం, జమ్మూ-కశ్మీర్ రాష్ట్ర విభజన బిల్లులను ప్రవేశపెట్టారు. ప్రతిపక్షాల ఆందోళన మధ్యనే బిల్లు ఆమోదం పొందింది. దీంతో జమ్మూ-కశ్మీర్ రాష్ట్ర హోదాను కోల్పోయి కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజనను గురయ్యాయి. మరుసటిరోజు ఆ బిల్లులను లోక్‌సభ ఆమోదించింది. ఈ నిర్ణయాన్ని టిఆర్ఎస్, టిడిపి, వైసిపి, జనసేన పార్టీలు సమర్థించడం తెలుగు ప్రజల దౌర్భాగ్యం. మోడీ ప్రభుత్వం తీసుకున్న ఈ దుర్మార్గ చర్యలు కేవలం జమ్మూ-కశ్మీర్‌కే పరిమితం కాదు. దేశ సమైక్యత సమగ్రతలకు ముప్పు. లౌకికత్వానికి, ఫెడరలిజానికి గొడ్డలిపెట్టు భిన్నత్వంలో ఏకత్వానికి విఘాతం. కొన్ని చారిత్రక పరిస్థితుల్లో జమ్మూ-కశ్మీర్‌కు కల్పించిన ప్రత్యేక హక్కులు హరించడం కశ్మీరీలకు ద్రోహం చేయడం తప్ప మరొటి కాదు.

మనదేశంలో ఫాసిజం ముసుగులు తొలుగుతున్న సందర్భం ఇది. పెను సంక్షోభం ముంచుకువస్తున్న కాలమిది. ఎవరు ఏ పక్షమో తేటతెల్లమవుతున్న దృశ్యం ఎల్లెడలా ప్రత్యక్షం అవుతున్నది. కవులు, రచయితలు కూడా మినహాయింపు కాదు. పాలకుల తాయిలాల కోసం కొందరు పొగడ్తల వ్యాసాలు రాయవచ్చు. భజనగీతాల కవిత్వాన్ని సంకలనాలుగా తీసుకురావచ్చు. మంత్రుల అనుంగుచాటున పైరవీలతో ఓ పదవి కోసమో, పురస్కారం కోసమో దేబిరించవచ్చు. అక్షరాల్ని స్తోత్రమాలగా చేసి ఏలినవారి కటాక్షవీక్షణాల కోసం ఎదురు చూడవచ్చు. కానీ ఏదీ నిలకడగా ఉండదు. అసువులు బాసిన అమరుల త్యాగాల ఫలాన్ని యాగాలతో బూడిద చేయవచ్చు. ఇక్కడ ఏమైనా జరగవచ్చు. తెలుసుకోవలసింది ఒక్కటే. మనం ఎటువైపు ఉంటాం ? ఏ పక్షం నిలుస్తాం? గోడమీద పిల్లులుగా ఉండటానికి వీల్లేని సమయమిది. ప్రజల పక్షమో పాలకుల పక్షమో, నీతివైపో అవినీతివైపో ప్రతి ఒక్కరు అటోఇటో తేల్చుకోవల్సిన సందర్భం ఇది.

**ముగింపు :**

దళితులు, మైనారిటీలపై గోమూకల దాడుల సందర్భంగా 'జైశ్రీరామ్' నినాదాన్ని యుద్ధోన్మాదంగా ఉపయోగించటం పట్ల ఆందోళన వ్యక్తం చేస్తూ చిత్ర నిర్మాతలు, దర్శకులతో సహా 49 మంది సాంస్కృతిక క్రియాశీల కార్యకర్తలు ప్రధానమంత్రి నరేంద్రమోడీకి లేఖ రాయడం తాజా పరిణామాలతో సరిపడేదిగా ఉంది. ప్రధానికి రాసిన లేఖపై నృత్యకారిణి సోనాల్ మాన్‌సింగ్, చిత్రనిర్మాతలు మాధుర్ భండార్కర్, వివేక్ అగ్నిహోత్రి, నటి కంగనా రనావత్‌తో సహా 61 మంది మేధావులు, సాంస్కృతిక ప్రముఖులు 'ప్రధానిని అప్రతిష్టపాల్జేసేందుకు లేఖ రాశారని' దేశ విచ్చిన్నానికి సహకరిస్తున్నారని, దేశ ప్రతిష్టకు భంగం కలిగిస్తున్నారని కఠినంగా స్పందించడంతో దేశ ప్రజలు గోమూకల దాడులపై ఐక్యం కాకుండా నివారించడానికి ప్రజా వ్యతిరేక, పాలకుల అడుగులకు మడుగులు వత్తే తొత్తులు ఏ విధంగా ప్రయత్నిస్తున్నారో వారి స్పందన తెలియజేస్తోంది. నూతనంగా ఎన్నికైన ఎంపీలు లోక్‌సభలో ప్రమాణ స్వీకారం సందర్భంగా అసాధారణ రీతిలో "జైశ్రీరామ్" నినాదాలు చేశారు. నూతనంగా ఎంపికైన బిజెపి ఎంపీలు అత్యుత్సాహంగా ఆ విధంగా నినాదాలు యివ్వడమే కాకుండా ఇతరులను ప్రత్యేకించి తృణమూల్ ఎంపీలను గేలిచేయడానికి వారు ఆ నినాదాలు చేశారు. ఇది పార్లమెంటులో దుస్సాంప్రదయానికి నాంది పలకడమే.

ప్రభుత్వం, బీజేపీ, ఆర్ఎస్ఎస్ నాయకులు ప్రతిరోజు ఏదో ఒక చోట దాడులకు తెగబడుతూనే ఉన్నారు. చట్టబద్ధ

పాలనకూ, పౌర ప్రజాతంత్ర హక్కులకు, జీవించే స్వేచ్ఛకు భంగం కల్గిస్తున్నారు. చట్టాలనే తారుమారు చేసి, న్యాయ వ్యవస్థను అధికార దుర్వినియోగంతో ప్రభావితం చేస్తున్నారు. ప్రజాస్వామిక సంప్రదాయాలను తలకిందులు చేస్తున్నారు. రానున్న ఐదేళ్లలో ఎంత అఘాయిత్యం జరుగనుందోనన్న ఆందోళన బుద్ధిజీవుల్లో, ప్రజాస్వామిక లౌకికవాదుల్లో నెలకొంది. ఈ స్థితి ఇట్లాగే కొనసాగితే, కొనసాగనిస్తే ముస్లింలు, దళితులు, ఆదివాసులు, మహిళల మీద మితిమీరిన హింసతో దేశం విస్ఫోటనం వైపు పయనించకతప్పదు. అందువలన ప్రతిపక్ష జాతీయ, ప్రాంతీయ పార్టీలు, కవులు, కళాకారులు, ప్రజాస్వామిక వాదులు, ప్రగతివాదులు, హక్కుల సంఘాల బాధ్యులు విశాల ప్రజా ఐక్య సంఘటనను ఏర్పరచి ప్రతిఘటించాల్సిన చారిత్రక సందర్భం ఇది. ప్రజాస్వామ్య హితైషులు, మేధావులు, ప్రగతిశీల శక్తులు అప్రమత్తులై కాషాయదళ కుటిల యత్నాల ప్రతిఘటనకు సంసిద్ధులు కానట్లయితే భవిష్యత్ ప్రమాద భరితంగా పరిణమించగలదని గ్రహించవలసిన అవసరముంది.

అందువల్లనే ప్రగతిశీల ఉద్యమకారులను రాజకీయంగా అనామకులుగా చేయడానికి బిజెపి కుట్రలు పన్నుతున్నది. కానీ చరిత్రలో ఫాసిజంతో అలుపెరుగని పోరాటం చేసి, అంతిమంగా దానిని ధ్వంసం చేసింది కార్మిక, కర్షక వర్గమేనన్నది మరువకూడదు. హిట్లర్ నిర్బంధ క్యాంపులలో లక్షలాది మంది కమ్యూనిస్టులు చిత్రహింసలు అనుభవించి, ప్రాణాలు కోల్పోయారు. అయినా, రహస్యంగా గెరిల్లా దళాలను తయారుచేసి హిట్లరుపై అత్యంత విపత్కర పరిస్థితుల్లో కూడా పోరాటం కొనసాగించారు. ఇది చారిత్రిక సత్యం. ఇటలీలో ముస్సోలినీ నియంతృత్వానికి వ్యతిరేకంగా కమ్యూనిస్టులు పోరాడారు. అంతిమంగా పరారీలో ఉన్న అతన్ని పట్టుకుని చంపింది ప్రజలే. ప్రపంచంలో దోపిడీ పాలక వర్గాలు ఎప్పుడూ విధ్వంసం చేయడానికి ప్రయత్నిస్తూనే ఉంటారు. అయితే సామాన్య ప్రజానీకాన్ని ఎల్లకాలం ఏమార్చడం పాలకులకు సాధ్యం కాదు.

ప్రజలు వాస్తవాలను గ్రహించి పాలకుల మీద తిరుగుబాటు చేసే చైతన్యం భౌతిక పరిస్థితులే కల్పిస్తాయి. చరిత్రలో ఎప్పుడైనా ఓడిపోయేది పాలకులే, అంతిమ విజేతలు ప్రజలేనన్నది చారిత్రక వాస్తవం. అందువల్ల బ్రాహ్మణీయ హిందూత్వ ఫాసిస్టు మూకలు ఏనాటికైనా ప్రజల చేతుల్లో మట్టి కరువడం అనివార్యం. పీడనకు, దోపిడీకి గురవుతున్న విశాల ప్రజారాసుల ఐక్యత, జరుగుతున్న పరిణామాలను సునిశితంగా పరిశీలించే చైతన్యం, నిరంతర జాగరూకత, ప్రతిఘటించే నిత్యపోరాట స్ఫూర్తి మాత్రమే భారత ప్రజానీకం ముందున్న ఏకైక మార్గం. వీటిని గ్రహించడం, ప్రచారం చేయడం, సంఘటిత పరచడం, ఉద్యమాలను ప్రోత్సహిస్తూ తాము స్వయంగా ఆచరణలోకి రావడం బుద్ధిజీవుల కర్తవ్యం. T


## 'నడుస్తున్న తెలంగాణ'ను ఆర్థికంగా ఆదుకోండి

**నడుస్తున్న తెలంగాణ మీది. మాది. మనందరిది.**
**నొసటి నుంచి రాలిన చెమట చుక్కది. పోరులో చిందిన నెత్తుటి బొట్టుది.**
**అంటరాని వెలివాడది, ఆశయాల బడుగు జీవిది.**
**విద్యార్థులది, అధ్యాపకులది, ఉద్యోగులది,వ్యాపారస్తులది.**
**కనుక ఈ పత్రికను నడపడానికి మీకు తోచిన ఆర్థిక సహాయం చేయండి.**
**పత్రికను పదికాలాలు నిలబెట్టండి**

### నడుస్తున్న తెలంగాణలో మీ ప్రకటనలకై సంప్రదించండి

| | | |
|---|---|---|
| చివరి కవర్ (కలర్‌లో పూర్తి పేజి) | : | రూ. 40,000 |
| రెండవ కవర్ (కలర్‌లో పూర్తి పేజి) | : | రూ. 35,000 |
| మూడవ కవర్ (కలర్‌లో పూర్తి పేజి) | : | రూ. 30,000 |
| పూర్తి పేజి (బ్లాక్ & వైట్) | : | రూ. 25,000 |

# హమాలీలు; అసమాన జీతభత్యాలు

జనార్థన్

దేశంలో మతాల మధ్య, కులాల మధ్య ప్రాంతాల మధ్య, పల్లెలు-పట్టణాలకు మధ్య, స్త్రీ-పురుషులకు మధ్య, దళితులు-దళితేతరులకు మధ్య, ఆదివాసులు-ఆదివాసేతరులకు మధ్య, స్థానికులు-స్థానికేతరులకు మధ్య అనేక విషయాలలో అసమానతలు, వివక్షతలు కొనసాగుతున్నట్లుగానే కార్మిక రంగంలో కూడా అసమానతలు కొనసాగిస్తున్నారు. స్వాతంత్ర్యం, గణతంత్రం, ప్రజాస్వామ్యం పేర్లతో గత 72 ఏండ్లుగా స్వపరిపాలన సాగుతున్నప్పటికీ అసమానతలతో దేశం అగోరిస్తునే వుంది. ఇది రాజ్యాంగానికి, చట్టాలకు, న్యాయానికి వ్యతిరేకమైన పరిస్థితి.

ఈ సందర్భంలో ప్రస్తుతం కార్మికరంగంలో హమాలీ కార్మికుల జీతభత్యాలు, సంక్షేమాల గురించి కొంత తెలుసుకుందాం.

దేశ వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రయివేటు సంస్థల్లో, స్థలాల్లో కోట్లాది మంది హమాలీ కార్మికులు పనిచేస్తున్నారు. ముఖ్యంగా వ్యవసాయ మార్కెట్లు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల గోదాములు, ప్రయివేటు గోదాములు, ట్రాన్స్ పోర్టులు, రైల్వే గుడిసెట్లు, బట్టల మిల్లులు, పత్తి, ఆయిల్, రైస్, దాల్ తదితర మిల్లులు, బజార్లు తదితర అనేక సంస్థల్లో, స్థలాల్లో ఈ హమాలీ కార్మికులు పనిచేస్తున్నారు. ఆయా సంస్థల్లో పని చేస్తున్న ఈ కార్మికుల్లో స్థానికులతో బాటు స్థానికేతరులు ఉంటారు. స్థానికేతరుల్లో ఇతర రాష్ట్రాలకు చెందినవారు కూడా వుంటారు. తెలంగాణలో అయితే బీహార్, బెంగాల్, ఉత్తరప్రదేశ్, ఒరిస్సా, జార్ఖండ్ తదితర రాష్ట్రాలకు చెందిన కార్మికులు పనిచేస్తున్నారు.

ప్రతి మనిషికి కూడు, గూడు, గుడ్డ, నీరు, కరెంటు, విద్య, వైద్యం, వినోదం ఉండాలి. ఈ కనీస అవసరాలు తీరే విధంగా ఆర్థిక ఆదాయ వనరులు ఉండాలి. పేదలకు, ధనికులకు మార్కెట్లు, సరుకుల రేట్లు ఒకేలా ఉంటాయి అనుకున్నప్పుడు జీవితావసరాలు తీర్చుకునే విధంగా సగటు మానవుని కొనుగోలు శక్తి కూడా వుండాలి. ఆయా సంస్థలల్లో హైస్కిల్డ్-స్కిల్డ్-సెమీ స్కిల్డ్-అన్‌స్కిల్డ్ సంస్థ ఏదైనప్పటికి ఒకే రకమైన పనికి ఒకే రకమైన జీత భత్యాలు వుండాలి. హమాలీ కార్మికులు మోసే సరుకులు, బస్తాల బరువులు సరిసమానంగా వుంటున్నప్పుడు వారికి చెల్లించాల్సిన కూలీరేట్లు, జీత భత్యాలు కూడా సరిసమానంగా వుండాలి. సమాన పనులకు సమాన వేతనాలు ఇవ్వాలని సుప్రీంకోర్టు కూడా చెప్పింది. కనీస వేతనాలు అమలు చేయాలనేది చట్టం కూడ వున్నది. కాని పాలకులు, ప్రభుత్వ అధికారులు, ప్రయివేటు యజమానులు న్యాయ విరుద్ధంగా, చట్ట విరుద్ధంగా వ్యవహరిస్తూ కార్మికులను దోపిడీ, పీడనలకు, అసౌకర్యాలకు, అణచివేతలకు గురి చేస్తున్నారు.

ఉదాహరణకు కొన్ని సంస్థల్లో కొన్ని విషయాలు పరిశీలిద్దాం.

**1)FCI (ఫుడ్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా)**

కేంద్ర ప్రభుత్వానికి చెందిన ఈ సంస్థల్లో దేశ వ్యాప్తంగా మూడు రకాల డిపోలు(గోదాములు) వున్నాయి. అవి 1)డైరెక్ట్ పేమెంట్ సిస్టం DPS, 2) నో వర్క్ నో పే, 3) ప్రయివేటు కాంట్రాక్టర్ల ద్వారా నిర్వహించే డిపోలు..

1)డైరెక్ట్ పేమెంట్ సిస్టంకు చెందిన డిపోలు దేశ వ్యాప్తంగా 154 వుండగా ఈ గోదాముల్లో 21,730 మంది హమాలీలు పనిచేస్తున్నారు. డి.పి.ఎస్.లో బ్రోకర్లు, కాంట్రాక్టర్లు లేకుండా ప్రభుత్వమే నేరుగా జీతాలు చెల్లిస్తుంది. ఇందులో పని చేస్తున్న హమాలీ కార్మికుల ఉద్యోగాలకు పర్మినెంటు ఉంటుంది. నెలకు 35000 రూపాయల బేసిక్ జీతంతో బాటు స్థిర కరువు బత్యం, మారకపు కరువు బత్యం, ఇంటి కిరాయి అలవెన్సులు కలిపి నెలకు ఒక్కొక్కరికి 50 వేల రూపాయలకు పైబడి జీతం లభిస్తుంది. రోజులో 100 బస్తాలకు పైబడి మోస్తే బస్తాకు 8 నుండి 9 రూపాయల చొప్పున ఇన్సెంటివ్ లభిస్తుంది. అలాగే 21 వేలకు మించకుండా సంవత్సరానికి 8.33శాతం చొప్పున బోనస్ లభిస్తుంది. అలాగే గైర్హాజర్ లేకపోతే పబ్లిక్ లింక్డ్ ఇన్సెంటివ్ (PLI) పేర సంవత్సరానికి 38,500 రూపాయల చొప్పున లభిస్తాయి. గైర్ హాజర్లు ఉండేదుంటే ఈ

మొత్తం నుండి ఒక్కొక్క గైర్ హాజరకు 50 రూ. చొప్పున కోత విధించడం జరుగుతుంది. అలాగే దసరా పండగ సందర్భంగా 10,000 రూపాయల చొప్పున అడ్వాన్స్ ఇవ్వబడుతుంది. అదే విధంగా జీతంతో కూడిన వారాంతర సెలవుతో బాటు సంవత్సరంలో జీతంతో కూడిన 45 రోజులు మెడికల్ లీవులు కూడా లభిస్తాయి. అలాగే ప్రావిడెంట్ ఫండ్ (PF), ఇన్సూరెన్స్, ఇఎస్ఐలు అమలు జరుగుతాయి. కార్మికులకు డ్రెస్సులు కూడ ఇవ్వబడుతాయి.



2) నో వర్క్ నో పే: దేశంలో నో వర్క్-నో పే (పనిచేయని రోజు జీతం లభించదు) పద్ధతిలో 88 డిపోలు ఉన్నాయి. వీటిలో 6752 మంది హమాలీ కార్మికులు పని చేస్తున్నారు. ఇందులో పనిచేసిన రోజున ఒక్కొక్కరికి కనీసం 450 రూపాయలు చెల్లిస్తూ వంద బస్తాలకు పైబడి మోస్తే బస్తా ఒక్కంటికి 4రూపాయల చొప్పున చెల్లిస్తారు. ఇందులో పనిచేస్తున్న కార్మికులకు అడ్వాన్స్, బోనస్, ఇన్సెంటివ్ చెల్లించబడుతుంది. ఇంతకు మించి ఎలాంటి బెనిఫిట్స్ లభించడం లేదు. ఇలాంటి నో వర్క్ నో పే డిపో తెలంగాణలో ఒకటి ఉంది.

3) కాంట్రాక్ట్ డిపోలు: FCIలో ప్రయివేటు కాంట్రాక్టర్ల చేత నిర్వహించే డిపోలు దేశ వ్యాప్తంగా 1500 వరకు ఉన్నాయి. ఈ డిపోలల్లో ఒక లక్షా 10 వేల మంది హమాలీ కార్మికులు పనిచేస్తున్నారు. బస్తాకు 15 రూపాయల నుండి 20 రూపాయల చొప్పున ప్రభుత్వం నుండి కాంట్రాక్టర్ తీసుకుంటూ కార్మికులకు మాత్రం బస్తాకు 3 నుండి 5 రూపాయల చొప్పున చెల్లిస్తారు. ఇంతకు మించి ఇతరత్రా ఎలాంటి బెనిఫిట్స్ లభించడం లేదు. కాంట్రాక్టర్లు నిర్వహించే డిపోలు తెలంగాణలో మూడు (మంచిర్యాల, డిచ్‌పల్లి, నల్లగొండ) వున్నాయి.

## 2. CWC (సెంట్రల్ వేరోజింగ్ కార్పోరేషన్)

ఈ పేరుతో కూడ కేంద్ర ప్రభుత్వానికి చెందిన గోదాములు ఉన్నాయి. ఉమ్మడి తెలంగాణ జిల్లాల్లో జిల్లాకు రెండు చొప్పున 20 వరకు డిపోలు ఉన్నాయి. ఈ గోదాములల్లో అవసరాన్ని బట్టి ఎఫ్‌సీఐకి సంబంధించిన సరుకులను నిలువ చేస్తున్నప్పటికీ ప్రధానంగా ప్రయివేటు పెట్టుబడిదార్లకు ఈ గోదాములు కిరాయికి ఇవ్వడం జరుగుతున్నది. ప్రతి గోదాములో 150 నుండి 200 మంది చొప్పున 5000 మంది వరకు హమాలీలు పనిచేస్తుంటారు. ఈ కార్మికులకు చెల్లించాల్సిన కూలీ డబ్బుల్ని ప్రయివేటు పెట్టుబడిదార్ల నుండి ప్రభుత్వ అధికారులు రాబట్టుకుని ఆ అధికారులే నేరుగా చెల్లించడం గాకుండా మధ్య దళారులు లేదా కాంట్రాక్టర్ల ద్వారా కార్మికులకు చెల్లిస్తారు. హమాలీ కార్మికులకు చెల్లించే కూలీ రేట్లు అన్ని డిపోలల్లో ఒకే రకంగా లేవు. కొన్ని డిపోలల్లో బస్తాకు 4 రూపాయలు చెల్లిస్తుంటే మరికొన్ని డిపోలల్లో 3 రూపాయలు, మరికొన్నింటిలో 2.50రూపాయల చొప్పున చెల్లిస్తున్నారు. ఈ హమాలీలకు ఇతరత్రా ఎలాంటి బెనిఫిట్స్ లభించడం లేదు. కార్మికులు ప్రమాదాలకు గురై గాయపడితే, చనిపోతే నష్టపరిహారాలు ఇవ్వడం అనేది కాంట్రాక్టర్ల దయాదాక్షిణ్యాలపై ఆధారపడి నిర్ణయించబడుతున్నది.

సీడబ్ల్యూసీ పేరుతో ప్రభుత్వమే స్వయంగా నడిపే డిపోలు దేశంలో దాదాపు 200 వరకు ఉన్నాయి. ఈ డిపోలల్లో దాదాపు 40 వేల మంది కార్మికులు పనిచేస్తున్నారు. వీరందరికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం జీతభత్యాలు ఇతర సౌకర్యాలు కల్పిస్తున్నారు.

## 3. SWC (స్టేట్ వేరోజింగ్ కార్పోరేషన్-రాష్ట్ర గిడ్డంగుల సంస్థ)



తెలంగాణ వ్యాప్తంగా ఈ సంస్థలో 100 డిపోలు వున్నాయి. వాటిలో దాదాపు పది వేల మంది హమాలీ కార్మికులు పనిచేస్తున్నారు. ఈ 100 డిపోలు కాంట్రాక్టు పద్ధతిలోనే పనిచేస్తున్నాయి. కాంట్రాక్టర్లు బస్తాకు 5 నుండి 10 రూపాయల చొప్పున తీసుకుంటూ కార్మికులకు మాత్రం బస్తాకు 1.50 పైసల నుండి 2 రూపాయల చొప్పున ఇస్తున్నారు. ఇతరత్రా బెనిఫిట్స్ లేవు. పి.ఎఫ్, ఇ.ఎస్.ఐ లాంటి సౌకర్యాలు కూడలేవు.

## 4) SSC (స్టేట్ సివిల్ సప్లయ్ కార్పోరేషన్)

ఇందులో దేశవ్యాప్తంగా ఒక లక్షా 50 వేల మంది వరకు హమాలీలు పనిచేస్తున్నారు. తెలంగాణలోని 450 సెంటర్లలో తొమ్మిది వేల మంది హమాలీ కార్మికులు పనిచేస్తున్నారు. కార్మికులకు పీస్ రేట్ ప్రకారం ప్రభుత్వమే జీతభత్యాలు చెల్లిస్తుంది. గ్రామాల్లో బస్తాకు 9 రూపాయల చొప్పున, పట్టణాల్లో 9.25రూపాయల చొప్పున చెల్లిస్తున్నారు. పీఎఫ్, ఈఎస్ఐ, ఇన్సూరెన్స్‌తో బాటు డ్రెస్సులు కూడా ఇస్తున్నారు.

## 5)మార్క్ ఫెడ్

తెలంగాణలో జిల్లాకు 20, 30 చొప్పున రాష్ట్రంలో 300 గోదాములున్నాయి. వీటిలో 20 వేల మంది హమాలీలు పనిచేస్తున్నారు.మార్క్ ఫెడ్లోని కాంట్రాక్టర్లు బస్తా ఒక్కంటికి 5 నుండి 10 రూపాయల చొప్పున రాబట్టుకుంటూ కార్మికులకు మాత్రం 1.50 రూపాయల నుండి 3 రూపాయల చొప్పున చెల్లిస్తున్నారు. ఇలా తక్కువ కూలీ రేట్లు చెల్లించడమే కాదు. కార్మికులకు వర్తించాల్సిన ప్రావిడెంటు ఫండ్, ఈఎస్ఐ, ఇన్సూరెన్స్‌ను అమలుచేయడం లేదు. డ్రెస్సులు, బోనస్ తదితరాలేవీ ఇవ్వడం లేదు.

## 6) రైల్వే గుడిసెట్లు

తెలంగాణలో దాదాపు 80 వరకు రైల్వే గుడిసెట్లు ఉన్నాయి. వీటిలో దాదాపు 20 వేల మంది వరకు హమాలీలు పనిచేస్తున్నారు. వీటిలో కాంట్రాక్టర్లు బస్తాకు ఐదు నుండి పది రూపాయల చొప్పున రాబట్టుకుంటూ కార్మికులకు మాత్రం బస్తాకు 2 నుండి 4 రూపాయల చొప్పున చెల్లిస్తున్నారు. ఇంతకు మించి ప్రావిడెంట్ ఫండ్, ఈ.ఎస్.ఐ, ఇన్సూరెన్స్, బోనస్ తదితరాలేవీ ఇవ్వడం లేదు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంస్థల్లో ప్రభుత్వ రంగ సంస్థల్లోనే హమాలీ కార్మికులను, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులు, ఉద్యోగులను చట్టవిరుద్ధంగా, కోర్టు తీర్పులకు విరుద్ధంగా తీవ్రమైన శ్రమదోపిడికి, అసౌకర్యాలకు, అణచి వేతలకు గురిచేస్తున్నప్పుడు ప్రయివేటు సంస్థలల్లో మరెంత ఘోరమైన పరిస్థితులుంటాయో అర్థం చేసుకోవచ్చు. రాజ్యాంగంపై ప్రమాణం చేస్తూ అధికారంలోకి వస్తున్న పాలకులు, ప్రభుత్వాధికార్లే రాజ్యాంగ విరుద్ధంగా చట్ట

విరుద్ధంగా, అన్యాయంగా, అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్నప్పుడు ఇక ప్రజలను దోపిడీ చేస్తూ లాభాలను పెంచుకునే పెట్టుబడిదార్ల వ్యవహారం మరెంత దుర్మార్గంగా వుంటుందో అర్థం చేసుకోవచ్చు.

## 7) ప్రయివేటు సంస్థలు

తెలంగాణలో గల రైస్ మిల్లులు, ఆయిల్ మిల్లులు, పత్తి, దాల్ మిల్లులు, గ్రామాల్లోని ఐకేపీలు పట్టణాల్లోని వ్యవసాయమార్కెట్లు, సీడ్ కంపెనీలు, పలురకాల ట్రాన్స్‌పోర్టులు తదితరాలలో దాదాపు 30 లక్షల మంది హమాలీ కార్మికులు పనిచేస్తున్నారు. ఈ కార్మికుల్లో స్థానికులతో బాటు స్థానికేతరులు కూడా వున్నారు. స్థానికేతరుల్లో ఇతర రాష్ట్రాలకు చెందిన వలస కార్మికులు కూడా పెద్ద సంఖ్యలో వున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల, విదేశీ, స్వదేశీ కార్పోరేటు పెట్టుబడిదార్ల దోపిడీవర్గ, విధ్వంసకర విధానాల వలన భూములు కోల్పోతూ జీవనోపాధి కోల్పోతూ, విస్తాపితులుగా మారుతూ, పేదరికం పెరిగిపోతూ బతుకు కోసం ఇతర రాష్ట్రాలకు, ఇతర దేశాలకు వలసలు పోతున్నారు. ఆవిధంగా అనేక పనులు చేస్తున్నట్లుగానే హమాలీలుగా పనిచేస్తున్న వలస కార్మికులు తెలంగాణలో వేలాది మంది ఉన్నారు. ప్రయివేటు సంస్థల యజమానులు, కాంట్రాక్టర్లు, వ్యాపారస్తులు స్థానిక కార్మికులనే పలు విధాలుగా దోపిడీ పీడనలకు, అసౌకర్యాలకు,అణచివేతలకు గురిచేస్తున్న వారు వలస కార్మికుల పేదరికాన్ని, ఆర్థిక స్థితిని అవకాశంగా తీసుకుంటూ విచ్చలవిడిగా శ్రమను కొల్లగొడుతున్నారు.

స్థానికుల కన్నా తక్కువ కూలీ చెల్లించడమే గాకుండా చట్ట ప్రకారంగా అమలు చేయవల్సిన సంక్షేమ కార్యక్రమాలను కూడా అమలు చేయడంలేదు. చివరకు ప్రమాదాలకు గురై గాయపడినా, చనిపోయినా కూడ నష్టపరిహారాలు ఇవ్వక పోవడం ఇచ్చినప్పటికి తక్కువ ఇవ్వడమనేది యజమానుల ఇష్టాయిష్టాలపై ఆధారపడి వుంటున్నది. పెట్టుబడిదార్ల అక్రమాలు చట్ట వ్యతిరేక విధానాలు పాలకులకు, ప్రభుత్వ అధికారులకు అర్థమవుతున్నప్పటికీ పట్టించుకోవడం లేదు. లక్షలాదిగా సిసి కెమరాలను పెట్టుతూ చిల్లర దొంగ తనాలను అరికట్టాలనుకునేవారికి పెట్టుబడిదారులు, కాంట్రాక్టర్లు, బహిరంగంగా బాజాప్తుగా సాగిస్తున్న శ్రమ దోపిడీలను, చట్ట విరుద్ధ విధానాలను అరికట్టే చిత్తశుద్ధి ఉండడం లేదు.

కార్మికుల సంక్షేమం కోసం "రాష్ట్ర హమాలీ వెల్ఫేర్ బోర్డు"ను ప్రభుత్వం వెంటనే ఏర్పాటు చేయాలి.

పరిశ్రమల యజమానులు, కాంట్రాక్టర్లు, వ్యాపారస్థులు సాగించే చట్ట వ్యతిరేక విధానాలను అరికట్టుతూ కార్మికులు శ్రమదోపిడికీ, అణచివేతకు, అసౌకర్యాలకు గురికాకుండా, లక్షలాది హమాలీ కార్మికుల సంక్షేమాన్ని, ప్రయోజనాలను పరిరక్షించేందుకు తెలంగాణ ప్రభుత్వం "రాష్ట్ర హమాలీ వెల్ఫేర్ బోర్డు"ను వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నాం.

ఆయా పరిశ్రమలు, వ్యవసాయ మార్కెట్లు తదితర సంస్థలు, స్థలాల్లో హమాలీ కార్మికులే కాకుండా క్యాజువెల్ కార్మికులు, స్వీపర్లు, ఇతర కార్మికులకు కూడా కనీస వేతనాలతో బాటు సంక్షేమ పథకాలనీ అమలుచేయాలి.

కార్మిక సోదరులు, బరువులూ, బస్తాలు మోసే హమాలీలు కండలు కరిగిపోతూ, బొక్కలు అరిగిపోతూ, అనారోగ్యాలకు గురవుతూ పేదరికంతో బతుకుతున్నారు. రైతుల, కార్మికల కష్టాన్ని దోచుకుంటూ పెట్టుబడిదారులు కోట్లాది రూపాయలు సంపాదించుకుంటూ బంగ్లాలపై బంగ్లాలు కడుతున్నారు. చట్టాలను, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తూ శ్రామికుల ప్రయోజనాలను పరిరక్షించాలనే ఇష్టం సంస్థల యజమానులకు, కాంట్రాక్టర్లకు ఉండదు. ఎన్నో విజ్ఞప్తులు చేసినప్పటికీ పట్టించుకుని పరిష్కరించే చిత్తశుద్ధి పాలకులకు వుండదు. ఇలాంటి పరిస్థితుల్లో కార్మిక వర్గం తమ సమస్యల పరిష్కారానికి సంఘటితంగా పోరాటాలు చేయడం తప్ప మరో మార్గం వుండదని గుర్తించాలి. తెలంగాణ అసంఘటిత కార్మికుల సమస్యల పరిష్కారానికై పోరాటాలకు పూనుకోవాలి.

తెలంగాణ గవర్నమెంట్ గోడౌన్‌లలో పనిచేసే కార్మికులందరికి ఒకే జీతభత్య విధానం అమలు చెయ్యాలి. సమాన పనులకు సమాన వేతనాలు యివ్వాలి. కనీస వేతనాల చట్టాన్ని అమలు చెయ్యాలి. వేతనాలు, కూలీరేట్లు, భత్యాలు, ఇతరత్రా సౌకర్యాల విషయంలో రాష్ట్ర వ్యాప్తంగా కామన్ పద్ధతిని అమలు చెయ్యాలి. సంక్షేమ కార్యక్రమాల్లో భాగంగా అన్ని పరిశ్రమల్లో, డిపోలల్లో ఐడి కార్డులు, ప్రావిడెంట్ ఫండ్, ఈ.ఎస్.ఐ, ఇన్సూరెన్స్ అమలుచేయ్యాలి. ప్రమాదాలకు గురై చనిపోయిన, గాయపడిన హమాలీ కార్మికుల కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాలి. హమాలీ కార్మికులకు ప్రతి సంవత్సరం రెండు జతల డ్రెస్సులు, రెండు టవల్స్ రెండు డస్ట్ మాస్కులు, ఒక జత చెప్పులు ఇవ్వాలి. పెరుగుతున్న మార్కెటు సరుకుల రేట్లకు అనుగుణంగా ఎప్పటికప్పుడు సకాలంలో కరువు భత్యాన్ని పెంచి కార్మికులకు ఇవ్వాలి.

T

పరిశోధన

# గ్రామ దేవతలకు బ్రాహ్మణ దేవుళ్ల ప్రమాదం

ఎం. సంధ్య

తరతరాలుగా నేటికీ జన సమూహంలో నిలిచి ఉన్న నమ్మకాలు, సంప్రదాయాలు క్రియారూపాన్ని దాల్చాయి. గ్రామదేవతలు లేని ఊరు ఉండదు. ఏ పండుగ చేసినా, ఇంట్లో చిన్న పిల్లలకు బాగ లేకపోయినా వెంటనే గుర్తుకు వచ్చేది గ్రామ దేవతలే. కొంతమంది ఇంట్లోనే చిన్న గుడి కట్టి దేవతను ప్రతిష్ఠిస్తారు. మరి కొంతమంది వ్యవసాయ కుటుంబాలలో పంటచేతికి రాగానే ఒక కోడిపుంజు తెగడం ఆనవాయితీ. ఆవులు, బర్రెలు పాలు ఇవ్వడం ప్రారంభం కాగానే గ్రామదేవత దగ్గర పాలతో పాశం వండి పెడతారు. ఎంత నాగరికత పెరిగినా గ్రామ దేవతల మీద నమ్మకాలు ఇంకా ఉండిపోయాయి. ఇప్పటికీ గ్రామ దేవతలను ఎందుకు పూజిస్తారు? వాటి మీద నమ్మకాలు ఎలా ఏర్పడ్డాయి? గ్రామదేవతలెవరు? శ్రమను నమ్ముకొని జీవించే పీడిత కులాల ప్రజలు తెలంగాణ పల్లెల్లో నేటికీ గ్రామ దేవతలనే తమ ఆరాధ్య దైవాలుగా కొలుస్తారు. గత కొన్నేళ్లుగా గ్రామ దేవతల సంస్కృతిపై బ్రాహ్మణ దేవతల ఆధిపత్యం క్రమంగా పెరుగుతూ వస్తున్నది.

ఒకప్పుడు మాతృస్వామ్య వ్యవస్థ మనుగడలో ఉందని చెప్పడానికి గ్రామదేవతలే తిరుగులేని సాక్ష్యాలు. మిగతా ప్రాంతాల కంటే తెలంగాణలోనే అధిక సంఖ్యలో గ్రామ దేవతలు కనిపిస్తారు. వీరిలో ముత్యాలమ్మ, పోలేరమ్మ, ఎల్లమ్మ, కట్టమైసమ్మ, ఉప్పలమ్మ వంటి దేవతలను అధికంగా పూజిస్తారు. ఒక్కోదేవత ఒక్కో విధంగా తమను రక్షిస్తుందని, కోర్కెలను తీరుస్తుందని ప్రజలు నమ్ముతారు. అందుకే ఆయా దేవతలను వారి మహిమలు, శక్తులను బట్టి ఒక్కో స్థానంలో ఒక్కటి ప్రతిష్ఠిస్తారు. ముత్యాలమ్మ అయితే ఊరి చివర ఉంటుంది. ఈ దేవత గ్రామంలో ఆరోగ్యాలను కాపాడుతుందని నమ్ముతారు. ఎల్లమ్మ అయితే ఇంటి దేవరగా కొలుస్తారు. ఈమె కుటుంబాలను కాపాడుతుందంటారు. కట్టమైసమ్మ కట్టమీద ఉంటుంది. ఈ దేవత చెరువును కాపాడుతుందనేది తెలంగాణ వాసుల నమ్మకం. పోలేరమ్మ దేవత పొలిమేరను రక్షిస్తుందని, ఉప్పలమ్మ వ్యవసాయాన్ని కాపాడుతుందని, అంటువ్యాధుల నుంచి రక్షిస్తూ, పంటలను కాపాడుతుందని విశ్వాసం.

గ్రామదేవతల పూజావిధానం తరతరాలుగా మనకు వస్తున్న గ్రామీణ సంప్రదాయం. మానవుడు నిత్య జీవితంలో ఎన్నో జయాపజయాల్ని చవిచూస్తున్నాడు. మరో వైపు తన లక్ష్య సాధన కోసం ఎన్నో ప్రయత్నాలు కొనసాగిస్తున్నాడు. సృష్టికి మూల కారకురాలు మాతృదేవత అని గ్రహించిన పురాతన మానవుడు, ఆమెను సంతృప్తి పరచేటందుకు ఎన్నో మార్గాలను ఆశ్రయించాడు. అందులో ప్రార్థన, మంత్ర తాంత్రికతలు, పవిత్రీకరణ, ఆత్మహింస, బలి అనేవి ప్రధానంగా కనిపిస్తాయి.

గ్రామాలలో వెలిసే దేవత, దేవుళ్లను ముఖ్యంగా స్త్రీ దేవతా రూపలను గ్రామదేవతలని అంటారు. సంప్రదాయాలను అనుసరించి గ్రామ రక్షణగా ఈ దేవతలను ఊరి పొలిమేరలలో ఏర్పాటు చేసేవారు. ఎక్కడో ఉన్న మధుర మీనాక్షమ్మ వద్దకో, కంచి కామాక్షమ్మ దగ్గరికో, బెజవాడ కనకదుర్గమ్మ చెంతకో వెళ్లాలంటే కుదరకపోవచ్చు. వీలుచిక్కినా అందరికీ ఒకేసారి వెళ్లడం సాధ్యపడకపోవచ్చు. ఇలాంటి సందర్భాలలో అమ్మ దర్శనానికి వెళ్లలేకపోయామే అని నిరాశ పొందకుండా ఉండేందుకు ఎక్కడో ఉన్న తల్లిని ఇక్కడే దర్శించుకొన్నామనే తృప్తిని పొందేందుకు గ్రామదేవత వ్యవస్థని ఏర్పాటు చేశారు పెద్దలు.

మాతృస్వామిక వ్యవస్థకు చెందిన గ్రామ దేవతలు దళిత దేవతలు. బహుజన సంస్కృతికి పరిరక్షకులు. సమాజంలోని బడుగు కులాల వారు కూడా అగ్రకులాలతో పాటు సమానంగా సామాన్య, సాంస్కృతిక ఆచార వ్యవహారాల్లో ఉత్సాహంగా పాలుపంచుకోవడం ఈ గ్రామ దేవతల జాతరలతో సాధ్యమైంది. ప్రాచీన కాలంలో పురాతన మానవునిచే పూజింపబడ్డ దుష్ట గ్రామ దేవతలు కూడా కాలక్రమేణా శిష్ఠ దేవతల్లో కలిశాయి. అయితే పూజా విధానంలో, గుళ్ల నిర్మాణంలో గ్రామ దేవతలకు, బ్రాహ్మణ దేవతలకు తేడాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. నిశితంగా పరిశీలిస్తే గ్రామ దేవతల పూజా విధానంలో కొన్ని శిష్ఠ(బ్రహ్మణ) దేవతల పూజా విధానాలు భిన్నమైనవి.

గ్రామ సంరక్షణ కోసం ఏర్పాటు చేసుకున్న గ్రామ దేవతల లక్షణాలు కొన్ని విలక్షణంగా ఉంటాయి. గ్రామాలను పరిరక్షించడం, చెలరేగిన వ్యాధులను అదుపులో ఉంచడం, పశువులను, పంట పొలాలను, చెరువులను, నీటి వనరులను కాపాడతాయని ప్రజల(మూఢ)నమ్మకం. గ్రామదేవతల పూజార్లు బ్రాహ్మణేతరులే ఉంటారు. (ఇటీవల కాలంలో గ్రామదేవతల పండుగలకు బ్రాహ్మణులు పౌరోహిత్యం చేస్తున్నారు. బహుజన సంస్కృతికి రూపంలో, సారంలో బ్రాహ్మణ సంస్కృతి వ్యతిరేకమైనది.) గ్రామదేవతల పూజార్లకు సంస్కృత మంత్రాలు రావు. ఆ పూజారి మాటలు ఆయా ప్రాంతీయ భాషలోఉంటాయి. గ్రామదేవతల స్వరూప స్వభావాలు, పుట్టుక స్వభావాలను అనుసరించి ఒక్కొక్క తెగవారు పూజారిగా ఉంటున్నారు. చాలా వరకు గ్రామదేవతలు చిన్న రాయిగానో, చెట్టు రూపంలో గానీ దర్శనమిస్తుంటారు.

ప్రజల మనసులో పుట్టే ఏ కోర్కెనైనా మంచిదో కాదో తానే నిర్ణయించి కోరిన కోర్కెని తీర్చే బాధ్యతని స్వీకరించి భక్తులకు అండగా నిలిచే తల్లి తలుపులమ్మ అని ప్రజలు నమ్ముతారు. తలపు అంటే ఆలోచన. వాటిని తీర్చే తల్లి తలపులమ్మ క్రమంగా ఈమె 'తలుపులమ్మగా' మారింది. ఇంట్లో నుండి బయటికి వెళ్లేటపుడు తల్లికి లేదా కుటుంబ సభ్యులకు ఎలా చెప్తామో అలాగే ప్రజలు ఆ తల్లిని ప్రార్థించి వెళ్తారు. ఊరిని విడిచి పొరుగూరు వెళ్లే వ్యక్తుల రాకపోకల్ని గమనిస్తూ ఊరి పొలిమేరలో ఉండేతల్లి పొలిమేరమ్మ క్రమంగా పోలేరమ్మ అయ్యింది. పొలిమేరలో ఉండే మరొక తల్లి శీతలాంబ. ఇమె చేతుల్లో చీపురు, చేట ఉంటాయి. తన గ్రామంలోని ప్రజలకు వ్యాధులను కలిగించే క్రిమి కీటకాలను, భయాన్ని కలిగించే భూతప్రేత పిశాచ గణాలను గ్రామంలోకి రాకుండా వూడ్చి చేటతో ఎత్తి పారబోసేది ఈ దేవతే అని ప్రజలు నమ్ముతారు. ప్రజల మనసుల్లో ఉండే భయమే ఈ నమ్మకాలను పెంచి పోషిస్తోంది. గ్రామదేవతల గుళ్లు ఊరి పొలిమేరల్లో, పంట పొలాల మధ్య, చెరువు గట్లల్లో, వేప చెట్ల కింద ఉంటాయి. నాలుగు బండ రాళ్లను చేర్చి చతురస్రాకారంలో గుడి నిర్మిస్తారు. గ్రామదేవతల ప్రతిరూపంగా గరకను, వేప మండలను జోడించి దేవతల ముందుంచి పూజిస్తారు. గ్రామ దేవతల గుళ్లు సామాన్యంగా ఉంటాయి. కులదేవత పద్ధతి పేరుతో తమ వంశానికి, కులానికి, తెగకు ఏదో ఒక వస్తువునో, ప్రాణినో, పక్షినో సంకేతంగా ఉంచుకోవడం (టొటెమ్) ఆదిమజాతి లక్షణాన్ని తెలిపే పద్ధతి.

### గ్రామదేవతల చరిత్ర, వీరగాథలు, కథలు,

పురాణాలు, లిఖిత రూపంగా కాకుండా, మౌఖిక ప్రచారం వల్లనే తరతరాలుగా జానపదుల రూపంలో ప్రజల నాలుకల మీద జీవిస్తుంది. దేవుడు చేసిన మనుషులనే భావన రాకముందే, మనుషులు చేసిన దేవుళ్లు అసంఖ్యాకంగా పుట్టుకొచ్చారు. అజ్ఞాన యుగాలలో మనిషి ఎదిరించవలసిన అనేక సమస్యలను పరిష్కరించవలసిన ప్రయత్నాలలో భాగంగా దేవతాగణం కూడా ఉద్భవించింది. ప్రాచీన మానవుని జీవితంలో భయాన్ని కలిగించే సంఘటనలే ఎక్కువ. భూకంపాలు, ఉరుములు, పిడుగులు... ఇలా ఏ ప్రకృతి వైపరీత్యమైనా మానవుణ్ని కారడవుల్లోకి, చీకటి గుహల్లోకి, కొండల్లోకి, కనుమల్లోకి పరుగెత్తేట్లు చేసింది. తనను కాపాడేశక్తి ఏదీలేదా? అని ఆక్రోశించిన ఆనాటి మానవునికి ఏదో శక్తి ఉందనే భావన ఊరట కలిగించి ఉండాలి. అయితే ఆ శక్తి ఉగ్రశక్తి. దాన్ని ఎలాగైనా మంచి చేసుకోవాలనే భావం కలిగినపుడు మనిషి ఎన్నో పూజా విధానాలు, ఆచరణలను కల్పించుకున్నాడు.

అయితే అందరు దేవతల సృష్టికీ భయమొక్కటే కారణం కావచ్చు. తినడానికి ఫలాలను వృక్షం ఇచ్చినప్పుడు, కడుపు నింపుకోడానికి పుడమి తల్లి అన్నాన్ని ప్రసాదించినప్పుడు, సూర్యుడు వెలుగును ప్రసరించినప్పుడు, చంద్రుడు మనస్సుకు చల్లదనాన్ని కలిగించినప్పుడు మనిషిలో కొత్త భావాలు, ఆందోళన మొదలైనాయి. అట్లే నిరంతరం జరుగుతున్న జీవన సమరాల్లో బాసటగా నిలిచి విజయం చేకూర్చిన వ్యక్తులను స్మరించుకొని ఆనాటి మానవుడు దేవుని స్థానాన్ని పూజించాడు. ప్రకృతిలో ఏది ఎందుకు జరుగుతుందనే విషయమే తెలియని ప్రాచీన మానవునికి సూర్యోదయమైనా, చంద్రోదయమైనా, మెరుపయినా, ఉరుమయినా ఆశ్చర్యమే. ఈ ఆశ్చర్యమే దేవుని కల్పనకు కొంతవరకు దారితీసి ఉండవచ్చు.

దేవతలు లేని గ్రామమంటూ ఏదీ లేదు. గ్రామీణ ప్రజలు ఆరాధించే దేవతామూర్తులు, వారికి సంబంధించిన పూజలు, జాతరలు, ఆచారాలు ఒకరకమైతే కులదేవతా పద్ధతి పేరుతో తమ వంశానికి, కులానికి, తెగకు ఏదో ఒక వస్తువునో, ప్రాణినో, పక్షినో సంకేతంగా ఉంచుకోడం ఒక పద్ధతి. ఒక కులం లేక సమాజం ఆరాధించే దేవతాస్వరూపాన్ని గురించిన ఈ పద్ధతిని కులదేవతా పద్ధతి అనవచ్చు. కుల దేవతనే

జీవనాధారంగా ఉపయోగించుకొనేవారున్నారు. ఈ దేవతల ప్రీతి కోసం పూజలు, జాతరలు, ఉత్సవాలు జరపని వారు తక్కువే. అయితే ఈ పూజలు నిత్యోత్సవాల వంటివి కావు. కొందరు దేవతలకు ఆలయాలు ఉండవు. పూజార్లూ ఉండరు. దీపం వెలిగించే వారులేరు. ఏ సంవత్సరానికో, ఆరునెల్లకో ఉత్సవం జరుగుతుంది. అంతే. అసలు రూపం కూడా ఉండ వలసిన అవసరం లేదు. చిన్నరాయి, బండ, కొమ్మ, చెట్టు, పుట్ట కూడా దేవతగా ఆరాధింపబడవచ్చు.

గ్రామదేవతల్లో చాలా వరకు స్త్రీ దేవతలే. పురుష దేవతలు చాలా తక్కువ. ఒక వేళ ఉన్నా వారు స్త్రీ దేవతల సోదరులో, భర్తలో, బంధువులో అయి ఉంటారు. బ్రాహ్మణ, ఆర్య దేవతలకు శ్రమతో ఏ సంబంధం లేదు. కష్టజీవులను దోచుకొనే సంపన్న వర్గానికి సేవ చేయడమే విష్ణు, మహేశ్వరుడు, రాముడు, సీత, కనకదుర్గ, తిరుపతి వెంకటేశ్వరస్వామి, మీనాక్షి, మహాలక్ష్మి... ఇలా ఎందరో దేవతలను బ్రాహ్మణత్వం పుట్టించింది. 33 కోట్ల దేవతలున్నా సరే శ్రమ జీవుల బాధలు ఎన్నడూ తీరలేదు. నిజానికి సమస్యల పరిష్కారానికి దేవతపై ఆధారపడడం సమాజ వెనుకబాటు తనానికి సూచిక. ఈనాడు భారత దేశంలో వెనుకబాటు, సంకుచిత భావాలే అభివృద్ధికరమైనవని బ్రాహ్మణత్వం బోధిస్తుంది.

ద్రావిడ భూభాగంలో ఉత్పత్తి సంబంధమైన గ్రామ దేవతలకున్న చారిత్రక పాత్రను దెబ్బతీసి వారి స్థానంలో త్రిశూలాలతో ఊరేగుతున్న హింసాపూరితమైన బ్రాహ్మణ దేవతలను నిలబెట్టాలనే ప్రయత్నం జరుగుతోంది. దళిత బహుజన గ్రామ దేవతల ప్రజా సంస్కృతిని బ్రాహ్మణీ కరించకుండా కాపాడుకోవడం ఇప్పుడున్న పరిస్థితుల్లో చాలా అవసరంగా మారిపోయింది. అట్లని ప్రజా సంస్కృతిలో ఉన్న గ్రామ దేవతల సంస్కృతిని ప్రోత్సహించకూడదు. ప్రజలను ఆ నమ్మకాల నుంచి బయట పడేయాల్సిన అవసరం ఉంది.

మూఢ విశ్వాసాలతో ప్రజలు గ్రామ దేవతలను ఆరాదించినా, బ్రాహ్మణ దేవతలను ఆరాదించినా నష్టమే కలుగుతుంది. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల కష్టజీవులు గ్రామ దేవతలను పూజించేవారు. ఈ మూఢత్వం చుట్టూ అజ్ఞానం, అమాయకత్వం ప్రకృతి పట్ల భయం, సమూహిక జీవనం అల్లుకొని ఉంటుంది. ఈ మధ్య కాలంలో అంటే ఐదు సంవత్సరాల క్రితం నుంచి ప్రతీ గ్రామంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన పేర, బొడ్రాయి పండుగలు, దుర్గమ్మ పండుగల పేర సామూహికంగా పండుగలు నిర్వహిస్తున్నారు. ఈ పండుగల సమయంలో చేసే అన్ని కార్యక్రమాలు కూడా బ్రాహ్మణ సంస్కృతినే ప్రోత్సహించేలా ఉంటున్నాయి. అంతేకాకుండా ఈ సందర్భంలో ఒక్కో ఇంట్లో 20 వేల నుంచి లక్ష రూపాయలను ఖర్చు చేస్తున్నారు. పూజ నిర్వహించిన బ్రాహ్మణులకు 50 నుంచి లక్ష రూపాయలు ప్రజలే సేకరించి ఇస్తున్నారు. ఈ పండుగలకు ప్రతి ఇంటికి వారి దగ్గరి బంధువులను పిలవడం, వారికి బట్టలు పెట్టడం, కూతురు అల్లుళ్లకు సారెలు పెట్టడం చేస్తున్నారు. పండుగ తర్వాత రోజు ప్రతి ఇంట్లో మేకలు, గొర్రెలు కోసుకొని తినడం, మందు తాగడం కొనసాగుతున్నది. ఈ సందర్భాల్లో బాగుపడేది దక్షిణ పుచ్చుకునే బ్రాహ్మణులు, మందు, బట్టలు అమ్మే వ్యాపారస్తులననేది వాస్తవం.

బ్రాహ్మణ దేవతలు దేశంలో రోజు రోజుకు విపరీత ప్రాచుర్యం పొందుతున్నాయి. దేశ ప్రధానమంత్రి, రాష్ట్రపతి, ముఖ్యమంత్రులు, శాస్త్రవేత్తలు ఇంకెందరో వాటిని ప్రచారం చేస్తున్నారు. మూఢవిశ్వాసాలను ప్రచారం చేస్తున్నారు. ప్రజలను నమ్మించడం ద్వారానే పాలక వర్గాలు ఎక్కువ కాలం మనగలుగుతాయి. దేశ పాలక వర్గాలకు కేవలం ప్రజలను అజ్ఞానంలో ఉంచడమే లక్ష్యం కాదు. బ్రాహ్మణ దేవుళ్ళను, దేవతలను ఉపయోగించుకోని సామాజిక సాంస్కృతిక ఆర్థిక జీవితాలను ప్రభావితం చేయటం, రాజకీయ అధికారాన్ని చేజిక్కించుకోవడం లక్ష్యం. హిందూ మతంలో ఉన్న నేరపూరిత, హింసాపూరితమైన చర్చలకు అధ్యాత్మిక భావన కలిగించి, ధర్మము, న్యాయం అనే ముసుగు తగిలించిన చరిత్రే హిందూ దేవుళ్ళ చరిత్ర. బ్రాహ్మణ దేవుళ్లు, శ్రామణ దేవుళ్లు ఎలా ఉనికిలోకి వచ్చారో చరిత్రను పరిశీలిస్తే అనేక నిజాలు బయటకు వస్తాయి. దేవుడు అనే నమ్మకం పాలక వర్గాల దోపిడీకి సాధనం. ఒకే దేవుడు, ఒకేమతం, ఒకే జాతి కూడా నియంతృత్వ వ్యవస్థలకు పునాది వేస్తుంది. రాముడు ఈ దేశ ప్రజలకు ఆరాధ్యుడని ఆధిపత్య కులాల ప్రచారం. రావణాసురుడు మా చక్రవర్తి అని శ్రీలంక ప్రజలు నమ్ముతున్నారు. ఈ నాటి దేవుళ్ళ చరిత్ర, నిన్నటి సామాజికంగా సంఘర్షణగా, పోరాటంగా అర్థం చేసుకోని ఆద్యాత్మిక చరిత్రను పరిశీలించాలి. T

# ముళ్ల కంచె

సమీర

పిల్లలు వరుసగా నిలబడి ఒక్కొక్కరుగా తమ నోటు పుస్తకాన్ని చూపుతుంటే, తప్పొప్పులను నిర్ణయించి,తప్పులను సవరిస్తున్న.

తప్పుచేసిన పసివాళ్ళ మనుసులను గాయపరచకుండా, తోటివారిముందు చిన్నబుచ్చుకోకుండా జాగ్రత్త పడుతున్న. అంతలో!

'సార్ సార్, ఇగో ఈ స్రవంతి చూడు సార్'

'ఏం! ఏంచేసింది!'

'ఇగో నీవింతకు ముందు దిద్దిన ఆ రాజుగాడి నోట్స్ చూసి, తను దిద్దుకుంది సార్'

'ఓహొ!అట్లనా,దానికి తప్పునొప్పుకునే ధైర్యం లేదులే. పిరికిది.' అని నవ్వుతూ నాపనిలో తల దూర్చిన మళ్ళా.

* * *

'ఏయ్ నీ కెందుకే నా గురించి? నాయిష్టం.' తను పరోక్షంగా పిరికిదాన్ననిపించుకున్న ఉక్రోశంతో కసిరింది స్రవంతి.

తను వరుసలో వెనకనుండి నాలుగవది గా ఉంది.

'ఔ !ఆమెప్పుడూ అంతేలే రేణూ.నిన్న సాయంత్రం ఆటల పీరియడ్‌లో, కబడీలో ఓడినందుకు గూడా ఏడ్చిందిగా.

వరుసలో వస్తున్న పిల్లల నోట్స్ కరెక్ట్ చేస్తూనే, ఓ చెవిని విద్యార్థుల వైపు ఉంచిన.

'నేనేం ఏడ్వలే. అలిగినంతే. ఓడితే కోపం రాదారా, ఇన్సల్ట్ అనిపించదారా ఎవరికన్నా, మహా చెబుతున్నవేందిరా, నీవూ మా టీమే కదరా, నీకిన్సల్ట్ అన్పించలేదా సిగ్గులేని ఎదవా?'

'ఇగో తల్లీ. నాలెక్క కూడా తప్పు పోయింది..' రేణుక తన కరెక్షన్ పూర్తి కాగానే వచ్చి చెబుతున్నది, మొట్టికాయేసిండంతే,' రేణుక తిరిగివెళ్ళి స్రవంతితో చెప్పింది. 'గా మాత్రం ఓపికుండాలమ్మా.'

ఆఖరి విద్యార్థిని పంపి నేను తలెత్తిన. అంతవరకూ అర్థమనస్కంగా ఆ పిల్లల స్పందనలనూ గమనిస్తున్న నేను, ఇపుడు రిలాక్సవుతూ పూర్తిగా గమనిస్తూ కూర్చున్న.

'ఏందే పేద్ద నీతులు చెబ్తానవ్. సాకలిముండా. ఐనా, ఇల్లిల్లు తిరిగి బట్టలుతికి కూటి కెల్లదీస్కునే మీకు సిగ్గూ ఎగ్గూ లెందుకుంటై లే.'

చివరి మాటతో, అంతవరకున్న స్పోర్టివ్‌నెస్ ఆవిరయ్యింది నాల్గవ తరగతి తొమ్మిదేళ్ళ ప్రాయపు రేణుకలో. మూతి ముడుచుకొని తన స్థానానికెళ్ళి కూర్చున్నది.

చివరకు తనే గెలిచానన్న ధీమాతో రేణుక వైపూ ఇతర క్లాస్ మేట్ల వైపూ గర్వంగా చూస్తున్న స్రవంతిని చూస్తున్న నాలో..

ఔరా మనువా! ఎంత మాయగాడివీ, మోసగాడివిరా! వర్ణాన్నీ అందులో మళ్ళీ కులాన్నీ విభజించి, వర్ణధర్మాన్నీ కులధర్మాన్నీ సృష్టించి గోడలు ఎంత బలంగా కట్టినవ్.!

స్రవంతిదీ, రేణుకదీ ఒకే వర్ణం. ఇద్దరి తలిదండ్రులూ మూలార్థంలో కూలీలే. రెడ్డికులానికి చెందినా, స్రవంతి తలిదండ్రులు భూస్వాముల వద్దనో, ధనికరైతుల వద్దనో రెక్కాడించి, డొక్కాడించుకునేవారే. ఏదో ఒకెకరం భూమి ఉండొచ్చు. కాని ఆ శారెడు భూమి చెక్కతో, ఇద్దరు ముసలోల్లు, ఇద్దరువయసు దంపతులు, ఇద్దరు పిల్లలు బతకనీకె సరిపోదు మరి.

రేణుక కుటుంబం అట్లా కాదు.పూర్తిగ వెనకటి లాగా కాకుండా, ఓ నాలుగైదు కుటుంబాల నుంచుకొని, ఆ కుటుంబాల ఇంటి ఆవరణ లోనే బోర్‌కాడ బట్టలు ఉతుకుతరు. ఆ నాలుగు కుటుంబాలలో, పెళ్ళీ పేరంటాలకు, కందురు వంటి పండగలకు సాంప్రదాయ అనూచాన పనులను భర్తతో, ముసలి అత్తతో కలిసి పనిచేస్తరు రేణుక తల్లి నానమ్మ. ప్రతిఫలాన్ని కూడా సాంప్రదాయ పద్ధతి విధంగానే. అప్పుడపుడు అవసరాలకు తాత్కాలిక డబ్బు సర్దుబాటుకు ఉపయోగించు కుంటదీ కావచ్చు.

అట్లా పారిశుధ్య శ్రమ, శ్రామిక కులం, వంశ పారంపర్య యాజమాన్య కులం కంటే తక్కువైంది. వర్గంతో సంబంధం లేకుండా రెండు పసి మనుసులలో ముళ్ళకంచెను పెంచింది.

T

# వర్గీకరణోద్యమ చాటింపు-చిటిక కోలా దండోర

ఇమ్మిడి మహేందర్

భారతీయ సమాజంలో కులం నిచ్చెనమెట్ల స్వభావాన్ని కలిగి ఉంది. ఈ స్వభావమే కింది వర్గాలను కలవనీయకుండా చేస్తుంది. భారత రాజ్యాంగం ద్వారా పొందిన రిజర్వేషన్లను పంచుకునే విషయంలో కూడా ఈ అగ్రకుల, బ్రాహ్మణీయ భావజాలం కనిపిస్తుంది. కొన్ని సంవత్సరాలుగా ఈ రిజర్వేషన్ల పంపకం విషయంలో అధికార రాజకీయ పార్టీలు, విపక్ష రాజకీయ పార్టీలు చాలా జాగ్రత్తగా వ్యవహరించాయి. మొదట్లో ఏ వైపు నిల్చున్నా తమకు నష్టం జరుగుతుందనే ఆలోచనతో తటస్థంగా ఉన్నారు. నేడు మాదిగల సుదీర్ఘ పోరాటాల వల్ల బయటికి స్పష్టమైన వైఖరిని తెలియజేస్తూనే, లోలోపల వాటిని ఉద్దేశ పూర్వకంగా ఆపే కుట్రలు చేస్తున్నాయి.

ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ ప్రక్రియ గత ఇరవై ఐదు సంవత్సరాల నుండి దండోరా ఉద్యమంగా ముందుకు వచ్చింది. దీనికి మందకృష్ణ మాదిగ నాయకత్వం వహిస్తూ రిజర్వేషన్ ఉద్యమాలనే కాకుండా అనేక సామాజిక, మానవత ఉద్యమాలను నిర్వహించి, ఫలితాలను సాధించాడు. ఒక సామాజిక ఉద్యమం ప్రజాస్వామిక ఆకాంక్షతో గత ఇరవై అయిదు సంవత్సరాలుగా సుదీర్ఘకాలం కొనసాగడానికి అది విశాల ప్రజానీకంలో గుర్తింపు పొందడం వల్లనే సాధ్యమయింది. ఈ క్రమంలో సామాజిక ఉద్యమాలు సాహిత్య సృజనలో కూడా ప్రభావం వేస్తుందనటంలో ఎలాంటి సందేహం లేదు. ఈ విధంగా రిజర్వేషన్ల వర్గీకరణ లక్ష్యంతో వచ్చిన దండోర ఉద్యమం సమాజంలోని అన్ని రంగలపైన ప్రభావం చూపినట్లే సాహిత్య రంగంపై కూడా ప్రభావం వేసింది.

వర్గీకరణోద్యమానికి మద్దతుగా ఎండ్లూరి సుధాకర్ 'వర్గీకరణీయం', 'కొత్త గబ్బిలం', 'మాగిక్కేక,' 'వర్గీకరణే హైటెక్ ఔషదం', 'దండోరా దరవు', 'కైతునకల దండెం', 'మాదిగ చైతన్యం', 'నలుగురమవుదాం', 'మాదిగ పొద్దు', 'కువ్వ', 'దప్పుల ప్రశ్న' వంటి రచనలు కవితా ప్రక్రియలో వచ్చాయి. కథా నవలా సాహిత్యాలలో కూడా దండోర సాహిత్యం వెలువడింది.

***"కాలం కల్లోలితం కాబోతోంది***

***కదనం కవన కర్మాగారం కాబోతోంది"*** (పు. 59) అని ప్రకటిస్తూ "డప్పోళ్ల రమేష్" వర్గీకరణోద్యమ కవిగా ముందుకు వచ్చాడు. గతంలో తన సంపాదకత్వంలో వెలువడిన 'కువ్వ' రచనను కొనసాగిస్తూ, "చిటిక కోలా దండోర" వర్గీకరణ ఉద్యమ దీర్ఘ కవిత వెలువరించారు. ఈ దీర్ఘ కవిత 14 భాగాలుగా ఉంది. కవిత ప్రారంభ వాక్యాలే మాదిగ కులాన్ని సూచిస్తూ అందులోని వృత్తిని ప్రతిబింబిస్తాయి. చెప్పులు కుట్టే వృత్తిని కవితాత్మకంగా చెబుతూ, చెప్పులు కుట్టిన ఆ కాళ్లకు మాత్రం చెప్పులు లేకుండా తిరిగారని ప్రస్తావిస్తూ....

***"లోకపు కాళ్లకు***

***దూది పరుపులై***

***మట్టిని ముద్దాడిన***

***ఎ(మ)ట్టి మనుషులం***

***మేమే కదా"*** (పుట. 21) అంటాడు. ఎదగడానికి చాలా అవకాశాలు ఉన్నా తాము ఇంకా అణచబడే ఉన్నామని

***"ఆకాశమంతా***

***నిచ్చెన ఉన్నా***

***అడుగు మెట్టె మా(ఆ)స్థానం"***(పు. 21) అని ప్రకటిస్తాడు.

గత అరవై ఏడు సంవత్సరాలుగా ఎస్సీ రిజర్వేషన్ల ఫలితాలను ఎక్కువగా ఉపయోగించుకున్నది మాలలే. ప్రభుత్వ గణాంకాలే దీనికి నిదర్శనం. రిజర్వేషన్ల వర్గీకరణ ఉద్యమ నేపథ్యంలో మాలలు చేసే కుట్రల స్వభావం తెలిసి కూడా ఏమీ చేయలేని స్థితిలోకి నెట్టివేయబడి, సహోదర తత్వాన్ని గౌరవిస్తున్నట్లు చెబుతూ...

***"చేసింది***

***చేస్తున్నది***

***చేయబోతున్నది***

***మోసమేనని ఎరిగినా***

***సోదరత్వానికి***

*సహోదర తత్వానికి*

*పరిమితమైనోల్లం"*(పుట. 2) అని అంటాడు.

మాదిగ దండోర పోరాటాల ఫలితంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వర్గీకరణపై రామచంద్రరాజు కమిషన్ అనే జ్యుడీషియల్ కమిషన్‌ను సెప్టెంబర్ 10, 1996లో ఏర్పాటు చేసింది. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు అనుకూలంగా ఈ కమీషను తన నివేదికను సమర్పించింది. ఆ తర్వాత జూన్ 6, 1999 ప్రభుత్వం జీవో ద్వారా షెడ్యూలు కులాల వర్గీకరణ కోటాను అమలు చేసింది. ఈ అమలును సవాలు చేస్తూ 2004లో మాలలు సుప్రీంకోర్టులో రిజర్వేషన్ల వర్గీకరణ రాజ్యాంగంలోని ఆర్టికల్ 341కి వ్యతిరేకమవుతుందని చేప్తూ దానిని కొట్టేయించారు. దేశంలోని న్యాయమూర్తులు ఎక్కువ శాతం అగ్రవర్ణాలకు చెందినవారే. రిజర్వేషన్ల ఫలితాలు కేంద్రీకృతం కాకుండా అందరికి అందితే వారు అభివృద్ధిలోకి వచ్చి, అధ్యయనం పెరిగి హెచ్చుతగ్గులు గల సమాజాన్ని ప్రశ్నిస్తారు. కనుక తమకు అనుకూల భావజాలం కలిగిన కొందరి వ్యక్తులతో కుమ్మక్కై రిజర్వేషన్లను అడ్డుకునే ప్రయత్నం చేశారు, చేస్తున్నారు. మన దేశంలోని న్యాయవ్యవస్థను ఈ కోణం నుండి కూడా అధ్యయనం చేయాలి. ఈ కుట్రను కవి కవితాత్మకంగా

*"అరవయ్యొక్క మందిమి*

*పాయిదాగి*

*ప్రాణం బోసుకుందామంటున్నా*

*పొదుగును మటు మాయం జేసి*

*పోటికి రమ్మంటున్నవు*

***న్యాయమా"***(పు.23) అని ప్రశ్నిస్తాడు. దేశంలోని అగ్రకులాల మాదిరిగానే కొందరు మాలలు చదువుల్లో, ఉద్యోగాల్లో తమతో సరిగా ప్రతిభను కనపరచాలంటూ బ్రాహ్మణీయ భావజాలాన్ని మాదిగలపైకి సవాలుగా విసురుతున్నారు. అంబేద్కరిస్టులుగా చెప్పుకుంటూనే అంబేద్కర్ భావజాలాన్ని పూర్తిగా వదిలిపెట్టి మనువాదులకు మరో రూపుగా మారుతున్నారు. ఈ విధంగా మాలలు అన్ని రంగాలలో (మాదిగలతో పోలిస్తే) చైతన్యంగా ఉన్నారు.

వర్గీకరణోద్యమానికి మద్దతుగా కవి ఎండ్లూరి సుధాకర్ 'వర్గీకరణీయం' రాసినప్పుడు దాని ప్రతి సవాలుగా గూటం స్వామి 'ఏకీకరణం' రాశాడు. ఏకంగా పరుష పదజాలంతో దూషించాడు కూడా. "వర్గీకరణ వల్ల మేలుకంటే కీడే ఎక్కువ జరిగిందని మీ సత్తు బుర్రలకు ఇప్పటికైనా ఎక్కదా?" అని అంటాడు. ఈ మాటల్లో అగ్రకుల భావజాలం స్పష్టంగా కన్పిస్తుంది. తిట్లతో కూడిన ద్వేషం, చిన్నచూపు కన్పిస్తుంది. కేవలం సాహిత్యంలోనే కాదు బయటి సమాజంలో కూడా ఇదే పరిస్థితి ఉంది. ఇన్ని రకాల ఈర్ష్యాద్వేషాలు ఉన్నప్పుడు ఏకీకరణ భావన ఎలా కుదురుతుందో ప్రశ్నిస్తూ

*"సహోదరుడా*

*సహోదరత్వం లేనివాడా*

*సమానత్వం గొంతు నులిమినవాడా*

*మన బంధం*

*ఎట్లా వికసిస్తుందో వినిపించరాదా" (పు. 24).*

*"పంపకంకాడ పొసగనప్పుడు*

*పాలన........*

*ఐక్యత.........*

*అరవడం......*

*అన్నాలమే గదా"* (పు. 67) అని అంటాడు.

దళిత సమాజంలో పేరెన్నికగన్న మాల సామాజిక వర్గానికి చెందిన కవులు, రచయితలైన బొజ్జా తారకం, కాకి మధవరావు, కత్తి పద్మారావు, గద్దర్, గోరటి వెంకన్న తదితరులు హైదరాబాద్ కేంద్రంగా ఎస్సీ వర్గీకరణకు మద్దతుగా ముందుకు వచ్చి ఒక ఒప్పందాన్ని తయారుచేసి అందరూ సంతకాలు చేశారు. ఇది పూర్తి కార్యరూపం దాల్చలేదు. వర్గీకరణకు మద్దతుగా నిల్చున్నందుకు కొందరు భౌతిక దాడులకు కూడా గురయ్యారని విన్నాను. దీనిలో వాస్తవమెంతో నాకు తెలియదు. వీరందరు వారి శక్తి సామర్థ్యాల స్థాయిలో పని చేయలేదనే ఆర్తితో మాల సామాజిక వర్గానికి చెందిన కొందరు రచయితలు, లాయర్లు, మేధావులుగా ఉన్న వారిపై విమర్శ పెట్టాడు.

*"బారెడు వొయ్యిల చీటి పెట్టి*

*కత్తి*

*నీవు రాసిన కాయితాలల్ల*

*సిరా చుక్కలు*

*మా వాటా తేల్చలేదేం" (పు.30)*

*"తారక మంత్రం*

*ద్వారక వరకు వ్యాపించినా*

*దండోరాను*

*దరిచేరనియ్యలేదు"* (పు. 31) ఈ విమర్శలను భావోద్వేగ సందర్భాలలోంచి అర్థం చేసుకుంటే సరైన సమాధానం లభిస్తుంది.

విప్లవ శిబిరంలో వర్గీకరణ విషయంపైన చాలా స్పష్టమైన అభిప్రాయం కలిగి ఉందని వారి కార్యాచరణను బట్టి చూస్తే అర్థం అవుతుంది. విప్లవ శిబిరంలో మాదిగేతర సామాజిక వర్గానికి చెందిన శివసాగర్

*"వరికిల్లు తిని*

*మందే మాదిగ దప్పులా*

*ఉదయిస్తోన్న సూరీడుపై*

*చిర్రా చిటికన పుల్ల తీసుకొని*

*చినుకుల్లో చిందేస్తున్నాను"* అని ప్రకటించడం వెనుకాల విప్లవ చైతన్యమే దాగి ఉందన్న విషయాన్ని మనం గుర్తించాలి. ఒకే శిబిరానికి చెందిన ఇద్దరిని కవి చూసిన విధానాన్ని గమనిస్తే అవగాహన విషయంలో ఎక్కడో సమస్యగా ఉన్నట్లు తోస్తుంది.

*"విప్లవ పోరాటాల్లో*

*కళ్యాణ కాంతుల్ని*

*వెదజెల్లిన వసంతమా*

*మీ తోటలో నన్నంత తెలివిగా*

*అంటరానివాన్ని చేశావే" (పు. 32)*

*"గద్దరన్నా*

*చెద్దరు వీడినందుకు*

*చేయి అందించినందుకు*

*భాయిభాయి అంటున్నందుకు*

*నా నీలిసలాం*

*ఆలింగనాలు...........*

*అభివందనాలు......"* (పు. 33) రిజర్వేషన్ల వర్గీకరణకు మద్దతుగా రాయనందకు జి.కల్యాణ్‌రావుని ప్రశ్నించినట్లే, రాసినట్లయితే గద్దర్‌ని గౌరవించవచ్చు. కానీ చెద్దరు వీడి విప్లవ గీతాలు పాడనందుకే ఆలింగనాలు, అభివందనాలు అంటూ రచయిత విమర్శించడం సరైంది కాదు. కళ్యాణరావు, గద్దర్ వీరిద్దరూ సాహిత్యానికి చేసిన కృషి అంతా ఇంతా కాదు. ఉద్యమకారునికి తమ ఆకాంక్షలను గుర్తించని వారిని విమర్శించడంలో ఎంత హక్కుందో రాసే వాక్యాల మాటున ఇతర ఉద్యమాల పట్ల, ఉద్యమ మార్గాల పట్ల కూడా గౌరవ భావాలు కలిగి ఉండాలి కదా. సిద్ధాంతం రీత్యా భేదాభిప్రాయాలు ఉన్నప్పుడు చాలా ప్రజాస్వామికంగా ప్రకటించవచ్చు. కానీ వ్యక్తుల దృష్టితో చూసినప్పుడు తన అవగాహనను తెలపడంలో ఈ కవి తడబడ్డాడు.

ప్రత్యేక తెలంగాణ విషయంలో ఇరుప్రాంతాలకు చెందిన మాల సామాజిక వర్గాలు తెలంగాణ ఉద్యమానికి మద్దతు తెలిపాయి. కానీ వర్గీకరణ విషయానికి వచ్చేసరికి మాదిగల ప్రజాస్వామిక ఆకాంక్షను గుర్తించని వారి సంకుచిత భావజాలాన్ని ప్రశ్నిస్తూ....

*"విభజన సూత్రాల*

*అంగీకరించిన బుర్రలు*

*పంపక న్యాయ సూత్రాలు*

*వద్దంటారెందుకు*

*యిడాకుల మీద*

*పారేసుకున్నంత మమకారం*

*పంపుకం మీద లేదంటే*

*వంచకులు"* (పు.34) కవితాత్మకంగా వర్ణిస్తాడు. భార్యభర్తలు విడిపోవడానికి తీసుకునే విడాకులు అనే పత్రాన్ని అన్నాదమ్ముల మధ్య వాడటం అనేది విడిపోవడం అనే అర్థం ఉంది.

సమాజంలోని ఇతర అస్తిత్వాలను గుర్తిస్తున్నట్లు చెప్పుకునే వారిని గురిగింజతో పోల్చి తేడాలు చెప్పడం చాలా సమంజసంగా కోరుతుంది. ఈ కవి అడవి కంచెల పొంటి తిరిగినట్లు కింది వాక్యాల వల్ల తెలుస్తుంది. అట్ల తిరిగిన వారికి మాత్రమే గురిగింజలు, దాని పరిచయం ఉంటుంది.

*"గురిగింజ ఎరుపని మురిసిన*

*మురిపెం*

*కిందున్న నలుపు మాటేమిటి*

*అయ్య"* (పు. 36). గురిగింజ ఎరుపుగా బాగుందని ఆనందం పొందినా ఆ ఎరుపుని దెబ్బతీసే నలుపు రంగు ఉన్నట్లే వర్గీకరణను అంగీకరించని భావజాలాన్ని గురిగింజలోని నలుపు రంగుతో పోల్చడం సమంజసంగా ఉంది.

ఇంతకు ముందు ఎన్నడు లేని విధంగా హిందూత్వ శక్తులు నేడు మాదిగలకు సహాయం చేస్తున్నట్లు నటిస్తున్నాయి.

దళితులు ఈ స్థాయిలో ఉండటానికి కారణం ఈ హిందుత్వమే కదా. రిజర్వేషన్ ప్రక్రియకు ఇతర పార్టీలు సహాయం అందించడంలో హిందుత్వ రాజకీయాలను అర్థం చేసుకోవాల్సిన అవసంరం ఉంది. ఒక ఉద్యమంలో చాలా రకాల ఆకాంక్షలు వస్తాయి. వాటిని సాధించే క్రమంలో ఒక ఆకాంక్ష నెరవేరగానే మన ఉద్యమ సహచరులే మిగతా ఆకాంక్షల సాధనకు అడ్డుపడతారు. రిజర్వేషన్ల వర్గీకరణ విషయంలో కూడా ఇది నిరూపితమైంది. తెలంగాణ చరిత్రంతా ఈ విధంగా దెబ్బదిన్న చరిత్రే. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ఆశయాలైన దున్నేవానికి భూమి, పీడనలు లేని సమాజం వంటి ఆకాంక్షలు భారత యూనియన్లో కలవడంతో ఆవిరైపోయాయి. వాటి కోసం ఇంకా పోరాడుతూనే ఉన్నాం. ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో ప్రజాస్వామిక తెలంగాణ, ప్రజా తెలంగాణ లక్ష్యాలతో పాటు భౌగోళిక తెలంగాణ కూడా ఒక అంశమే. కానీ భౌగోళిక తెలంగాణ మాత్రమే సాధించి మిగతా లక్ష్యాలను మన పాలకులే నిర్లక్ష్యం చేస్తున్నారు. ఈ పోరాట అనుభవాల నేపథ్యం నుంచి రిజర్వేషన్ల వర్గీకరణ ఉద్యమాన్ని నడిపించాల్సిన అవసరం ఉంది.

*"కుట్రదారుదా.........*

*వర్గీకరణ చేస్తే*

*హిందుత్వ శక్తుల విదదీత*

*బీజేపీ సర్కార్ కుట్ర*

***అంటున్నవు"*** (పు.43) వర్గీకరణ ఏ విధంగానైనా సాధించాలనే తపన కొందరిలో ఉన్నట్లు తెలుస్తుంది. అందుకు ఈ కవి కూడా అతీతుడు కాదు. కానీ రిజర్వేషన్లే ఎత్తి వేయాలని బీజేపీని నడిపించే మాతృ సంఘం అయిన ఆర్.ఎస్.ఎస్ భావిస్తున్నట్లు చాలా బాహాటంగానే చాలా సందర్భాలలో ప్రకటిస్తూనే ఉన్నది. ఈ మధ్యనే రిజర్వేషన్ల మీద సామరస్య పూర్వక చర్చ జరగాలని ప్రకటించిండు. దీనిపై దళిత, బహుజన రచయితలందరు ఉమ్మడి కార్యాచరణ ప్రకటించాల్సి ఉంది. అదే బీజేపీకి నాయకులను సప్లయ్ చేసే ఆర్.ఎస్.ఎస్. రిజర్వేషన్లనే తొలగించే ఆలోచన ఉండగా, అందులో ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ విషయంలో స్పష్టమైన అభిప్రాయం కలిగి ఉండి మనకు సహకరిస్తుందా అని ఆలోచించుకోవాల్సిన సందర్భం.

దళిత సమాజిక వర్గంలో మాలల చేత అణచి వేయబడుతున్న వారిగా వర్గీకరణ అనే న్యాయమైన డిమాండును సమాజం ముందు పెట్టారు. అందులో ముఖ్యంగా మాల సామాజిక వర్గం ముందు పెట్టారు. మనం విడిపోయి ఎవడి బుక్క వారమే తింటూ, మన రిజర్వేషన్లను కాపాడుకోవచ్చు అని ప్రకటిస్తున్నారు. దీనిని ఈ కవి ఇలా ప్రకటిస్తూ......

***"వేర్లు ఒక్కటై మొదలును***

***కాపాడుకుంటయి***

***కొమ్మలన్ని విడువడి చెట్టును***

***బలపరుచుకుంటయి***

***ఆకులు ఒక్కొక్కటే అయినా***

***చెట్టునే బ్రతికించుకుంటయి***

***ఇప్పుడు చెప్పుమనమేమి చేద్దామో?"*** (పు. 71) సమాధానం కొరకు వేచి చూస్తున్నాడు.

అగ్రవర్ణాలు తమను అణచివేస్తున్నాయనే దళిత సాహితీకారులు తమ సోదరులు అడుగుతున్న వర్గీకరణ అనే ప్రజాస్వామిక ఆకాంక్షను బలపరచకపోవడం అప్రజాస్వామికమైన ఆలోచనగానే తోస్తుంది. దీనికి దళిత సాహితీకారులు సమాధానం చెప్పాల్సి ఉంటుంది. ప్రజాస్వామిక భావజాలం కలిగిన ప్రతి ఒక్క రచయిత, దళిత రచయిత, మరీ ముఖ్యంగా మాల రచయితలు ఈ వర్గీకరణ డిమాండుకు మద్దతు తెల్పాల్సిన ప్రాసంగికత నేడు సమాజం మొత్తం పరుచుకొని ఉంది. లేకపోతే సమాజ పరిణామ క్రమంలో చెడ్డవారుగా అప్రతిష్టపాలు కావాల్సి ఉంటుంది. డప్పోళ్ల రమేష్ సామాజిక ఆకాంక్షను నవంబర్ 27న జరిగిన (ఈ పుస్తకం ముద్రణ సమయానికి జరగలేదు) మాదిగల ధర్మపోరాటాన్ని కవితాత్మకంగా వర్ణిస్తూ, మాదిగల ప్రజాస్వామిక ఆకాంక్షను వెలువరించాడు. ఈ దండోర ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ఇలాంటి రచయితలపైన మరింతగా ఉంది. సోదర సమాజం సహకరించాల్సిన అవసరమూ ఉంది.

**ఉపయోగించిన పుస్తకాలు:**


1. కాశీం, సి. "ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ సామాజిక న్యాయం". హైదరాబాద్: స్టూడెంట్ మార్చ్ ప్రచురణలు, 2018.

2. రమేష్, డప్పోళ్ల. ''చిటిక కోలా దండోర''. హైదరాబాద్: బహుజనం సాంస్కృతిక వేదిక, 2016.

3. జగన్, కె.(సం.) "స్టూడెంట్ మార్చ్" (మాస పత్రిక). హైదరాబాద్: వాల్యూమ్-5, ఇష్యూ-6, జులై 2019.



★ **రచయిత: పరిశోధక విద్యార్థి**

# భూమి పట్టాలకై ప్రజల పోరాటం

జనార్ధన్

ఆగస్టు 27న పూర్వపు నిజామాబాద్ జిల్లా పరిధిలో సదాశివనగర్ మండలం, యాచారం తండలో, భీంగల్ మండలం, తాళ్ల పల్లి గ్రామంలో భూమి పట్టాలకై సభలు జరిగాయి.

యాచారంలో రెండు వేల ఎకరాల అటవీ భూమి ఉంది. ఈ భూమి 1990లో ప్రజల నాయకత్వంలో జరిగిన పోరాటంలో ఫారెస్ట్ శాఖ నుంచి ప్రజలు స్వాధీనం చేసుకున్నారు. అప్పటి నుంచి ఆ గ్రామ ప్రజలు భూమిని సాగు చేసుకుంటున్నారు. పట్టాల కోసం ప్రజలు ప్రభుత్వాన్ని అడుగుతూనే ఉన్నారు.

2009లో కేవలం 30 మందికి వ్యక్తిగత పట్టాలు ఇచ్చి అప్పటి ప్రభుత్వం చేతులు దులుపుకుంది. మిగతా భూమికి వ్యక్తిగత పట్టాలు ఇవ్వకుండా సామూహిక పట్టాలు ఇచ్చారు. 2009 నుంచి సామూహిక పట్టాలను, వ్యక్తిగత క్లెయిమ్స్‌గా మార్చాలని పోరాడుతున్నారు. అటవీ శాఖ మంత్రిని కలిశారు. ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ వారు జూన్ నెలలో స్వాధీనం చేసుకోవడానికి వస్తే ప్రజలు ప్రతిఘటించారు. ఈ విషయం బయటకు రావడంతో తెలంగాణ ప్రజాఫ్రంట్ బృందం వెళ్ళి ప్రజలను కలిసింది.

పోడు భూముల సభ సందర్భంగా ఆగస్టు 27న, ఉదయం గ్రామంలో సభ నిర్వహించారు. ఈ సభలో టీపీఎఫ్ అధ్యక్షుడు రవిచందర్, ప్రధాన కార్యదర్శి మెంచు రమేష్, తెలంగాణ రైతాంగ సమితి రాష్ట్ర అధ్యక్షుడు సాయన్న, రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్, టీపీఎఫ్ కామారెడ్డి జిల్లా కోశాధికారి లచ్చన్న, గ్రామ సర్పంచ్ బలరాం నాయక్, ఎంపీటీసీ రాజు ఇంకా 100 మంది ప్రజలు ఈ సభలో పాల్గొన్నారు.

అదే రోజు మధ్యాహ్నం భీంగల్ మండలం తాళ్లపెల్లి గ్రామంలో జరిగిన సభకు దాదాపు 150 మంది ప్రజలు 30 గ్రామాల నుండి తరలి వచ్చారు. ఈ సభకు నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు జనార్ధన్ సభాధ్యక్షత వహించారు.

వివిధ గ్రామాల సర్పంచ్‌లు ఈ సభలో మాట్లాడారు. వారు మాట్లాడుతూ అప్పటి పీపుల్స్‌వార్ పార్టీ ఆధ్వర్యంలో ఈ భూముల కోసం జరిగిన పోరాటాలు గుర్తు చేసుకున్నారు. అప్పటి నుండి తమ భూముల జోలికి ఎవరూ రాలేదు. ఇప్పుడు మాత్రం ఫారెస్ట్, రెవిన్యూ వాళ్లు మాదంటే, మాది అని మమ్మల్ని ఇబ్బంది పెడుతున్నారు. ఆ భూములకు పట్టాలు ఇవ్వడం లేదు. మా సమస్యకు స్పందించిన తెలంగాణ ప్రజా ఫ్రంట్‌కు ధన్యవాదాలు తెలిపారు.

రవిచంద్ర మాట్లాడుతూ ఇక్కడ అటవీ హక్కుల చట్టం అమలు కాలేదని చెప్పడానికి ఈ భూములకు పట్టాలు నిరాకరించడమే నిదర్శనం. ప్రభుత్వాలు సుప్రీంకోర్టు తీర్పును రద్దు చేయించడంలో నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నాయి. అంతే కాకుండా అడవి మీద ప్రజలు హక్కులను తొలగించి వారిని వెళ్లగొట్టేందుకు కొత్త చట్టాలు తెస్తున్నాయి.

అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ముఖ్యమంత్రి ఆరు నెలల్లో పట్టాలు ఇస్తానని హామీ ఇచ్చారు. కానీ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజలు సాగుచేసుకుంటున్న అటవీ భూములను గుంజుకోవడం ప్రారంభించారు. తిరగబడ్డ ప్రజలపై కేసులు పెట్టి జైలుకు పంపిస్తున్నారు. మద్దతుగా నిలుస్తున్న వారిని ఎన్‌కౌంటర్ల పేరుతో చంపివేసారు. హరితహారం అనే అభివృద్ధి ముసుగు వేసుకొని తెలంగాణ ప్రభుత్వం మరింతగా భూములు గుంజుకుంటున్నది. మన భూములు మనకు దక్కాలంటే పోరాటాలు చేయడం తప్ప మరోకటి లేదన్నారు. ఈ కార్యక్రమంలో రమేష్, సాయన్నతో పాటు టీపీఎఫ్ జిల్లా కమిటీ నాయకులు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు. ఈ సభ ఉత్సాహంగా జరిగింది. ప్రజల భూముల కోసం ఎంతకైనా తెగించి పోరాడతామని నినదించారు.

★ రచయిత: టీపీఎఫ్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు T

# ఆదివాసీలు, గిరిజనులు, పేదలు సాగు చేసుకుంటున్న అటవీ భూములకు పట్టాలివ్వాలి

ప్రియమైన ప్రజలారా

ఆదివాసీలకు, ఇతర సాంప్రదాయ అటవీ నివాసులకు జరిగిన చారిత్రక అన్యాయాన్ని తొలగించి వారి అటవీ హక్కులను గుర్తించడానికి పార్లమెంట్ అటవీ హక్కుల గుర్తింపు చట్టం 2006ను ఆమోదించి అమలులోకి తెచ్చింది. అటవీ పరిరక్షణ దృష్టి నుండి కూడా ఈ చట్టం చారిత్రక ప్రాధాన్యతను సంతరించుకుంది. ప్రజా ఉద్యమాల ఒత్తిడితో చట్టం తెచ్చినప్పటికీ అమలు చేయడంలో పాలకులకు చిత్తశుద్ధి లేదు. ఫలితంగా చట్టం పాక్షికంగానే అమలు జరిగింది. ప్రజానుకూల చట్టాలను నీరు గార్చే పని పెట్టుకున్న మోడీ సర్కార్ దీనిని కూడా తుంగలో తొక్కాలనుకుంది. అందులో భాగమే సుప్రీంకోర్టు తీర్పు. కేంద్ర ప్రభుత్వ విధానానికి తెలంగాణ రాష్ట్ర విధానం తోడుకావడంతో పోడు భూమిని నమ్ముకొని జీవిస్తున్న లక్షలాదిమంది ప్రజలకి దిక్కు తోచడంలేదు. కేసీఆర్ ప్రభుత్వం ఆదివాసీలపైకి ఫారెస్ట్ శాఖకు తోడు పోలీసులను ఉసిగొలిపి పెద్ద ఎత్తున ఆదివాసీలపై దాడులు చేస్తూ భూములను ఆక్రమించుకొని కేసులు పెడుతున్నారు.

అటవీ సంరక్షణ వాదులుగా ప్రకటించుకున్న కొందరు ఈ చట్టానికి వ్యతిరేకంగా సుప్రీంకోర్టు కేసు వేశారు. దాని ఫలితంగానే 2019 ఫిబ్రవరి 13వ తేదీన సుప్రీంకోర్టు అటవీహక్కుల చట్టం ప్రకారం పెట్టుకున్న దరఖాస్తులు తిరస్కరించబడిన వారిని అడవుల నుండి తొలగించాలని తీర్పునిచ్చింది. ఈ తీర్పు దేశవ్యాప్తంగా ఆదివాసీలలో ఆందోళనను కలిగించింది. ఈ తీర్పు అన్యాయమైనదని, దాని వల్ల లక్షలాది మంది ఆదివాసీలు అడవుల నుండి గెంటివేయబడతారని ఆదివాసీలు, ప్రజాస్వామిక వాదులు నిరసనలు తెలియచేశారు. ఫలితంగా సుప్రీంకోర్టు ఆదివాసీలను తొలగించే ఉత్తర్వులను నిలుపుదల చేస్తూ ఫిబ్రవరి 28న తీర్పునిచ్చింది. జులై 24 తేదీలోపు రాష్ట్ర ప్రభుత్వాలు అటవీ హక్కుల దరఖాస్తుల గురించి పూర్తి వివరాలను కోర్టుకు సమర్పించాలని ఆదేశించింది.

తెలంగాణలో 2018 నవంబర్ 30వ తేది నాటికి 94,360 అటవీ హక్కు పత్రాలను పంపిణీ చేశారు. (వీటిలో వ్యక్తిగత 93,636, సామూహిక 721 దరఖాస్తులు) 7,54,339 ఎకరాలభూమికి హక్కు పత్రాలు అందాయి. 83,757 దరఖాస్తులు తిరస్కరించబడ్డాయి. అంటే 44 శాతం క్లెయిమ్స్ తిరస్కరించారు. ఈ వాస్తవాలు తెలిసి కూడా తెలంగాణ ప్రభుత్వం గత ఐదేండ్లుగా పట్టాలు లేని భూములతో పాటు పట్టా భూములను కూడా గుంజుకుంటుంది. సాగు చేసుకోకుండా భూముల చుట్టూ భారీ కందకాలు తవ్వుతున్నది. పాత పట్టాలు కలిగి వున్న వారికి కొత్త పట్టాలు ఇవ్వలేదు. అడ్డుకుంటున్న ప్రజలపై కేసులు పెట్టి జైలుకు పంపిస్తున్నది. ప్రజలల్లో వస్తున్న వ్యతిరేకతను చూసి అసెంబ్లీ ఎన్నికల్లో పోడు భూములకు పట్టాలిస్తానని నమ్మబలికారు. తీరా ఏరు దాటాక బోడ మల్లయ్య అన్నట్లు ప్రభుత్వం మళ్లీ అదే దౌర్జన్యం కొనసాగిస్తున్నది. ఆదిలాబాద్ జిల్లా దంతన్‌పల్లిలో ఆదివాసీలు ఎప్పటి నుండో సాగు చేసుకుంటున్న భూముల్లో వ్యవసాయం చేయనీయడం లేదు. ఈ ఊరు ఒక్కటి మాత్రమే కాదు వందలాది ఆదివాసీ గ్రామాలలో ఆదివాసీ పేద రైతాంగం ఎప్పుడూ తమ భూములను ప్రభుత్వం ఆక్రమిస్తుందనే భయంతో జీవిస్తున్నారు. కుంరంభీం అసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలం, గోండి గ్రామంలో ఫారెస్టు అధికారులు ఆదివాసీల గుడిసెలని పీకేశారు. 80 ఏళ్ళ క్రితం కొమరం భీం నాయకత్వంలో పోడు భూములకై, స్వీయగౌరవంకై, అడవిపై హక్కుకై పోరాడిన చోటనే స్వతంత్ర భారతంలో నిరుపేద ఆదివాసులకు నిలువనీడలేకుండా చేయడం సిగ్గుచేటు. రాజ్యాంగాన్ని, చట్టాలను ఉల్లంఘించి పాలకులు సాగిస్తున్న ఇటువంటి దుర్మార్గపు చర్యలను, దురాక్రమణ విధానాలను తప్పుపట్టి సరిచేయాల్సిన న్యాయవ్యవస్థ అత్యంత దిగజారుడు తీర్పు ఇచ్చి తన వైఖరి ఏమిటో పేద రైతాంగానికి మరోసారి తెలియజెప్పింది. కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలం యాచారం తాండాలో లంబాడాల పట్టాభూమిని గుంజుకున్నారు. నిజామాబాద్ జిల్లా సిరికొండ ప్రాంతంలో 30

గ్రామాలలో అనేక పోరాటాల ద్వారా లంబాడీలు సాధించుకొన్న 20 వేల ఎకరాలకు పైగా ఉన్న పోడుభూమిని ఫారెస్టు శాఖ ఆక్రమించడానికి ప్రయత్నం చేస్తున్నది. భూపాలపల్లి జిల్లా తాడ్వాయి, ఏటూర్ నాగారం, కాటారం, మహాముత్తారం మొదలైన మండలాలలో భూములను ఆక్రమించడం కోసం ఫారెస్టు పోలీసు శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయి. ములుగు, కొత్తగూడెం, మహబూబాబాద్, నాగర్‌కర్నూల్ జిల్లాలలో కూడా ఇదే పరిస్థితి కొనసాగుతున్నది. ఇటీవల జరిగిన ఎన్నికలలో అధికార తెరాస, ప్రతిపక్ష కాంగ్రేసు పార్టీలు పోడు భూములకు పట్టాలిస్తామని వాగ్దానం చేశాయి. కానీ అధికార పార్టీ పెద్దలు చేసిన వాగ్దానాలను మిగతా వాటిలాగే మరిచిపోయారు. ప్రతిపక్ష పార్టీలు చడీచప్పుడు లేకుండ నిద్రపోతున్నాయి.

రాష్ట్ర ప్రభుత్వానికి అంతగా పర్యావరణాన్ని పెంపొందించాలని వుంటే తెలంగాణలో మైదాన ప్రాంతంలో 16శాతం దేనికి ఉపయోగపడని భూమి వుంది. ఇంత భూమిని వదిలేసి 2 శాతం కూడా లేని పోడు భూములను గుంజుకోవడం ఎందుకు? ఇది పాలకులకు తెలువక చేస్తున్నది కాదు. అడవిలో వున్న సంపదను దోచుకునేందుకు బహుళజాతి కంపెనీలు చేస్తున్న కుట్ర. హరితహారం, పర్యావరణ పరిరక్షణ, జీవవైవిధ్యం ఇలా పేర్లు ఏవైనా సరే సారాంశంలో పేద ప్రజలను నేరస్తులుగా చూపుతున్నారు. ప్రకృతిని, పర్యావరణాన్ని దారుణంగా విధ్వంసం చేస్తున్న రాజకీయ పార్టీలు, ప్రభుత్వాలు వాతావరణ సమతుల్యం గురించి మాట్లాడడం కన్న మోసం ఇంకొటి ఉండదు.

అడవి నుండి ఆదివాసీలను వెళ్లగొట్టడమే ప్రభుత్వ లక్ష్యంగా మారిన ఈ సందర్భంలో దశాబ్దాల తరబడి ఆదివాసీలు, పేదలు, గిరిజనులు సాగుచేసుకుంటున్న పోడు భూములకు పట్టాలివ్వాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ప్రజాఫ్రంట్ చేపట్టిన నిరసన కార్యక్రమాలను, **సెప్టెంబర్ 16న హన్మకొండలో జరిగే భారీ ధర్నా**ను విజయవంతం చేయాల్సిందిగా రాష్ట్రకమిటీ పిలుపునిస్తుంది.

## డిమాండ్స్ :

- **పోడు భూములపై ఫారెస్టు, పోలీస్ శాఖలు సమన్వయంతో చేస్తున్న దాడులను వెంటనే ఆపివేయాలి.**
- **రైతాంగంపై పెట్టిన కేసులను ఎత్తివేయాలి.**
- **కొమరంభీం ఆసిఫాబాద్ జిల్లా గోంది, సార్సాల గ్రామాల నుండి బలవంతంగా తరలించిన ఆదివాసి కుటుంబాలకు ఆదే గ్రామంలో స్థిరనివాసం కల్పించాలి. వారి భూములు వారికి తిరిగి ఇవ్వాలి.**
- **ఆదివాసీలను అడవుల నుండి తొలగించాలనీ ఫిబ్రవరి 13న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును రద్దుచేయాలి.**
- **తిరస్కరించబడిన అటవీ హక్కుల దరఖాస్తులన్నింటిని పెండింగ్ కేసులుగా పరిగణించి వాటిని సమీక్షించి పట్టాలివ్వాలి. కొత్త క్లెయిమ్స్ కూడా పట్టాలివ్వాలి.**
- **CAMPA చట్టాన్ని, కేంద్ర ప్రభుత్వం ఇండియన్ ఫారెస్టు యాక్ట్‌కు చేస్తున్న సవరణలను, రాష్ట్ర ప్రభుత్వం తెస్తున్న తెలంగాణ అటవీ చట్టం 2019ను రద్దుచేయాలి.**
- **కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అటవీ హక్కుల చట్టాన్ని షెడ్యూల్డ్ ప్రాంతాలకు పంచాయితీరాజ్ విస్తరణ చట్టంతో కలిపి అమలుచేయాలి.**

# తెలంగాణ ప్రజా ఫ్రంట్ (TPF)

ప్రచురణకర్తలు : కె.రవిచందర్, మెంచు రమేష్, రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు **9848333926, 9640537725**.
www.telanganaprajafront.com

# కుల రహిత, మత రహిత అస్తిత్వం కోసం

'నిను వీడని నీడను నేనే' అని ఆత్రేయ ఒక పాట రాశారు... ఎక్కడకు వెళ్లినా వెంటాడేది నీడ మాత్రమే కాబట్టి నిన్ను నీడలా వెంటాడుతా అని అర్థం.

'మతం' కూడా నీడ లాంటిదేనేమో.. పుట్టుక మొదలు చావు వరకూ మనల్ని వెంటాడుతూనే ఉంటుంది. అయితే నీడ పడాలంటే కాంతి తప్పనిసరి అనే ఒక సైన్స్ సూత్రం ఉంది. కాబట్టి చీకట్లో నీడ నుండి తప్పించుకోవచ్చు. కానీ మతం నుండి తప్పించుకోవడం చాలా కష్టం. ఇలా తప్పించుకోకుండా ఉండేందుకే ఆధిపత్య వర్గాలు మనువాద భావజాలంతో కుట్రలు చేశాయి. కులమతాలు లేని లక్షల సంవత్సరాల మానవ జీవపరిణామ క్రమాన్ని మతం, కులం అనే బోనులో పకడ్బంధీగా బంధీ చేశాయి.

మతం చెప్పడానికి నిరాకరిస్తున్నవారు మన దేశంలో లక్షల్లోనే ఉన్నారని ప్రభుత్వ లెక్కలే చెబుతున్నాయి. మాకు ఏ మతము వద్దు అని అనేకమంది దశాబ్దాలుగా ప్రభుత్వంతో పోరాటం చేస్తున్నారు. 1957 – 58లలో స్వాతంత్ర సమరయోధులు, ప్రముఖ నాస్తికులు గోరా దంపతులు తమ పిల్లల(సమరం, విజయం) విషయంలో మతరహితులు గా ప్రకటించుకునే అవకాశం ఇవ్వాలని కోరగా, అప్పటి అసెంబ్లీ సమావేశాలలో ఈ విషయం చర్చకు వచ్చింది. వీరే కాదు, అనేకమంది దశాబ్దాలుగా ఇటువంటి అస్తిత్వ ప్రకటనకు వీలుగా అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. వ్యక్తిగత స్థాయిలో అనేకమంది ఇటువంటి ఆకాంక్షను వ్యక్తం చేస్తూనే ఉన్నారు. కొన్ని సందర్భాలలో వ్యక్తిగత పరిష్కారం చూపడం, లేక తమకు తోచింది నింపడం, దాటవేయడం అనే పద్ధతి కొనసాగుతోంది. కానీ విధాన పరమైన నిర్ణయం తీసుకోవడం లేదు. అయితే ఈ పోరాటం ఈనాటిది కాదు. మతంతో పాటు మతాన్ని వ్యతిరేకించే లోకాయతులు, చార్వాకులు, బౌద్ధులు ఆయాకాలాలలో ఉన్నారు. వారి వారసత్వం కొనసాగుతూనే ఉంది.

మతం పేరిట జరిగిన మారణహోమంలో కోట్లాది మంది చనిపోయారు. మానవ శిరస్సుల్ని కోట గుమ్మాలకు కట్టారు. ఒక ఆధిపత్య మతం వారు ఇంకొక మతంపై జరిపిన ఊచకోతల్లో ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది మంది చనిపోయారు. ఒక్క మన దేశంలోనే మతం పేరిట గత 70 ఏండ్లలో కోటిమంది వరకు హత్యకు గురయ్యారని గణాంకాలు చెబుతున్నాయి.

ఇక కులం సంగతి కూడా అంతే, నిత్యం ఏదో ఒక ఊర్లో, ఎక్కడో ఒక చోట ఈ కులం కారణంగా అవమానాలకు, దాడులకు, హత్యలకు, హత్యాచారాలకు గురవుతూనే ఉన్నారు. దళితులన్న కారణంతో ప్రతి నాలుగు నిమిషాలకు ఒక దాడి, ప్రతి ఇరవై నిమిషాలకు ఒక హత్య, ప్రతి రోజు రెండు హత్యాచారాలకు గురవుతున్నారు. మన సమాజ ఉత్పత్తి వ్యవస్థ అనేక మార్పులకు గురవుతున్నా నిచ్చెనమెట్ల కులవ్యవస్థలో ఒక కులానికి చెందినవారు మరొక కులం వారిని హీనపరిచే సంస్కృతి కొనసాగుతూనే ఉంది.

దీనికి వ్యతిరేకంగా ఎన్ని పోరాటాలు చేసినా, ఎన్ని చట్టాలు చేసినా పెద్దగా మార్పేమీ లేదు. మతం పరిధులు దాటి మనుషులుగా ఆలోచించాల్సిన సందర్భంలో మనమంతా జీవిస్తున్నాం. "ఏది శాశ్వతం కాదు ఒక్క మార్పు తప్ప" అని ఒక పెద్దమనిషి అన్నట్లు మానవాళి తమ మూలాల ఎరుకలోకి ప్రయాణిస్తుందని నమ్ముతున్నాం. కొత్త తరం అలా రూపొందడానికి మన వంతుగా ప్రయత్నిద్దాం. అలాంటి ప్రయత్నంలో "కుల రహిత మత రహిత అస్తిత్వ" ప్రకటన కూడా దోహద పడుతుందని నమ్ముతున్నాం. ఈ ప్రయత్నంలో మేము మొదటి వాళ్ళం కాదు. మన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఈ దేశంలో కులనిర్మూలన జరగనిదే అభివృద్ధి సాధ్యం కాదన్నారు. మహాత్మా జ్యోతిబాఫూలే, సావిత్రీబాయి ఫూలే, పెరియార్ సహా అనేకమంది మహనీయులు సామాజిక వివక్షలకు వ్యతిరేకంగా పోరాడారు. మన తెలుగు నేలపై పోతులూరి వీరబ్రహ్మం, వేమన, భాగ్యరెడ్డి

వర్మ, జాషువా ఇంకా అనేకమంది గొప్ప తాత్వికతతో సామాజిక వివక్షలను నిలదీశారు. గురజాడ అప్పారావు "మతములన్నియు మాసి పోవును జ్ఞానమొక్కటే నిలిచి వెలుగును" అని భవిష్యత్‌పై ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

ఈ మధ్యనే తమిళనాడుకు చెందిన స్నేహ పార్తిబరాజా అనే న్యాయవాది సుదీర్ఘ పోరాటం తర్వాత 'మత రహితం కుల రహితం'(No Religion, No caste) సర్టిఫికెట్ పొందిన మొదటి వ్యక్తిగా వార్తల్లో నిలిచింది. మనిషిని కులంతోనో, మతంతోనో మాత్రమే గుర్తించే ఈ దేశంలో తనకు కుల, మత గుర్తింపులే అక్కరలేదని తొమ్మిదేళ్లు కొట్లాడి, ప్రభుత్వ అనుమతి సాధించడం సామాన్య విషయం కాదు. అందుకే 'ఇది ఒక సామాజిక విప్లవంగా మారుతుందన్న భయంతో తనకు సర్టిఫికేట్ ఇచ్చేందుకు అధికారులు ఇంత ఆలస్యం చేశారు' అని అన్నారు స్నేహ.

మన రాష్ట్రానికి వస్తే మా పిల్లల విషయంలోనూ మేము కూడా కుల రహితంగా, మత రహితంగా పిల్లలను పెంచాలని భావించాం. అయితే మా(డి.వి.రామకృష్ణారావు, ఎస్. క్లారెన్స్ కృపాళిని) పిల్లలను స్కూల్లో చేర్పించే సందర్భంలో దరఖాస్తులో మతం కాలాన్ని నింపనందుకు స్కూల్ యాజమాన్యం అభ్యంతరం చెప్పడంతో కుల రహితం, మత రహితం(No Religion, No caste) చెప్పుకునే హక్కు ఉండాలని కోర్టు మెట్లు ఎక్కాము. ఆ సందర్భంలో కోర్టు "మతం నమ్మడానికి హక్కు ఉందంటే, ఏ నమ్మకం లేకుండా ఉండడానికీ హక్కు ఉన్నట్లే" అని మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. అయితే దాన్ని చట్టం రూపంలోకి తీసుకురాలేదు. తరవాత పెద్దమ్మాయి ఇంటర్మీడియట్ ఆన్‌లైన్ అప్లికేషన్‌లోనూ మతం కాలమ్ తప్పనిసరిగా నింపాల్సిన పరిస్థితిలో ఇక ఇలా కుదరదని మార్చ్, 2017న హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం వేశాము. ఇంకా తీర్పు వెలువడాల్సి ఉంది.

అలాగే 2019 మార్చి 23న, భగత్ సింగ్ అతని సహచరుల వర్ధంతి నాడు డేవిడ్, రూప దంపతులకు పుట్టిన బాబు 'ఇవాన్ రూడే' బర్త్ సర్టిఫికెట్ కోసం స్థానిక మున్సిపాలిటీ ఆఫీసు(వనపర్తి జిల్లా కొత్తకోట)కు వెళితే ఏ మతానికి చెందిన వాళ్లో 'మతం' అనే కాలం నింపితే తప్ప సర్టిఫికెట్ ఇవ్వడం కుదరదని కరాఖండిగా చెప్పేసారు. పుట్టుక మొదలూ చావు వరకూ అన్నీ సర్టిఫికెట్లను ఆన్‌లైన్లో తీసుకోవాల్సిన నేటి పరిస్థితులలో 'మతం' అనే కాలం నింపితే తప్ప బర్త్ సర్టిఫికేట్ రావడంలేదు. మీరు కోరిన ప్రకారం సర్టిఫికెట్ ఇవ్వడం కుదరదని తేల్చిచెబుతున్నారు.

ఆ క్రమంలో మేము కూడా ప్రజా ప్రయోజన వ్యాజ్యం హైకోర్టులో దాఖలు చేశాం. మా ప్రజా ప్రయోజన వ్యాజ్యాల పనంతా న్యాయవాది, పౌరహక్కుల నాయకుడు డి.సురేశ్ కుమార్ చూస్తున్నారు.


అయితే మన దేశంలో శతాబ్దాలుగా వంచనకు గురై, అణగదొక్కబడ్డ ఎంతోమంది జీవితాలలో రిజర్వేషన్లు కొద్దిపాటి ఉపశమనంగా ఉన్నాయి. వారి అభివృద్ధికి ఎంతోకొంత దోహదపడుతున్నాయి. ఇవి పోరాడి సాధించుకున్న హక్కులు అనే విషయం మా అవగాహనలో ఉంది. రిజర్వేషన్లు తీసుకునే హక్కు ఎలా అయితే ఉందో, మత, కుల వ్యవస్థల నుంచి బయటకు రావాలాకునే వారికి ఆ హక్కు ఉండాలని మేము కోరుతున్నాం. ఈ నేపథ్యంలోనే మత రహితం–కుల రహితం అనే అస్తిత్వాన్ని గుర్తించాలని ప్రభుత్వంతో పోరాటం చేస్తున్నాం. మా ప్రజాస్వామిక ఆకాంక్షకు మీ అందరి మద్దతు ఉంటుందని ఆశిస్తున్నాం.

ఆ క్రమంలో 3 సెప్టెంబర్ ,2019 మంగళవారంనాడు హైదరాబాద్ లోని బాలింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రం షోయబుల్లా ఖాన్ హాల్‌లో కుల రహిత మత రహిత సర్టిఫికెట్ పొందిన మొదటి భారతీయురాలు, తమిళనాడుకు చెందిన స్నేహా పార్తిబరాజా(ఎం.ఎ. స్నేహ) గారితో సంభాషణ జరిగింది.

**– డి.వి.రామకృష్ణారావు, ఎస్.క్లారెన్స్ కృపాళిని, డేవిడ్, రూప**

**నడుస్తున్న తెలంగాణ ఆన్‌లైన్ వర్షన్ కోసం కింది పేజీలను సంప్రదించవచ్చు**

**ఫేస్‌బుక్ పేజీ:** www.facebook.com/pages/Nadustunna-Telangana



# యురేనియం తవ్వకాలపై గవర్నర్‌కి లేఖ


*తెలంగాణ రాష్ట్ర గవర్నర్ గారికి..*

తెలంగాణ రాష్ట్రంలో ప్రాముఖ్యమైన నల్లమల అడవిని, కృష్ణా నదిని, ఆదివాసీ చెంచు తెగను కాపాడాలని, అమ్రబాద్ పులుల అభయారణ్య ప్రాంతంలో చేపట్టబోతున్న యురేనియం తవ్వకాలను నిలిపివేయాలని కోరుతు...

దేశంలో అత్యంత ప్రాముఖ్యమైన అడవి నల్లమల. రెండు తెలుగు రాష్ట్రాలకు వారధిగా ఐదు జిల్లాలకు పచ్చని గొడుగుగా నీడనిస్తుంది. ఆదిమ మానవుడి నివాస ప్రాంతంగా చరిత్రలో తన స్థానాన్ని పదిలపరుచుకున్నది నల్లమల. ఆదిమ వాసులైన చెంచు తెగకు పుట్టినిల్లు నల్లమల. రెండు లక్షల సంవత్సరాలుగా జీవనదిగా పారుతూ మనిషి అస్తిత్వాన్ని కాపాడుతున్న కృష్ణా నదికి, దాని ఉపనదుల మనుగడకు సవాలుగా మారిన యురేనియం తవ్వకాలను నిలిపివేయాలని వివిధ రంగాలలో పనిచేస్తున్న బుద్ధిజీవులుగా మిమ్మల్ని కోరుతున్నాం.

నాగర్ కర్నూల్ – నల్గొండ సరిహద్దుల్లోని అమ్రబాద్ పులుల అభయారణ్యంలో 84చదరపు కిలో మీటర్లలో యురేనియం తవ్వకాల అనుమతులకు ప్రభుత్వాలు సిద్ధపడుతున్నాయి. అదే జరిగితే.. వైవిధ్యమైన నల్లమల అరణ్యంలో వందల రకాల అరుదైన సీతాకోక చిలుకలు జాతులు, సరిస ృపాలు, తేనెటీగలు, వందలాది రకాల జంతు, పక్షి జాతులు అంతరించిపోతాయి. జాతీయ జంతువు పులి, జాతీయ పక్షి నెమలి, రాష్ట్రీయ జంతువు జింకలకు పెట్టింది పేరు నల్లమల. యురేనియం తవ్వకాల వలన వెలువడే రేడియో ధార్మికతకు అవి బలవుతాయి. వేలాది సంవత్సరాలుగా అడవిని కాపాడుతు వస్తున్న చెంచుల సంఖ్య ప్రతీ యేడు తగ్గుతున్న విషాదంలో యురేనియం తవ్వకాలతో పూర్తిగా ఆ జాతి హననమైపోతుంది. కోట్లాది భక్తులచేత పుష్కరనదిగా పూజలందుకుంటున్న కృష్ణా నది క్రమంగా ఇంకిపోతుంది. విష రసాయనాలను ప్రవహిస్తూ జీవరాశినంతా బలిగొంటుంది. చెంచుల ఆరాధ్య స్మృతులు, దేశంలో అత్యంత పురాతన చరిత్ర గల శివాలయాలు ఉమామహేశ్వరం, శ్రీశైలం, సలేశ్వరం, రాయలగండి, మద్దిమడుగు, లొద్దిమాను, బౌరాపూర్ లాంటి చారిత్రక ప్రాంతాలు నిషిద్ధ ప్రాంతాలుగా మారిపోతాయి. కనువిందు చేసే మల్లెల్ల తీర్థంలాంటి జలపాతాలు కనుమరుగైపోతాయి.

ప్రక ృతి విధ్వంసం, మానవ విధ్వంసం, లక్షలాది మంది పూజిస్తున్న దేవాలయాల విధ్వంసం సృష్టించే యురేనియం తవ్వకాలను నిలిపివేయాలని వినమ్రంగా కోరుతున్నాం. జాతీయ ,అంతర్జాతీయ పర్యావరణ చట్టాలు, ఆదివాసీ చట్టాలను, స్థానిక ప్రజల అభిప్రాయాల మేరకు నల్లమల అడవిని కాపాడాలని కోరుతున్నాం. యురేనియం విధ్వంసం వలన రేపటి భవిష్యత్ తరం ముందు దోషులుగా మనం తలవంచి నిలబడకుండా ఉండే స్థితిని కల్పిస్తారని ఆశిస్తున్నాము.



RNI Number : APTEL /2011/37247

ISSN 2349 - 2376
Publishing Date : 6 - 09 -2019




# విధ్వంసానికి కొత్త ముసుగు

ఈ పత్రికను చదివాక మీ అభిప్రాయాలు రాయడం మర్చిపోవద్దు. మీ సూచనలే మా తొవ్వకు వెలుగు.

**To** Printed Matter **BOOK-POST**

*From :*

ఎడిటర్, నడుస్తున్న తెలంగాణ
క్వార్టర్ నెం. ఆర్-9, ఉస్మానియా క్వార్టర్స్, ఓయూ,
హైదరాబాద్- 500 007, ఫోన్ నెం. 9290745490

Stamp

చందాదారులుగా చేరండి - చేర్పించండి
సంవత్సర చందా200/- రూ.

నడుస్తున్న తెలంగాణ అకౌంట్ నెంబర్:
62254225854, ఎస్‌బీహెచ్,
రాంకోఠి బ్రాంచ్ (20350), హైదరాబాద్

**Printed, Published and Owned by** M.SNEHA LATHA Printed at: TELANGANA PUBLICATIONS, H.No.1-1-305, P.No.17, Road No. 6, Balaji Colony, Mohan Nagar, Kothapet, Saroornagar(M), Ranga Reddy-500035., Published at : TELANGANA PUBLICATIONS, H.No.1-1-305, P.No.17, Road No.6, Balaji Colony, Mohan Nagar, Kothapet, Saroornagar(M), Ranga Reddy-500035., Editor :Dr.C.KASEEM. RNI No. APTEL/2011/37247